

మా కలం - సామాన్యుడి బలం

# నంది

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


పత్రిక

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 221 | ఆదివారం 16 - 08 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


## జెన్-జీ శక్తితోనే మార్పు.. అవినీతి, కులాలపై పోరాటమే నిజమైన స్వేచ్ఛ



# వికాసం నుంచి వైభవం పైపు ఏపీ



స్వర్ణాంధ్ర ఐదున్నర కోట్ల ఆంధ్రుల సంకల్పం
అమరావతిలో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు
మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేసి, పోలీసు గౌరవ వందనం స్వీకరించిన సీఎం
ప్రతిభ కనపర్చిన పోలీసులకు పతకాలు అందించిన ముఖ్యమంత్రి

## చరిత్రను గుర్తుచేసుకొనే.. భవిష్యత్తును నిర్మించుకునే రోజు



కులం, మతం లేని ఏకైక జాతీయ పండుగ జెండా పండుగ
ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం
అన్నిరంగాల్లో ఏపిని ముందువరసలో నిలబెట్టే ప్రయత్నం
విజయవాడలో జెండా ఆవిష్కరణలో మంత్రి లోకేశ్

# భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణం



అన్ని రంగాల్లో దూసుకు పోయే తత్వం
సత్తా చాటగల నైపుణ్యాలు మన సొంతం
యువత ఓ గంట సమయం కేటాయిస్తే చాలు
జనగణనలో ఖచ్చితమైన సమాచారం ఇవ్వండి
దానితోనే దేశ అభివృద్ది ప్రణాళికలు రచించగలం
ఎర్రకోట నుంచి ప్రధాని మోడీ పిలుపు
ఎర్రకోట వేడుకలకు దూరంగా రాహుల్, ఖర్గే

భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణాలు ఉన్నాయని, అన్నిరంగాల్లో దూసుకుపోయే సమర్థత ఉందని ప్రధాని మోడీ అన్నారు. సవాళ్లు స్వీకరించి ముందుకు సాగడం ద్వారా మనమేంటో సత్తా చూసగలమన్నారు. ఎర్రకోట వేదికగా ప్రధాని మోడీ యువత లక్ష్యంగా పలు కార్యక్రమాలను ప్రకటించారు. కోటి మంది యువతకు ఏఐ నైపుణ్యాలలో శిక్షణ ఇస్తామని, పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తామన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించడమే.. ఉచిత కోచింగ్ కార్యక్రమ లక్ష్యమని చెప్పారు. అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతోన్న జనగణన గురించి ప్రస్తావించారు. దానిలో యవత చురుగ్గా పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు.

'నేను అందరినీ ఒక ఫేవర్ చేయాలని అడుగుతున్నాను. ఒక గంటా, రెండు గంటల సమయం కేటాయించండి. అది దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆ మాత్రం సమయం దేశాన్ని ఎలా బలోపేతం చేస్తుందా..? అని యువత ఆలోచిస్తూ ఉండొచ్చు. వారి భాగస్వామ్యంతో ప్రతి ఇంట్లో జనాభా గణనకు ఒక అనుకూల వాతావరణం ఏర్పడేందుకు అవకాశం ఉంటుంది. గణన అంటే లెక్కలన్నీ ఒక దగ్గర రాసుకోవడం కాదు. జనాభా లెక్కల సమయంలో ప్రజలు ఇచ్చే వివరాల ఆధారంగానే జాతీయ విధానాలు, పథకాలు రూపుదిద్దుకుంటాయి. దేశ ప్రగతికి ఆ లెక్కలు సూచీగా ఉంటాయి. అందుకే కచ్చితమైన, స్పష్టమైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం అని మోదీ పేర్కొన్నారు. అలాగే 'దిమాగీ నక్సల్స్' గురించి మాట్లాడుతూ.. వారిని దేశానికి కొత్త శత్రువులుగా అభివర్ణించారు.

'సంవత్సరాలుగా మావోయిస్టు భావజాలం ఉన్న వ్యక్తులు దేశంలో బలంగా పాతుకుపోయారు. అడవుల్లోని సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించి, ఆ సంక్షోభం నుంచి దేశాన్ని విముక్తి చేయడంలో ప్రభుత్వం విజయం సాధించింది. సాయుధ నక్సల్స్ కనుమరుగైనా.. 'దిమాగీ నక్సల్స్' మిగిలి ఉన్నారు. వారు ఒక అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. సమాజాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి వారు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. మనం వారిని గుర్తించి.. ఏకాకిని చేయాలని సూచించారు. తయారీ, వ్యవసాయం, సాంకేతికత, మౌలిక సదుపాయాలు, రక్షణ రంగం, గ్రీన్ అండ్ బ్లూ ఎకానమీ, ఇండియాస్ సాఫ్ట్ పవర్ కోసం 'సప్తధార' రోడ్‌మ్యాప్‌ను మోదీ ప్రకటించారు. మహిళా కోటా బిల్లుపై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో..

# లోక్ భవన్‌లో గవర్నర్ 'ఎట్ హోం'..




స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా లోక్ భవన్‌లో 'ఎట్ హోం'
గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో తేనీటి విందు
ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు
పాల్గొన్న మంత్రులు, న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు
గవర్నర్, ముఖ్యమంత్రి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు

భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ విజయవాడలోని లోక్ భవన్‌లో 'ఎట్ హోం' కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులను గవర్నర్ అబ్దుల్ నజీర్, ఆయన అర్ధాంగి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గవర్నర్, ముఖ్యమంత్రి ఇరువురూ ఒకరికొకరు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం గవర్నర్ దంపతులు ఆహ్వానితులకు తేనీటి విందు ఇచ్చారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ స్వయంగా ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించి, స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా భారత్

కాకినాడలో జెండా ఆవిష్కరించిన డిప్యూటి సిఎం పవన్



బలమైన, సమర్థ దేశంగా ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా భారత్ అడుగులు వేస్తోందన్నారు. వికసిత్ భారత్ సంకల్పంతో ఆంధప్రదేశ్ తనదైన పాత్ర పోషిస్తోందని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కాకినాడ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన



## 370 ఆర్టికల్ రద్దుచేయకుంటే
# పివోకె కలిసేది

### కాశ్మీర్ సిఎం ఓమర్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ పరిస్థితులపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా, రాష్ట్ర హోదాను 2019లో రద్దు చేయకపోయి ఉంటే.. ఇప్పుడు పీవోకే ప్రజలు జమ్మూకశ్మీర్‌లో తిరిగి విలీనం కావాలని కోరుతూ ఉద్యమించేవారని ఆయన అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శ్రీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఒమర్ అబ్దుల్లా ఈ వ్యాఖ్యలు చేశారు. పీవోకేలో ప్రజాస్వామ్య హక్కుల కోసం ఆందోళన చేస్తున్న ప్రజలపై జరుగుతున్న పరిణామాలు తనను బాధిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అక్కడ పలువురు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గాయపడి జైలుకు వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. 1947లో పాకిస్థాన్ నుంచి వచ్చిన ఆక్రమణదారులను ఎదుర్కొన్న కశ్మీరీ ప్రజలను ఒమర్ అబ్దుల్లా గుర్తుచేసుకున్నారు.

## చరిత్ర తెలుసుకుంటేనే భవిష్యత్ నిర్మాణం



టిఆర్ఎస్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో కవిత

# కీలక బాధ్యతగా ఉద్యోగ నియామకాలు



ఇప్పటికే 72 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
గ్రూప్ పరీక్షలను సమర్థంగా నిర్వహించాం
త్వరలోనే ఇంటర్‌నేషనల్ స్పోర్ట్స్ నిర్వహణ
ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం
తెలంగాణ రైజింగ్-2047' దిశగా అడుగులు వేస్తున్నాం
గోల్కొండ కోట నుంచి ప్రజలనుద్దేశించి సిఎం రేవంత్ ప్రసంగం

# వికాసం నుంచి వైభవం పైపు ఏపీ

ఆంధ్రప్రదేశ్‌ను వికాసం నుంచి వైభవం వైపు నడిపిస్తున్నామని.. సుస్థిరత నుంచి స్వర్ణాంధ్ర దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2047 స్వర్ణాంధ్ర సాధన సంకల్పం 5.5 కోట్ల మంది ఆంధ్రులు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 80 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్ని పురస్కరించుకుని అమరావతి రాజధానిలో ఆయన మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. పోలీసు దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి జాతీయత, దేశభక్తితో కూడిన స్ఫూర్తి దాయకమైన ప్రసంగం చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "భారతీయులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. మనకు స్వాతంత్ర్యం అంత తేలికగా ఒక్కరోజులో ఒక్కరి పోరాటంతో రాలేదు. దశాబ్దాల పోరాటం ఎందరో మహనీయుల బలిదానం, మరెందరో అమరవీరుల ప్రాణత్యాగం మనకు స్వాతంత్ర్యాన్ని అందించాయి. 80 ఏళ్ల క్రితం మన పెద్దలు చూసిన స్వప్నాన్ని సాకారం చేద్దాం. 2047 నాటికి దేశాన్ని, రాష్ట్రాన్ని నెంబర్ 1 చేద్దామన్న లక్ష్యంతో పనిచేద్దాం. హక్కుల్ని, గౌరవాన్ని ఇచ్చిన దేశానికి మనమేం చేయాలన్న ఆలోచనతో పనిచేద్దాం. అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి వచ్చే 20 ఏళు అనునిత్యం పనిచేస్తామని సంకల్పం తీసుకోవాలి. ఈ దేశానికి మనం ఏం ఇవ్వగలం అని ఆలోచించడమే 'అనే నేను...' సంకల్పం. మనం ఏ పనిచేసినా దేశ భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని, సమాజహితం కోసం పనిచేయాలి. విద్యార్థి ఆవిష్కరణలతో రైతులు ప్రకృతి సాగుతో, ఉద్యోగి అంకిత భావనతో, మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి. వ్యక్తిగత విజయాలన్నీ దేశ నిర్మాణంలో భాగం. ప్రధాని మోదీ ఇచ్చిన వికసిత్ భారత్ లక్ష్యం, మనం రూపొందించుకున్న స్వర్ణాంధ్ర లక్ష్యాలు వేర్వేరు కావు. ఏపీ దేశానికి బలమైన రాష్ట్రంగా ఎదగాలి. అంతా కలిసి ఐక్యంగా స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలను సాధిద్దాం. దీనికి దృఢమైన సంకల్పం చేద్దాం". అని ముఖ్యమంత్రి అన్నారు పారిశ్రామికవేత్తల్లో నమ్మకం పెంచేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చాం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. వీటిలో రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. దీంతో 11 లక్షల ఉద్యోగాలు వస్తాయి. ఒక ఏడాదిలో దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం రాష్ట్రానికి రావడం మనపై నమ్మకాన్ని పెంచింది. రెండేళ్లలో ఎఫ్‌డిఐ ఆరున్నర రెట్లు పెరిగింది. గూగుల్ ఏఐ డాటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్, జెఎస్ డబ్ల్యు స్టీల్, దాల్మియా సిమెంట్, ఎఎం గ్రీన్ అమోనియా, హీరో, రాయల్ ఎన్ ఫీల్డ్, స్వర్ణగిరి గోల్డ్ మైన్ వంటి అనేక ప్రాజెక్టులు వచ్చాయి..95 వేల కోట్ల విలువైన బిపిసిఎల్ వంటి భారీ ప్రాజెక్టు పట్టాలెక్కుతోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజెనెస్‌తో 36 రోజుల్లోనే ఆమ్కా డిఫెన్స్ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చాం. వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్ ప్రభుత్వ లక్ష్యం. దీని కోసం అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 138 పార్కులకు శ్రీకారం చుట్టాం. సమాజంలో ప్రతీ వర్గానికి న్యాయం జరిగేలా చూస్తున్నాం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నాం. నాణ్యమైన విద్యతో విద్యార్థుల భవితకు పునాదులు వేస్తున్నాం. ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంతో సంజీవని తీసుకువచ్చాం. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలవుతుంది. సీఎం సహాయ నిధి ద్వారా ఇప్పటి వరకూ రూ.1,631 కోట్లు వ్యయం చేసి పేదల్ని ఆదుకున్నాం. అన్నదాత సుఖీభవ కింద ప్రతిరైతుకూ 20 వేలు అందిస్తున్నాం. పొగాకు, కోకూ, మామిడి రైతులను మద్దతు ధరతో ఆదుకున్నాం. వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీతో సహకారం అందిస్తున్నాం. లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్ చేస్తున్నాం. మదనపల్లెలో త్వరలో హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుడతాం. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేస్తాం. ఆక్వా రంగాన్ని మరింత బలోపేతం చేసేలా చెరువులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే అందిస్తున్నాం. "అని సీఎం వివరించారు. మహిళా సాధికారత కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. స్వయం బ్రాండ్ పేరిట వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నాం. ఏపీలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇవ్వటం ద్వారా పెట్టుబడులు సాధిస్తున్నాం. రెండేళ్లలో రూ.19,390 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. బీచ్ టూరిజం, టెంపుల్, హోమ్ స్టేలను ప్రోత్సహిస్తున్నాం. ప్రజలకు పాలన దగ్గర చేసేందుకు మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేశాం. అన్నమయ్య జిల్లాకు మదనపల్లెను కేంద్రంగా మార్చాం. వారసత్వంగా వ చ్చిన ఆస్తులు, భూమిపై హక్కులు కాపాడేలా రెవెన్యూలో సంస్కరణలు తెచ్చాం. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నాం. ఉచిత ఇసుక విధానంతో నిర్మాణ రంగాన్ని బలోపేతం చేశాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, నాలా చట్టాన్ని రద్దు చేశాం. నకిలీ మద్యం బ్రాండ్లకు చెక్ పెట్టాం. ఎక్సైజ్ రంగాన్ని ప్రక్షాళన చేశాం. ప్రజలే ఫస్ట్ నినాదంతో పీపీపీకి ప్రాధాన్యం ఇస్తున్నాం. ఉద్యోగుల సంక్షేమం కోసం రూ.30,849 కోట్ల బకాయిలు చెల్లించాం. రాష్ట్రంలో ఆధ్యాత్మికత ను పెంచేందుకు ప్రసిద్ధ పుణ్య క్షేత్రాల పవిత్రతను కాపాడేలా చర్యలు చేపట్టాం. ప్రజా భద్రతలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. విజిబుల్ పోలీసింగ్ ఇన్విజిబుల్ పోలీస్ అనే విధానం అనుసరిస్తున్నాం. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా ఉంటాం. 'ఈగల్ టాస్క్ ఫోర్స్' ద్వారా గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాం. రాష్ట్రంలో అవకాశాలను అందిపుచ్చుకుని ఏపీని స్వర్ణాంధ్రగా మారుద్దాం. దేశం గర్వించేలా రాష్ట్రాన్ని నిర్మిద్దాం". అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అంతకు ముందు ఏపీఎస్పీ, సీఆర్పీఎఫ్, కర్ణాటక పోలీసు దళాలు, ఎన్సీసీ, స్కౌట్స్ విద్యార్థుల కవాతు నిర్వహించి సీఎం కు గౌరవ వందనం సమర్పించాయి. వివిధ ప్రభుత్వ శాఖల శకటాలు ప్రదర్శనలో ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ప్రతిభ కనపరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి సీఎం పోలీసు మెడల్స్‌ను అలంకరించారు.

## కీలక బాధ్యతగా ఉద్యోగ నియామకాలు


ఉద్యోగ నియామకాలను ప్రభుత్వం అత్యంత కీలక బాధ్యతగా తీసుకుందని, ఇప్పటి వరకు 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పూర్తి చేశామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. గ్రూప్1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, మెగా డీఎస్సీ నియామకాలను విజయవంతంగా నిర్వహించి నియామక పత్రాలు అందించామని తెలిపారు. యువతకు నైపుణ్యం, ఉద్యోగాలు కల్పించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను అప్‌గ్రేడ్ చేస్తున్నామని వివరించారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ అకాడమీ, యంగ్ ఇండియా డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ స్కిల్లింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే తెలంగాణ వేదికగా యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ 2026 నిర్వహించ బోతున్నామని చెప్పారు. గోల్కొండకోటలో త్రివర్ణ పతాకం ఎగురవేసిన సిఎం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వైద్యరంగంలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, నిమ్స్‌లో 2,000 పడకల నూతన ఆసుపత్రి నిర్మాణంతో పాటు వరంగల్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తున్నామని తెలిపారు. కొత్తగా 8 మెడికల్ కళాశాలలు, 16 నర్సింగ్ కళాశాలలు, 28 పారామెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. దక్షిణ భారతదేశంలోనే తొలి కిడ్నీ ట్రాన్స్‌ఎ÷-లాంటేషన్ సెంటర్ నిర్వహణ ఇందుకు నిదర్శనమని, ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5.18 లక్షల మందికి రూ.2,526 కోట్ల సాయం అందించామని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులకు సరికొత్త సాంకేతికత, వనరులను అందిస్తున్నామని సీఎం చెప్పారు. సైబర్ నేరాలు, ఆహార కల్తీని ఎదుర్కొనేందుకు డ్రగ్స్ కంట్రోల్, సైబర్, ఆహార కల్తీ నియంత్రణ లను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నామని తెలిపారు. ఓఆర్‌ఆర్‌పై ప్రమాదాలు తగ్గించేందుకు హైవే ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సెంటర్లు, మహిళల భద్రతకు షీ టీమ్స్, పిల్లల అనుకూల న్యాయస్థానాల ఏర్పాటులో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల శ్రద్ధతో నిర్ణయాలు తీసుకుంటున్నా మని, పీఆర్సీ, పెన్షన్లు, ఎంఎ÷-లాయీస్ హెల్త్ స్కీమ్ వంటివి అమలు చేస్తున్నామని తెలిపారు. 36 సచివాలయ శాఖల్లో 100 శాతం ఈ-ఆఫీస్ అమలు చేశామని, ఈ నెల 17వ తేదీ నుండి అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో 'ప్రజావాణి' ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, చెరువుల పరిరక్షణకు 'హైడ్రా' ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నామని సీఎం వివరించారు. పారిశ్రామికంగా టి-ఐడియా ద్వారా రూ.1.29 లక్షల కోట్ల పెట్టుబడులు, తెలంగాణ గ్లోబల్ ఏఐ సమ్మిట్ ద్వారా రూ.5.75 లక్షల కోట్ల ఒప్పందాలు సాధించామని, 2025-26లో ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరాయని వెల్లడించారు. తొలి సమగ్ర టూరిజం పాలసీ 2025 తీసుకువచ్చామని, సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధికి ప్రణాళికలు

సిద్ధం చేశామన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మార్చాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్-2047' దిశగా అడుగులు వేస్తున్నామని, అందరి సహకారంతో రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని సీఎం ప్రసంగాన్ని ముగించారు.

## లోక్ భవన్‌లో గవర్నర్ 'ఎట్ హోం'..

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, సైనిక అధికారులు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రముఖుల రాకతో లోక్ భవన్ ప్రాంగణం పండుగ వాతావరణంలో సందడిగా మారింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కార్యక్రమం కొనసాగింది. అనారోగ్యం కారణంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కాకినాడలో ఇవాళ స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్ లో పాల్గొన్న అనంతరం పవన్ తీవ్ర జ్వరంతో బాధపడుతుండడంతో, ఆయన ఎట్ హోమ్ కార్యక్రమంలో పాల్గొనడంలేదని జనసేన పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది. రాజమండ్రిలో వైద్య పరీక్షల అనంతరం పవన్ కల్యాణ్ హైదరాబాద్ వెళ్లిపోయారు.

## ప్రాణం ఉన్నంతవరకు బీఆర్‌ఎస్‌తో కలవను: కల్వకుంట్ల కవిత



తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత, బీఆర్ఎస్ పార్టీతో భవిష్యత్తులో కలిసి పనిచేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఒక మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, "ప్రాణం ఉన్నంత వరకు బీఆర్‌ఎస్‌తో కలిసి పనిచేయను" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. కుటుంబ సభ్యులతో వ్యక్తిగత సంబంధాలు వేరని, రాజకీయాలు వేరని ఆమె తేల్చి చెప్పారు. అయితే, బీఆర్ఎస్ ను అధికారంలోకి రాకుండా చేయడం తమ సిద్ధాంతం కాదని కూడా అన్నారు. పార్టీ నుంచి తనను బహిష్కరించిన తీరుపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి షోకాజు నోటీసు ఇవ్వకుండానే తనను పార్టీ నుంచి పంపించేశారని, సస్పెన్షన్‌కు ఏడాది ముందు నుంచే తనను పక్కన పెట్టారని ఆరోపించారు. అయినప్పటికీ, నైతిక విలువలకు కట్టుబడి తానే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని గుర్తుచేశారు. తన తండ్రి కేసీఆర్‌ను తాను ఎన్నడూ ఎదిరించలేదని ఆమె పేర్కొన్నారు.

## 370 ఆర్టికల్ రద్దుచేయకుంటే పివోకె కలిసేది

తన తాత, జమ్మూకశ్మీర్ తొలి ప్రధానమంత్రి షేక్ మహ్మద్ అబ్దుల్లా నేతృత్వంలోని కశ్మీరీలు ఆక్రమణదారులను ఎదుర్కొన్నారని చెప్పారు. భారత సైన్యం కశ్మీర్‌కు చేరుకోవడానికి ముందే స్థానిక ప్రజలు తమ ప్రాంతాన్ని రక్షించేందుకు పోరాడారని ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. 2019లో జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా, ప్రత్యేక హోదాను రద్దు చేయకపోయి ఉంటే.. ఈ రోజు పీవోకే ప్రజలు జమ్మూకశ్మీర్‌లో తిరిగి విలీనం కావాలని కోరుతూ ఉద్యమించేవారని అన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో పీవోకేకు సంబంధించిన స్థానాలను ఖాళీగా ఉంచామని, ఏదో ఒక రోజు అవి భర్తీ అవుతాయని ఆశిస్తున్నామని తెలిపారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను, ఇతర రాజ్యాంగపరమైన హామీలను పునరుద్ధరించేందుకు తమ ప్రభుత్వం పోరాటం కొనసాగిస్తుందని ఒమర్ అబ్దుల్లా స్పష్టం చేశారు. జమ్మూకశ్మీర్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని చెప్పారు. కాగా, ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యలను జమ్మూకశ్మీర్ బీజేపీ నేత, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు సునీల్ శర్మ తప్పుపట్టారు. స్వాతంత్ర్య దినోత్సవం వంటి జాతీయ పర్వదినాన్ని రాజకీయ వ్యాఖ్యలకు ఉపయోగించడం బాధ్యతా రాహిత్యమని విమర్శించారు.

## చరిత్ర తెలుసుకుంటేనే ... భవిష్యత్ నిర్మాణం

చరిత్రను తెలుసుకున్న వాళ్లే భవిష్యత్తును చక్కగా నిర్మించగలరని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత అన్నారు. టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ... బ్రిటీష్ పాలనలో జరిగిన అఘాయిత్యాలు, విభజించి పాలించిన విధానం అందరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రెండు ప్రపంచ యుద్ధాలకు భారతీయులను సైనికులుగా వాడుకొని ఎంతో మంది చావులకు కారణమయ్యారని మండిపడ్డారు. బ్రిటీష్ వాళ్లు వచ్చిన తర్వాతే కుల వ్యవస్థ మరింత పెరిగిందని వ్యాఖ్యానించారు. అడవుల్లో ఉండే ఆదివాసీలను రాజ్యం పరిధిలోకి తెచ్చి తీరని అన్యాయం చేశారన్నారు. బ్రిటీష్ పరిపాలన పోయినప్పటికీ వాళ్ల ఆలోచనా విధానాన్నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని కవిత విమర్శించారు. ఇంగ్లీష్ మాట్లాడిన వాళ్లే గొప్ప అన్నట్లుగా చూస్తున్నారని.. తెలుగు భాష మాట్లాడితే తక్కువ చేసి చూస్తున్నారని మండిపడ్డారు. 'తెల్ల తోలు గొప్ప, నల్ల తోలు కాదన్నట్లుగా ప్రచారం చేసి మనలో మనల్ని శత్రువులను చేశారు' అని అన్నారు. ఆనాటి బ్రిటీష్ వాళ్ల పరిపాలన, ఆలోచనా విధానాన్ని వీడాలని కవిత పేర్కొన్నారు.

## జెన్-జీ శక్తితోనే మార్పు.. అవినీతి, కులాలపై పోరాటమే నిజమైన స్వేచ్ఛ:

**చెన్నైలోని చారిత్రాత్మక ఫోర్ట్ సెయింట్ జార్జ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**

**అవినీతిని అంతమొందించడం రెండో స్వాతంత్ర్య పోరాటం లాంటిదేనన్న విజయ్**

**స్వాతంత్ర్య సమరయోధుల పింఛనును రూ. 23 వేలకు పెంచుతున్నట్టు ప్రకటన**

తమిళనాడు నూతన ముఖ్యమంత్రి విజయ్ తన తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో రాజకీయ ప్రత్యర్థులకు బలమైన హెచ్చరికలు జారీ చేయడంతో పాటు యువత, సామాజిక మార్పుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చెన్నైలోని చారిత్రాత్మక ఫోర్ట్ సెయింట్ జార్జ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించిన ఆయన, రాష్ట్రంలో అవినీతిని అంతమొందించడం కూడా ఒక రెండో స్వాతంత్ర్య పోరాటం లాంటిదేనని స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధిలో జెన్-జీ, యువతదే కీలక పాత్ర అని పేర్కొన్న విజయ్... కులం, మతం పేరుతో ప్రజలను విభజించే సంకెళ్లను తెంచినప్పుడే దేశంలో నిజమైన స్వేచ్ఛ సాధ్యమవుతుందని అన్నారు. తమిళనాడు హక్కులు, భాషా విధానం, ఆర్థిక వాటా విషయంలో తమ ప్రభుత్వం ఏమాత్రం రాజీపడదని... కేంద్ర ప్రభుత్వంతో పరిపాలనాపరమైన సహకారం ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ చర్యలనైనా తీవ్రంగా నిరోధిస్తామని హెచ్చరించారు. ఇదే వేదికపై స్వాతంత్ర్య సమరయోధుల సంక్షేమం కోసం పలు కీలక ప్రకటనలు చేశారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చే పింఛనును రూ. 23 వేలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. అలాగే వీరపాండ్య కట్టబొమ్మన్, వి.ఓ. చిదంబరం పిళ్లై వంటి వీరుల వారసులకు ప్రత్యేక నిధులను ప్రకటిస్తూ, రాబోయే రోజుల్లో సుపరిపాలనతో తమిళనాడును సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తామని తెలిపారు.

## నల్సార్ విద్యార్థులకు క్షమాపణ చెప్పిన బీసీఐ చైర్మన్

నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా విద్యార్థులకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా క్షమాపణలు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం ఆయన ఒక లేఖను విడుదల చేశారు. ఈ వివాదానికి సంబంధించి తాను రాసిన లేఖ లేదా చేసిన వ్యాఖ్యలు విద్యార్థుల మనోభావాలను దెబ్బతీసి ఉంటే, అందుకు క్షమించాలని ఆయన కోరారు. "విచారం వ్యక్తం చేయడం అనేది ప్రతిష్ఠకో లేదా అహంకారానికి సంబంధించిన విషయం కాదు. మన విద్యార్థుల భావాలకు, వారి ఆందోళనలకు విలువ ఇవ్వడమే అత్యంత ముఖ్యం" అని ఆయన తన లేఖలో పేర్కొన్నారు.

# భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణం

తన ప్రసంగంలో దాని ప్రస్తావన తీసుకువచ్చారు. ప్రతిపక్షాలు విభేదాలను పక్కనపెట్టి.. పార్లమెంట్, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు సహకరించాలని కోరారు. క్రెడిట్ వారే తీసుకున్నా ఫర్వాలేదని, కానీ బిల్లు పాసయి మహిళలకు గౌరవం దక్కాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. భారత్ ఇకపై చిన్న కలలతో ముందుకు వెళ్లలేదని, ఆలోచనా పరిధి విస్తృతం చేసుకునేందుకు ఉన్నత లక్ష్యాలు అవసరమని మోదీ పిలుపునిచ్చారు. భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారినప్పుడు ప్రపంచం మన వైపు చూసే తీరే మారుతుందని పేర్కొన్నారు. ఇతర దేశాలపై ఆధారడి జీవించలేమని, స్వయం సమృద్ధి సాధించాలన్నారు. టెక్ ప్రపంచంలో చిప్‌ల విలువను భారతదేశం అర్థం చేసుకుంటోందని, అందుకే మూడు సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. సమీప భవిష్యత్తులో మరిన్ని సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇప్పుడు ప్రతిభారతీయుడు స్థానిక ఉత్పత్తులకు మద్దతు ఇవ్వడంపై సంతోషం వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వ హయాంలో 25 కోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. అభివృద్ధి దిశగా దృఢ సంకల్పంతో పయనిస్తోన్న 140 కోట్ల మంది భారతీయులను ఆపడం అసాధ్యం అని పేర్కొన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల సంభవించిన విపత్తుల గురించి ప్రస్తావించారు. బాధిత కుటుంబాలకు దేశం మొత్తం అండగా ఉంటుందని సంఘీభావం తెలిపారు. దేశంలో 70 నగరాల్లో పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందిస్తున్నాం. 1.75 కోట్ల ఇళ్లకు పైప్ ద్వారా వంటగ్యాస్ సరఫరా చేస్తున్నాం. ఇంధన భద్రత సాధించడం దేశ తక్షణ అవసరం. వంద గిగావాట్ల అణు ఇంధనం సాధించడం మనలక్ష్యం అన్నారు. ఇటవలే హైడ్రోజన్ రైలును విజయంతంగా నడిపించాం. 90 ఏళ్లలో 30 శాతం మాత్రమే రైళ్ల ఎలక్ట్రిఫికేషన్ జరిగింది. 10 ఏళ్లలో 70 శాతం రైళ్ల ఎలక్ట్రిఫికేషన్ పూర్తి చేశాం. ఇటీవలే హైడ్రోజన్ రైలును విజయవంతంగా నడిపించామని అన్నారు. 50 లక్షల ఇళ్లకు సౌరశక్తి విద్యుత్ అందిస్తున్నాం. దేశంలో ఐదు న్యూక్లియర్ రియాక్టర్లు ఏర్పాటు చేస్తున్నామని మోదీ తెలిపారు. అయితే స్వాతంత్ర్య వేడుకల్లో ఈసారి కూడా లోక్‌సభ, రాజ్యసభల్లో విపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే హాజరుకాలేదు. సీటింగ్, ఇతర ప్రొటోకాల్స్ వారి పదవులకు అనుగుణంగా ఉండటం లేదని కాంగ్రెస్ గతంలో ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వారు వరుసగా రెండోసారి గైర్హాజరయ్యారు.

## చరిత్రను గుర్తుచేసుకొనే.. భవిష్యత్తును నిర్మించుకునే రోజు

ఆగస్టు 15 ఓ తేదీ మాత్రమే కాదని.. చరిత్రను గుర్తుచేసుకొనే.. భవిష్యత్తును నిర్మించుకునే రోజు అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య మైదానంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన ప్రసంగిస్తూ కులం, మతం లేని ఏకైక జాతీయ పండుగ జెండా పండుగ అనిఅన్నారు. ఎన్టీఆర్ జిల్లా తరపున నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని.. జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఇక్కడ వాతావరణం చూశాక స్కూల్ రోజులు గుర్తుకు వచ్చాయని తెలిపారు. జెండాలు కట్టి, పోటీల్లో పాల్గొని జెండా పండుగ రోజు బహుమతులు అందుకునే వాళ్లమని చిన్ననాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. ప్రతి ఇంటి పైనా జాతీయ జెండా ఎగురవేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని తెలిపారు. విద్యా రంగంలో తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొస్తోందన్నారు. పాఠ్యపుస్తకాలపై సీఎం ఫొటో, తన ఫొటో లేదని, ర్యాంకులు సాధించిన విద్యార్థుల ఫొటోలను వేశామన్నారు. విద్యను ఉపాధి రంగానికి అనుసంధానం చేస్తున్నాం. రాజధాని అమరావతికి కేంద్రం చట్టబద్ధత కల్పించింది. పోలవరం నిర్మాణం, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, రైల్వే జోన్ సాధించాం. అభివృద్ధి, సంక్షేమం మన ప్రభుత్వానికి జోడెద్దులు. పెద్ద పెద్ద పరిశ్రమలు వచ్చి రాష్ట్రానికి చిరునామాగా మారాయి. ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఇంకా ఎన్నేళ్లు ఉద్యోగాలు, ఉపాధి కోసం పక్క రాష్ట్రాల వైపు చూస్తాం? అన్నిరంగాల్లో ఏపీని ముందువరుసలో ఉంచేందుకు కృషి చేస్తున్నాం. కులం, మతం, ప్రాంతాలకతీతంగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని ప్రమాణం చేద్దాం. కసితో, పట్టుదలతో పనిచేద్దాం. పక్క రాష్ట్రాలు మనవైపు చూసేలా అభివృద్ధి చేద్దామని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. అహింసా మార్గం ద్వారా స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీ అని మంత్రి కొనియాడారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి ఎందరో స్వాతంత్ర్యం కోసం పోరాడారన్నారు. మువ్వన్నెల జెండా మన ఆత్మ విశ్వాసంగా పేర్కొన్నారు. పింగళి వెంకయ్య, టంగుటూరి ప్రకాశం పంతులు అందరికీ స్ఫూర్తి అని చెప్పుకొచ్చారు. అన్న ఎన్టీఆర్ నడయాడిన జిల్లాలో జాతీయ పతాకం ఎగురవేయడం ఆనందంగా ఉందన్నారు. విద్యాశాఖ మంత్రిగా విద్యలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని వెల్లడించారు. 'మహిళలను గౌరవించండి.. భరోసా కలిగించండి' అని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టామని.. అనేక ఖాళీలను భర్తీ చేసేలా ముందుకు సాగుతున్నామని లోకేశ్ వెల్లడించారు. ప్రధాని మోదీ అండగా ఉంటూ అన్ని విధాలా సహకారం అందిస్తున్నారన్నారు. అమరావతిని శాశ్వత రాజధానిగా ప్రకటించారని తెలిపారు. పోలవరం పూర్తి చేస్తున్నామని.. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని కాపాడామని చెప్పుకొచ్చారు. పొట్టి శ్రీరాములు త్యాగాల ఫలితంగా నాడు ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని.. హైదరాబాద్‌ను అందరం కలిసి అభివృద్ధి చేసుకున్నామని చెప్పారు. 2014 లో రాష్ట్ర విభజన అశాస్త్రీయంగా చేసి మెడపట్టి గెంటేశారని.. ఆరోజు ఎక్కడ ఉండాలో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. సీఎం చంద్రబాబు ఒక్కరే మనకి ఆశా కిరణమని అన్నారు. 2014-2019 మధ్య ఏపీ అభివృద్ధి కోసం చంద్రబాబు ఎంతో తపనపడ్డారని మంత్రి తెలిపారు. 2019 తరువాత వచ్చిన ప్రభుత్వం రాష్ట్రాన్ని నాశనం చేసిందని విమర్శించారు. 2024 తరువాత సీఎంగా చంద్రబాబు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఏడు పదులు దాటినా కుర్రాడిలా పరుగులు పెడుతున్నారని అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు ఇచ్చామని, పోలీసు శాఖలో ఖాళీలు భర్తీ చేశామన్నారు. గూగుల్ తెచ్చిన సమయంలో ఎంతో ఆనందం కలిగిందని అన్నారు. చంద్రబాబు అభినందిస్తారనుకుంటే.. లక్ష్యాన్ని నిర్దేశిరచారని తెలిపారు. ఏపీలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశ భక్తితో పాటు రాష్ట్ర భక్తి కూడా ఉండాలన్నారు. నేడు భారతదేశం ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతోందని.. ఏపీ కూడా అదే స్థాయిలో అభివృద్ధి చెందాలని మంత్రి ఆకాంక్షించారు. ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లడం కాదని.. అమరావతి, విశాఖపట్నం, కర్నూలులో ఉద్యోగాలు చేయాలని యువతకు పిలుపునిచ్చారు. కసితో పని చేసి 2047 నాటికి వికసిత ఏపీని సాధించాలన్నారు. స్వర్ణాంధ్రకు తగ్గట్టుగా ఎన్టీఆర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు. ప్రజల కోసం పని చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. పక్క రాష్ట్రం వాళ్లు అసూయపడేలా ఏపీ అభివృద్ధి చెందాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని, ఎమ్మెల్యే బోండా ఉమ, కలెక్టర్ లక్ష్మీశా, సీపీ రాజశేఖర్ బాబు పాల్గొన్నారు.

## ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా భారత్

స్వాతంత్ర్య దినోత్సవంలో పవన్ కల్యాణ్ పాల్గొని జాతీయజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక తరం స్వాతంత్ర్యం కోసం పోరాడితే.. ఒక తరం స్వాతంత్ర్యాన్ని కాపాడిందన్నారు. బలమైన, సమర్థవంతమైన దేశంగా ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా భారత్ అడుగులు వేస్తోందని అన్నారు.వికసిత్ భారత్ సంకల్పంలో ఆంధ్రప్రదేశ్ తనదైన పాత్ర పోషిస్తుందని అన్నారు. కేంద్ర సమన్వయంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జగన్ కేసులపై సుప్రీంకోర్టు ప్రత్యేక దృష్టి సారించాలి: జ్యోతుల నెహ్రూ

వైసీపీ అధినేత జగన్ బెయిల్‌ను రద్దు చేయాలని జగ్గంపేట టీడీపీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ డిమాండ్ చేశారు. జగన్‌కు సంబంధించిన కేసులపై దేశ అత్యున్నత నాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో వైసీపీ నాయకులు వరుసగా అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని మండిపడిన జ్యోతుల నెహ్రూ, ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జగన్ బెయిల్‌ను ఎందుకు రద్దు చేయకూడదని ప్రశ్నించారు. బాధితులకు పరామర్శల పేరుతో జగన్ ప్రజలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తూ, శవరాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ తరహా వైఖరిపై న్యాయస్థానాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# రెండు వేప చెట్ల మధ్య ఉన్న పుట్ట పూజలకు అనువు.



**బేతంచెర్ల ఆగస్టు 15 ( నంది పత్రిక ).** బేతంచెర్ల పట్టణం నుండి,రైల్వే గేటు దాటి,బనగానపల్లె కు పోవు రహదారి నందు గల, శ్రీ పూదోట పాలిస్ ఫ్యాక్టరీ నందున్న,రెండు పెద్ద వేపచెట్ల మధ్యన పుట్ట కలదు. కనుక నాగుల చవితి పండుగను పురస్కరించుకొని, భక్తులు ఇక్కడ పూజలు చేసుకొనుటకు అనువుగా ఉన్నదని, పుట్టను ప్రజలు దర్శించు కొనుటకు పూదోట ఇండస్ట్రీస్ యజమాని గుండా గోపాల్ తగు సహాయము చేయుదురని తెలియ జేశారు.

## డీఐజీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**ముువ్వన్నెల జెండాను ఆవిష్కరించిన కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపీఎస్**

**పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరణ**

**సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.. మిఠాయిల పంపిణీ**



**నంది పత్రిక కర్నూలు ప్రతినిధి** దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు రేంజ్ డీఐజీ క్యాంపు కార్యాలయంలో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై ముువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం జాతీయ జెండాకు వందనం సమర్పించి, పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ హానర్) స్వీకరించారు. ఈ సందర్భంగా డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని, ప్రతి ఒక్కరూ దేశభక్తితో, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఏవో మాధవి, డీఐజీ మేనేజర్ రత్న ప్రకాష్, లైజనింగ్ ఆఫీసర్ (సీఐ) తిక్కస్వామిలతో పాటు డీఐజీ కార్యాలయ సిబ్బంది, పోలీసు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## చదువుకున్న పాఠశాల పై మమకారం



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 15 :** చిన్నతనంలో తాను చదువుకున్న పాఠశాలపై మమకారాన్ని పెంచుకున్న ఓ మహిళా ఉపాధ్యాయురాలు ఆ పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థుల పట్ల ఉదార స్వభావాన్ని చూపి ఉడత భక్తి సాయం చేశారు. బండి ఆత్మకూరు కు చెందిన లలిత తన చిన్నతనంలో విద్యాభ్యాసాన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పూర్తి చేశారు. ప్రస్తుతం లలిత మండలం గడిగరేవుల గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో స్కూల్ గ్రేడ్ అసిస్టెంట్ గా పని చేస్తున్నారు. తాను చదువుకున్న పాఠశాలలో పిల్లలకు ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఎంపీపీ మెయిన్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ప్లేట్లను అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ రెడ్డి స్వాతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించిన అనంతరం ఉపాధ్యాయురాలు లలిత తల్లి జయమ్మ చేతుల మీదుగా పిల్లలకు ప్లేట్లను అందివ్వడం జరిగింది. ఇదే పాఠశాలలోనే కాకుండా, అంగన్వాడి ఆరవ కేంద్రంలోని పిల్లలకు కూడా స్టీల్ కప్పులను అందజేశారు. పాఠశాలలో అంగన్వాడి కేంద్రంలో పిల్లల పట్ల మానవతా దృక్పథాన్ని చాటుకున్న మహిళా ఉపాధ్యాయురా లు లలితను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్ సునీత పాల్గొన్నారు.



## హైదరాబాద్ వాసులకు అలర్ట్.. 24 గంటల పాటు నీటి సరఫరా బంద్!

హైదరాబాద్ వాసులకు ముఖ్య గమనిక. నగరంలోని పలు ప్రాంతాల్లో 24 గంటల పాటు మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ (జలమండలి) వెల్లడించింది. ఆగస్ట్ 17 (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి మరుసటి రోజు, ఆగస్ట్ 18వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటల వరకు ఈ నీటి కోత అమల్లో ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

## "కలిసి శ్రమిద్దాం -- ప్రగతి" సాధిద్దాం!.

**ఉత్సాహ భరితంగా 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.**





**బేతంచెర్ల ఆగస్టు 15 ( నంది పత్రిక ).** 80 వ స్వాతంత్ర్య దినోత్సంను పురస్కరించుకొని,బేతంచెర్ల మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఆనంద, ఉత్సాహ భరితంగా ముువ్వన్నెలజెండా మన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి,జెండా వందనం గావించారు.పంద్రాగస్ట్, శనివారం బేతంచెర్ల మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో, తహసీల్దార్ నాగమణి ఆధ్వర్యంలో, మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో బేతంచెర్ల మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు బుగ్గన నాగ భూషణం రెడ్డి,ఎంపీడీఓ ఫజుల్ రహమాన్, పోలీస్ స్టేషన్ ఆవరణలో సిఐ.వెంకటేశ్వర రావు & ఎస్ఐ. రమేష్ బాబు,ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓలు, బేతంచెర్ల నగర పంచాయితీ కార్యాలయం ఆవరణలో, గాంధీ మహాత్ముడు చిత్ర పటానికి పూల మాల వేసిన నగర పంచాయితీ చైర్మన్ సిహెచ్. చలం రెడ్డి & కమీషనర్, ప్రభుత్వ విద్యాలయాలలో, వైద్య శాలల్లో,పశు వైద్య శాలల్లో,రైల్వే, పోస్టాఫీసుల దగ్గర, ప్రైవేట్ స్కూల్స్ & కాలేజీలలో సంబంధిత అధికారులు, వారి వారిసిబ్బందితో కలిసి,జాతీయ జెండాను ఆవిష్కరించారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రజలందరూ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియ జేసుకున్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా. స్కూల్ పిల్లలకు పుస్తకాలు సపోర్టింగ్ టూల్స్ అందజేత. బిబిలయన్స్ క్లబ్ ఆఫ్ బేతంచెర్ల.



లయన్స్ క్లబ్ ఆఫ్ బేతంచెర్ల వారి సహకారము తో 15-08-2026 శనివారం నాడు,80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా బేతంచెర్ల మండలం సీతారామపురం గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (హెచ్ డబ్ల్యూ ) నందు ఎల్ఎన్ కె .మనోహర్ రెడ్డి, ఎల్ఎన్ బి.చంద్రశేఖర్ రెడ్డి,ఎల్ఎన్ పి. వెంకటేశ్వరరావు సహకారంతో చిన్న పిల్లలకు కావలసిన పుస్తకములు (ఎడ్యుకేషనల్ మెటీరియల్స్ ) సపోర్టింగ్ టూల్స్ (ఆక్సిసోరీస్ ) అందజేసిన లయన్స్ క్లబ్ సభ్యులు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూరా మధు సుధాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్. కల్పన,ఎల్.భార్గవి లయన్స్ క్లబ్ సభ్యులు వెంకటేశ్వరరావు, కమల్ భాష, రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏపీ మోడల్ స్కూల్‌కు బీరువా బహూకరణ

**2002-07 బ్యాచ్ విద్యార్థుల సేవా దృక్పథంపై సర్వత్రా ప్రశంసలు**



**రుద్రవరం ప్రతినిధి ఆగస్టు 15 (నంది పత్రిక):** సమాజంలో స్థిరపడటానికి పునాది వేసిన విద్యావ్యవస్థకు తిరిగి సాయం చేయాలనే సదుద్దేశంతో రుద్రవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2002-2007 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ వంతు సామాజిక బాధ్యతను చాటుకున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు అవసరమైన ఒక విలువైన బీరువాను వారు పాఠశాల యాజమాన్యానికి బహూకరించారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మరియు వారి ఉపాధ్యాయ బృందం పాఠశాల మౌలిక సదుపాయాల కల్పన, విద్యాభివృద్ధి కోసం అహర్నిశలు చేస్తున్న కృషి తమను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. ఉపాధ్యాయుల అంకితభావానికి మద్దతుగా, పాఠశాలలోని ముఖ్యమైన రికార్డులు, విద్యార్థులకు సంబంధించిన వస్తువులను భద్రపరుచుకోవడానికి ఉపయోగపడుతుందనే ఆలోచనతో ఈ బీరువాను అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని వారు పిలుపునిచ్చారు. తాము చదువుకున్న బడి కాకపోయినా, విద్యాభివృద్ధిపై మక్కువతో తమ పాఠశాల అభివృద్ధిలో పాలుపంచుకున్న జెడ్పీ స్కూల్ 2002-2007 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సేవా దృక్పథాన్ని ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా ప్రశంసించారు. యువతకు వీరు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పూర్వ విద్యార్థుల బృందం తదితరులు పాల్గొన్నారు.

## భాష్యం పాఠశాల 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**డోన్. ఆగస్ట్ 15 . (నంది పత్రిక ):**డోన్ పట్టణం నందు ఉన్నటువంటి భాష్యం ఆశీగ్ల మా ధ్యమ పాఠశాల నందు భాష్యం పాఠశాల చైర్మన్ రామకృష్ణ , వైస్ చైర్మన్ హనుమంతు రావు , మేనేజంగ్ డైరెక్టర్ సాకేత్ రామ్ సార్, రాయలసీమ జోన్ రవి వర్మ ఆధ్వర్యంలో 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పాఠశాల ప్రదానాచార్యులు శేష సాయి నాథ్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా పర్యావరణ రక్షకురాలు ఉషా లతా బాయి పాల్గొని విద్యార్థులకు మంచి సందేశం అందించారు. అనంతరం పాఠశాల ప్రధానచార్యులు శేష సాయి నాథ్ విద్యార్థులకు చక్కటి సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, భోదనేతార సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మిఠాయులు పంచారు.



## కల్లూరులో అంబరాన్నంటిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు

**ముువ్వన్నెల జెండాను ఘనంగా ఆవిష్కరించిన మండల అధ్యక్షులు ఎన్. రామాంజనేయులు, రవి**

**సమరయోధుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం: నాయకుల పిలుపు**

**ఘనంగా పాల్గొన్న కార్యవర్గ సభ్యులు, జిల్లా స్థాయి ప్రముఖులు మరియు కార్యకర్తలు**



**నంది పత్రిక కర్నూలు బ్యూరో** దేశవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్లూరు మండల కేంద్రంలో వేడుకలు అత్యంత వైభవంగా, దేశభక్తి ఉట్టిపడేలా నిర్వహించారు. కల్లూరు అర్బన్-1 మండల అధ్యక్షులు ఎన్. రామాంజనేయులు, కల్లూరు అర్బన్-2 మండల అధ్యక్షులు రవిల సంయుక్త సారథ్యంలో ముువ్వన్నెల జాతీయ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించి జైహింద్ నినాదాలతో పరిసరాలను హోరెత్తించారు.

**దేశ ఐక్యతకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి** కార్యక్రమంలో మండల అధ్యక్షులు మాట్లాడుతూ.. "ఎందరో అమరవీరుల నిస్వార్థ త్యాగాలు, పోరాటాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నాం. ఆ మహనీయుల ఆశయాలను స్మరించుకుంటూ, వారి బాటలో నడవడమే వారికిచ్చే అసలైన నివాళి" అని పేర్కొన్నారు. దేశ సమగ్రతను, ఐక్యతను కాపాడటానికి ప్రతి పౌరుడు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలకు విశిష్ట అతిథులుగా హాజరైన కార్యవర్గ సభ్యులు జి.ఎస్. నాగరాజు యాదవ్, జిల్లా నాయకులు మీసాల గంగాధర్ ప్రసంగిస్తూ.. దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు.భారీగా తరలివచ్చిన నాయకులు, శ్రేణులుఈ జాతీయ పర్వదిన వేడుకల్లో ప్రముఖ నాయకులు:రవితేజ, మోహన్ రావు, భాస్కర్, శేఖర్ ఆచారి నాగేంద్రుడు, రమణ, మహేష్, అశోక్ కుమార్ శాస్త్రి చంద్రశేఖర్, సురేష్ కుమార్, నాగభూషణం, రవి వర్మ, ప్రవీణాచారి, వెంకటేశ్వర్లు వీరితో పాటు పెద్ద సంఖ్యలో రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిలు పంపిణీ చేశారు.




## లోకాయుక్త కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**ముువ్వన్నెల జెండాను ఆవిష్కరించిన ఉప లోకాయుక్త శ్రీమతి పి. రజిని**

**మహాత్మా గాంధీ చిత్రపటానికి ఘన నివాళి.. పోలీసుల గౌరవ వందనం స్వీకరణ**

**ప్రజాసేవ, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: ఉప లోకాయుక్త పిలుపు**

**క్రీడా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం**



**నంది పత్రిక కర్నూలు బ్యూరో** దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలులోని లోకాయుక్త కార్యాలయ ఆవరణలో వేడుకలు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉప లోకాయుక్త శ్రీమతి పి. రజిని తొలుత జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె ముువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది, విద్యార్థులు సమర్పించిన గౌరవ వందనాన్ని ఉప లోకాయుక్త స్వీకరించారు.

**దేశ అభివృద్ధి, ప్రజాసేవలో పునరంకితం కావాలి** అనంతరం జరిగిన సభలో ఉప లోకాయుక్త మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. వారి ఆశయాలను స్మరించుకుంటూ దేశ ప్రగతి, ప్రజాసేవ, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

**ఉత్సాహంగా క్రీడా పోటీలు బహుమతుల ప్రదానం** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని లోకాయుక్త కార్యాలయ సిబ్బందికి నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు, రన్నరప్‌లకు ఉప లోకాయుక్త చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. క్రీడలు సిబ్బందిలో ఉత్సాహాన్ని, ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**హాజరైన ప్రముఖులు** ఈ వేడుకల్లో డైరెక్టర్ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ పి. వెంకటరామరెడ్డి, రిజిస్ట్రార్ టి. వెంకటేశ్వరరెడ్డిలతో పాటు లోకాయుక్త కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రాజ్యాంగాన్ని కాపాడుకుందాం- ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం -సిపిఎం

**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 15 . (నంది పత్రిక ):**నంద్యాల సిపిఎం కార్యాలయంలో జాతీయ జెండా ను సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్ ఎగురవేసి 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు, టి రామచంద్రుడు, నరసింహ నాయక్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా నరసింహులు, పి వెంకట లింగం, పార్టీ సీనియర్ నాయకులు తోట మద్దులు, ఏ రాజశేఖర్ లతో పాటు పార్టీ జిల్లా నాయకులు ఎమ్మార్ నాయక్, ప్రజాసంఘాల నాయకులు శివ, శివ కుమార్,పి ఎం ఎం కళాకారులు బాలహుస్సేన్,వీరసేన,బంగారయ్య,సుధాకర్, రాజు మరో 50మంది కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు లు మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కులం, మతం,ప్రాంతం, వర్గం అనే తేడా లేకుండా దేశంలోని ప్రజలంతా ఐక్యంగా పోరాడి సాధించుకున్నటువంటి స్వాతంత్ర్యాన్ని నేడు పరిపాలిస్తున్న పాలకులు , సామ్రాజ్యవాదానికి తలొగ్గి దేశ ప్రజల పైన అనేక భారాలు వేయడం జరుగుతుందని, ముఖ్యంగా రాజ్యాంగంలోని స్వేచ్ఛ సమానత్వం వాక్ స్వాతంత్రపు హక్కును అణిచివేయడం జరుగుతుందని ప్రజాస్వామ్యాన్ని కూని చేసే రీతిలో దుర్మార్గమైనటువంటి విధానాలను అవలంబిస్తున్నారని ఆనాడు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్న భగత్ సింగ్ అల్లూరి సీతారామరాజు నేతాజీ సుభాష్ చంద్రబోస్ మహాత్మా గాంధీ చంద్రశేఖర్ ఆజాద్ లాంటి నాయకుల స్ఫూర్తితో నేడు పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు స్వాతంత్ర్యం తర్వాత సాధించుకున్న ఫలాలు రైతులకు కార్మికులకు విద్యార్థులకు యువకులకు మహిళలకు సరైన రీతిలో అందడం లేదని వారికి రావాల్సిన కావాల్సిన హక్కులను తుంగలో తొక్కడం జరుగుతుందని ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదానికి తలొగ్గి రైతులను పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసే రీతిలో రైతులను ఖూనీ చేయడం జరుగుతుందని రైతులకున్న భూములను అప్పనంగా అప్పజెప్పి రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు.అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాల ద్వారా మన దేశంలో పండే పంటలను తక్కువ ధరకు ఎగుమతి చేస్తూ అమెరికా కు లాభాలను చేకూర్చే పద్ధతిలో ఉన్నటువంటి ఒప్పందాలను పూర్తిగా రద్దు చేసుకోవాలని అదేవిధంగా బ్రిటిష్ కాలం నాటి నుండి ఉన్నటువంటి 44 కార్మిక చట్టాలను కుదింపు చేసి నాలుగు లేబర్ కోడ్ లుగా చేయడం ద్వారా పెట్టుబడిదారులకు కార్మికులను నయా బానిసలుగా చేయడం జరుగుతుందని వీటి వలన కార్మికులు ఎలాంటి పోరాటం చేయకుండా యాజమాని చెప్పు చేతుల్లో ఉండేటువంటి విధంగా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాలను మార్చిందని అన్నారు ముఖ్యంగా ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసి బ్యాంకు రైల్వే రక్షణ విద్యుత్ లాంటి ప్రధాన సంస్థలను కార్పోరేట్ సంస్థలకు విదేశీ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పి దేశంలోని సంపదనంతా దోచిపెడుతుందని అన్నారు వీటి పైన మాట్లాడే మేధావులను, వివిధ రాజకీయ పార్టీల నాయకులను దేశద్రోహులుగా చిత్రీకరించి జైలులో చనిపోయేంతవరకు దేశద్రోహపు కేసులు పెట్టడం జరుగుతుందని, బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కనుసందుల్లో పరిపాలన చేస్తూ చెప్పింది వినాలి ఇచ్చింది తినాలి తీసుకోవాలి అనేటువంటి రీతిలో పాలన సాగిస్తుందని అన్నారు ప్రజల మధ్యన మతం కులం ప్రాంతం



పేరుతో చిచ్చుపెట్టి పాలనను కొనసాగిస్తుందని ప్రజలు ఎప్పుడైతే ఇబ్బందులు పడుతున్నారని తిరుగుబాటు మొదలయ్యే క్రమంలో ఉగ్రవాదాన్ని, మతోన్మాదాన్ని ముందుకు తీసుకువచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా పాలన సాగుతుందని అన్నారు. పార్లమెంటులో రాజ్యాంగాన్ని కాపాడాల్సిన రీతిలో మాట్లాడటం లేదని ఏకపక్షంగా అన్ని బిల్లులను ఆమోదించుకుంటూ ఏకపక్షపాలన సాగిస్తుందని దేశంలో మునిపెన్నడూ లేని విధంగా 52 సార్లు అన్ని రకాల పేపర్లను లీకేజ్ చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడి తే పోరాటం చేస్తున్న ప్రశ్నిస్తున్న విద్యార్థుల ను కాక్రోచ్లతో పోల్చి కాక్రోచ్ ల పోరాటానికి తలవంచి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా గత 12 సంవత్సరాల కాలంలో బిజెపి ప్రభుత్వం వలన రైతులకు విద్యార్థులకు యువకులకు న్యాయం జరగడం లేదని రాజధానిలో ఆందోళనలు తీవ్రతరం చేస్తున్న ఎలాంటి ఆలోచన చెయ్యకుండా నిర్లక్ష్యం వహిస్తుందని రాబోయే కాలంలో రైతులు కార్మికులు విద్యార్థులకు యువకులకు 20 సంవత్సరాల క్రితం వచ్చిన స్వాతంత్ర్య ఫలాలు నేటికీ అందడం లేదని ఐకమత్యంగా పోరాటం చేసి నిజమైన స్వాతంత్ర్య పలాలను దక్కించుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## మంత్రి ఫరూక్,కలెక్టర్ చేతుల మీదుగా వసుధారెడ్డికి ప్రశంసా పత్రం



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 15 :** నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ చేతుల మీదుగా వసుధారెడ్డి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. బండి ఆత్మకూరు మండలంలో వి బి జి రాంజీ విభాగంలో ఏపీవోగా పనిచేస్తున్న డాక్టర్ వసుధా రెడ్డి విధి నిర్వహణలో నిజాయితీగల అధికారిగా పేరు గడించారు. ఆమె సేవకు మెచ్చిన ప్రభుత్వం ఉత్తమ ప్రశంసా పత్రంతో సత్కరించింది. 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా. మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసా పత్రాన్ని వసుధారెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు, పాత్రికేయులు వసుధారెడ్డికి అభినందనలు తెలియజేశారు.

## సంఘమిత్ర లో ఘనంగా జరిగిన స్వతంత్ర దినోత్సవ వేడుకలు



**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 15 . (నంది పత్రిక ):**సంఘమిత్ర లో సంఘమిత్ర అద్యక్షులు చిలంకూరి శ్రీనివాస్ అద్యక్షతన 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ బద్రిష్,మామిడి మధుసూదన్ పాల్గొనగా ముఖ్యవక్త గా విభాగ్ సహకార్యవాహరామాంజనేయులు తో పాటు సంఘమిత్ర ఉపాధ్యక్షులు జే వెంకటేశ్వర్లు,సంఘమిత్ర కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి సంఘమిత్ర సభ్యులు వెంకటేశ్వరి డాక్టర్ శ్రవణ్ కుమార్ మల్లికార్జున ఆవాసప్రముఖ్ గంగాధర్ అభ్యాసిక పర్యవేక్షక్ శేఖర్ పాల్గొన్నారు.

## మంత్రి ఫరూక్,ఎస్పీల చేతుల మీదుగా ప్రశంసా పత్రం



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 15:** విధి నిర్వహణలో ఓ కానిస్టేబుల్ సేవలకు మెచ్చిన ప్రభుత్వ యంత్రాంగం ఉత్తమ ప్రశంస పత్రం అందుకునేందుకు అర్హత పొందారు. 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న శివలింగం మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ సమక్షంలో, జిల్లా ఎస్పీ సునీల్ సోరాన్ చేతుల మీదుగా ప్రశంశ పత్రాన్ని అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ జగన్మోహన్ బండి ఆత్మకూరు పోలీస్ సిబ్బంది కానిస్టేబుల్ శివలింగమును అభినందించారు.

## నంద్యాలలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 15 . (నంది పత్రిక ):**రాయలసీమ సాగునీటి సాధన సమితి ప్రధాన కార్యాలయం, నంద్యాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సమితి ఉపాధ్యక్షులు ఏరువ రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమితి కార్యవర్గ సభ్యులు సౌదాగర్ కాసిం మియా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి స్వాతంత్ర్య స్ఫూర్తి, ప్రజా హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, రాయలసీమ అభివృద్ధి వంటి అంశాలపై విశదీకరించారు.భారతదేశం ఎంతో మంది త్యాగధనుల పోరాట ఫలితంగా సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని నేటి రాజకీయ, సామాజిక పరిస్థితుల్లో పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. స్వాతంత్ర్య స్ఫూర్తి అనేది కేవలం ఒక వేడుకకే పరిమితం కాకుండా, ప్రజల హక్కుల సాధనకు, సమాన అభివృద్ధికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు మార్గదర్శకంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాల స్ఫూర్తి ప్రతి ఒక్కరి హృదయం నుండి ప్రారంభమై సమాజ మార్పుకు దోహదపడాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సమితి కార్యవర్గ సభ్యులు శంకర్ రెడ్డి, పట్నం రాముడు, ఎం.సి. కొండారెడ్డి, కొమ్మ శ్రీహరి, కృష్ణమోహన్, అసదుల్లా మియా, వెంకటేశ్వర నాయుడు, మురళి, మెహబూబ్ బాషా, రాఘవేంద్ర, సదాశివరెడ్డి, ఫర్వేజ్ తదితరులు స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర, ప్రస్తుత సామాజిక-రాజకీయ పరిస్థితులు, స్వాతంత్ర్య విలువలను సంరక్షించుకోవాల్సిన అవసరంపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

జాతీయ పతాకావిష్కరణతో ప్రారంభమైన ఈ వేడుకల్లో స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణనిచ్చిన "వందేమాతరం" మరియు జాతీయ గీతం "జనగణమన" ఆలపించారు. ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి అభివృద్ధి, కృష్ణా జలాల సంరక్షణ, రైతాంగ రక్షణ అంశాలను ప్రతిబింబిస్తూ సమితి రూపొందించిన ప్రత్యేక గీతం "శ్రీశైలం నీరేడ రాయలసీమ ప్రాణం" విడుదల చేశారు. ఈ గీతం కార్యక్రమానికి హాజరైన వారందరినీ ఆకట్టుకుని, జల సంరక్షణపై సమాజంలో చైతన్యం పెంపొందించే సందేశాన్ని అందించింది.

## జాతీయ జెండాను ఎగరవేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘ సభ్యులు "



**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 15 . (నంది పత్రిక ):**80 వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నంద్యాల జిల్లా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘ భవన ఆవరణము నందు జాతీయ జెండా ఎగురవేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు యం. అబ్దుల్ ఖాదర్ తో పాటు ఉపాధ్యక్షులు శ్రీను, జాయింట్ కలెక్టర్ డ్రైవర్ రాజారావు, మాజీ అధ్యక్షుడు మోహన్ రావు, మాజీ ఉపాధ్యక్షులు, మాజీ సభ్యులు సామెల్, జయ బాబు, రంగనాయకులు, వ్యవసాయ శాఖ డ్రైవర్ తిరుమల్, మద్దిలేటి, శివరామకృష్ణ, వైద్యశాఖ డ్రైవర్ కృష్ణ మొదలగువారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## డోన్ మార్కెట్ యార్డులో అంబరాన్నంటిన స్వాతంత్ర్య వేడుకలు

### జాతీయ జెండాను ఆవిష్కరించిన మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా రేణుక

### రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం: రాజా రేణుక



**నందిపత్రిక -డోన్** డోన్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, పండుగ వాతావరణంలో జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా రేణుక జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. అనంతరం యార్డు ఆవరణలోని గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**మహనీయుల త్యాగాలు చిరస్మరణీయం** ఈ సందర్భంగా చైర్మన్ రాజా రేణుక మాట్లాడుతూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ చిరస్మరణీయమని కొనియాడారు. వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**రైతాభ్యుదయమే ధ్యేయం** దేశానికి వెన్నెముక అయిన రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చైర్మన్ పేర్కొన్నారు. డోన్ మార్కెట్ యార్డుకు వచ్చే ప్రతి రైతుకూ మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా యార్డు యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. దళారుల బారిన పడకుండా రైతులు నేరుగా యార్డు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డును మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు పాలకమండలి సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డోర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా నారాయణమూర్తి, పాలకమండలి డైరెక్టర్లు, మార్కెట్ యార్డ్ సెక్రటరీ, సిబ్బందితో పాటు రైతు సోదరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఆవరణ, కలెక్టర్ బంగ్లాలో ఘనంగా జెండా వందన కార్యక్రమం



**కడప, బ్యూరో చీఫ్ ఆగస్టు 15 : నంది పత్రిక** స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వందేమాతరం గీతాలాపన జాతీయ పతాకావిష్కరణ చేసి వందన సమర్పణ చేశారు. అనంతరం జాతీయగీతం ఆలపించిన అనంతరం అధికారులు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపి సందేశాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తోపాటు.. డిఆర్వో మల్లికార్జునుడు, కలెక్టరేట్ ఏవో నాగేశ్వరరావు, అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టర్ క్యాంపు కార్యాలయ ఆవరణలో కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పాతాకావిష్కరణ చేసి వందన సమర్పణ చేశారు.



## ఎందరో వీరుల త్యాగపలితమే ఈనాటి స్వాతంత్ర్యం. ఎమ్మెల్యే ఆరణి





**తిరుపతి బ్యూరో చీఫ్ ఆగస్టు 15 నంది పత్రిక** ఎందరో వీరుల త్యాగపలితమే ఈనాటి మన స్వాతంత్రానికి కారణమని, వారి అడుగు జాడల్లో అందరూ నడవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన 80స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవిలు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో వీరులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడడం వల్లే మనకు స్వాతంత్ర్యం వచ్చిందని తెలిపారు. ప్రధానమంత్రి మోడీ ఆధ్వర్యంలో, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీలు ఘనంగా నిర్వహించామని తెలిపారు. యువతే దేశ భవిష్యత్ అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని ఆయన తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేలకు పైగా టీచర్ పోస్టులు భర్తీ చేసిన ప్రభుత్వం త్వరలో మరో డీఎస్సీ కి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఆయన చెప్పారు. 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లు, వికసిత్ భారత్ గా దేశాన్ని నిలిపేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజా అభివృద్దే ధ్యేయంగా మనందరం విధులు నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పరసారత్నం, రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర, ఏపియుఎఫ్ఐడిసి మెంబెర్ చందన, మాజీ కార్పొరేటర్ నారాయణ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ఏసిపి లు పార్వతి ప్రియ, మూర్తి, డి.ఈ. లు, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకల్లో ఆకట్టుకున్న జిల్లా పోలీస్ శాఖ స్టాల్



**కడప, బ్యూరో చీఫ్ ఆగస్టు 15 నంది పత్రిక** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కడప పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది.రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి శ్రీ బి.సి. జనార్ధన్ రెడ్డి.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ లతో కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు.జిల్లా ఎస్పీ శ్రీ షెల్కె నచికేత్ విశ్వనాథ్ పోలీస్ శాఖ అందిస్తున్న వివిధ సేవలను మంత్రికి వివరించారు. శక్తి బృందాలు, సైబర్ నేరాలు, డయల్112, గృహ భద్రత పర్యవేక్షణ వ్యవస్థలపై పోలీస్ అధికారులు సందర్శకులకు అవగాహన కల్పించారు. 'డిజిటల్ అరెస్ట్' పేరుతో చట్టంలో ఎలాంటి వ్యవస్థ లేదని, సీబీఐ, ఈడీ, ఐటీ అధికారుల పేరుతో వీడియో కాల్స్ చేసి బెదిరించే సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత, విద్యార్థులు ఉత్సాహంగా స్టాల్‌ను సందర్శించి పోలీసుల సూచనలు తెలుసుకున్నారు.

# శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాలలో అంగరంగ వైభవంగా జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**నంది పత్రిక గడివేముల** గడివేముల లోని స్థానిక పాఠశాల శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాలలో 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు చాలా ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల ఏ. ఒ రాఘవేంద్రరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ. ఒ.మ్.బి.ఎన్. రాఘవేంద్రరావు జెండ ఎగరవేయడం జరిగినది తర్వాత 80వ స్వతంత్ర దినోత్సవ సందర్భంగా మాట్లాడుతూ గౌరవనీయులైన ముఖ్య అతిథులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మరియు నా ప్రియమైన విద్యార్థినీ విద్యార్థులకు నా హృదయపూర్వక నమస్కారాలు.ఈరోజు ఆగస్టు 15, మన దేశ 80 వ స్వాతంత్ర్య దినోత్సవం. 1947 ఆగస్టు 15న మనం బ్రిటీష్ పాలన నుండి విముక్తి పొంది, స్వేచ్ఛా భారతావనిగా అవతరించిన గొప్ప రోజు ఇది. లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితమే ఈ స్వేచ్ఛ. మహాత్మా గాంధీ, నెతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, రాణి లక్ష్మీబాయి వంటి మహానుభావులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారు. వారి కల "స్వరాజ్యం నా జన్మ హక్కు" ఈరోజు నిజమైంది. స్వాతంత్ర్యం అంటే కేవలం బ్రిటీష్ వారి నుండి విడిపోవడం మాత్రమే కాదు. పేదరికం, నిరక్షరాస్యత, కులమత భేదాల నుండి కూడా మనం స్వేచ్ఛ పొందాలి. ఈ 79 సంవత్సరాలలో భారత్ సైన్స్, టెక్నాలజీ, వ్యవసాయం, రక్షణ రంగాలలో ఎంతో అభివృద్ధి సాధించింది. చంద్రయాన్, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలు మన దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటుతున్నాయి. కానీ మన బాధ్యత ఇంకా ఉంది. మనం యువతగా, దేశభక్తితో, కష్టపడి చదివి, నిజాయితీగా పని చేసి "వికసిత భారత్ 2047" కలను నిజం చేయాలి. ప్లాస్టిక్ వాడొద్దు, జాతీయ సమైక్యతను కాపాడుదాం, మన సైనికులను గౌరవిద్దాం. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా డంబెల్స్, కోలన్న,సాంస్కృతిక కార్యక్రమాలు పిరమిడ్లు, దేశభక్తి పాటలు, విద్యార్థినీ విద్యార్థుల స్పీచెస్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల స్పీచెస్ కార్యక్రమాలన్నీ చాలా బాగా ఘనంగా జరిగాయి.

80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జరిపిన కార్యక్రమాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థినీ విద్యార్థులందరికీ బహుమతి ప్రధానం చేయడం జరిగినది. చివరిగా, స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన వీరులకు




జోహార్లు. "జై హింద్" అనే నినాదంతో దేశసేవ చేస్తామని ప్రతిజ్ఞ చేద్దాశీ. ఈ కార్యక్రమంలో మ్ . బి . ఎన్ . రాఘవేంద్ర రావు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు మరియు విద్యార్థిని విద్యార్థులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# రెపరెపలాడిన మువ్వన్నెల జెండా...

**జెండా వందనం చేస్తున్న బర్డ్స్ సీఈవో పాల్ రాజారావు**




**చాగలమర్రి ఆగస్టు 15 నంది పత్రిక** భారతదేశ 80వ స్వా తంత్ర్య దినోత్సవం సందర్భంగా చాగలమర్రి మండలంలో శని వారం వివిధ ప్రభుత్వ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత బాలుర బాలికల పాఠశాలలో, ప్రైవేటు ప్రాథమిక ప్రాథమికోన్నత, పాఠశాలలతో పాటు, జూనియర్ డిగ్రీ కళాశాలలో, ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సమరయోధులకు నివాళులర్పించి జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు. మండల గ్రామీణ ప్రాంతంలోని ముత్యాలపాడు బర్డ్స్ హై స్కూలు, ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బర్డ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పలు ప్రాజెక్టుల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి పాల్ రాజారావు, పాఠశాల ప్రిన్సిపల్ సింధూర, కళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పలువురు వక్తలు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను అర్పించిన ఎందరో పోరాట సమరంలో అసువులు బాసారని, వీరులు వీర వనితలు ఒకే ఉమ్మడి లక్ష్యం కోసం ఏకమయ్యారని పలువురు వక్తలు కొనియాడారు. అల్పసంఖ్యాకమైన వీరుల సమిష్టి సంకల్పంతోనే స్వాతంత్రం సిద్ధించిందని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు దేశభక్తి గీతాలకు నృత్య ప్రదర్శన చేశారు. బ్రిటిష్ పాలన నుంచి దేశం వ్యక్తి పొందిన సంఘటనలను విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

# నంద్యాలలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





## పరేడ్ మైదానంలో వైభవంగా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు

## జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

## నంద్యాల పరేడ్ మైదానంలో దేశభక్తి సందడి అలరించిన శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు

**నంద్యాల బ్యూరో, ఆగస్టు 15(నంది పత్రిక):-** శనివారం ఉదయం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరేడ్ మైదానంలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి రాష్ట్రీయ సెల్యూట్ స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్‌తో కలిసి పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల ప్లాటూన్లు క్రమశిక్షణతో మార్చ్‌పాస్ట్ నిర్వహించాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మార్కెట్ యార్డ్ చైర్మన్ హరిబాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రాము నాయక్, జిల్లా స్థాయి అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ జిల్లాభివృద్ధిపై సందేశమిస్తూ సూపర్‌సిక్స్ హామీల్లో అత్యంత కీలకమైన 'అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం' ద్వారా ఏడాదికి రూ.20వేలను అర్హులైన రైతులకు అందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం ద్వారా 2026-2027 ఆర్థిక సంవత్సరంలో నంద్యాల జిల్లాలో 2 లక్షల 6 వేల 52 మంది రైతుల ఖాతాల్లో 139 కోట్ల రూపాయలను జమ చేయడం జరిగిందన్నారు. 2026 ఖరీఫ్ సీజన్ కు రూ.4,204 కోట్ల ఆర్థిక లక్ష్యానికి గాను ఇప్పటివరకు రూ.853 కోట్ల రూపాయల పంట రుణాలను 1,83,223 మంది రైతులకు అందించాం. తల్లికి వందనం పథకం కింద 1వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున జిల్లాలోని 2 లక్షల 75 వేల 394 మంది విద్యార్థుల తల్లుల మరియు సంరక్షకుల ఖాతాల్లో రూ.358 కోట్ల రూపాయలను జమ చేయడం జరిగిందన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటివరకు జిల్లాలో 3.51 కోట్ల మంది మహిళా ప్రయాణికులు, ట్రాన్స్ జెండర్లు మరియు 2.66 లక్షల మంది దివ్యాంగ ప్రయాణికులకు రూ.138 కోట్ల రూపాయల మేర లబ్ధి చేకూర్చామన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద జిల్లాలో 2 లక్షల 10 వేల 221 మందికి 91 కోట్ల 64 లక్షల రూపాయలను ప్రతినెల 1వ తేదీన ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేస్తున్నామన్నారు. మనమిత్ర-వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో సుమారు 1000కు పైగా పౌరసేవలు వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. శ్రీశైలం జలాశయం నుంచి వచ్చే నీటిని సాగునీటికి కాకుండా కేవలం త్రాగునీటి అవసరాలకే వినియోగించాలని, వరి పంటకు బదులుగా తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేసారు.సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం మరియు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకాల ద్వారా రూ.12.45 కోట్ల వ్యయంతో కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పండ్లు, కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్యాలు, ఔషధ మొక్కల సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. జలధార జలహారతి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చెరువులు, కాలువలు, నీటి వనరుల పునరుద్ధరణకు పెద్దపీట వేశాం. జిల్లాలోని 29 మండలాల్లో 2,103 పనులను చేపట్టి, 2044 పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో 'క్యాచ్ ది రైన్' ప్రచారం కింద నంద్యాల జిల్లాలో చేపట్టిన జల సంరక్షణ కార్యక్రమాలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ప్రశంసించడం జిల్లా యంత్రాంగానికి గర్వకారణం మంత్రి తెలిపారు. జల జీవన్ మిషన్ పథకం కింద శాశ్వత నీటి సరఫరా కోసం గ్రామీణ ప్రాంతాలలో 109 కోట్ల రూపాయలతో చేపట్టిన 419 పనులకు పరిపాలన ఆమోదం లభించగా ఇప్పటి వరకూ 197 పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మైనారిటీల సంక్షేమం, వారి సామాజికఆర్థిక అభివృద్ధితో పాటు మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోంది. ఈ ఏడాది పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 5,076 మంది మైనారిటీ విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకం కింద రూ.6.55 కోట్లను వారి తల్లుల ఖాతాల్లో జమ చేశామన్నారు. అలాగే, 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల కింద 31,675 మంది మైనారిటీ లబ్ధిదారులకు రూ.13.85 కోట్లను అందించి వారి ఆర్థిక భద్రతకు ప్రభుత్వం అండగా నిలిచాం. అలాగే 3,056 మందికి దీపం కనెక్షన్లను ఉచితంగా అందజేశాం.జిల్లాలో ఉన్న 7 నైపుణ్య శిక్షణా కేంద్రాల ద్వారా నిరుద్యోగ యువతీ యువకులలో నైపుణ్యాలు పెంచి జాబ్ మేళాల ద్వారా ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకూ 6 నియోజకవర్గాలలో 74 జాబ్ మేళాలు నిర్వహించి 7,139 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటివరకూ రూ.143 కోట్ల రూపాయలను ఖర్చు చేసి 69,762 మందికి ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా వైద్య చికిత్సలు అందించడం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల నుండి 102 తల్లిబిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాల ద్వారా 12,350 తల్లి బిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చామన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారా అభివృద్ధి పథంలో పయనించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో 7 కోట్ల 55 లక్షల రూపాయల పెట్టుబడితో స్థాపించిన 42 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ద్వారా 307 మందికి ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. జిల్లాలోని 5 లక్షల 49 వేల 122 మంది తెల్ల రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. దీపం-2 పథకం కింద ఇప్పటి వరకూ 4 లక్షల 4 వేల 670 మంది లబ్దిదారులకు 3 ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణి చేయడం జరిగిందన్నారు. రూ.146 కోట్ల సబ్సిడీ మొత్తాన్ని గ్యాస్ వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసాం. వి.బి.జి రామ్.జి. పథకం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో 22 వేల 221 ఫారంపాండ్లు, 2,221 చెక్ డ్యాంలు, 202 పర్కులేషన్ ట్యాంకులను బలోపేతం చేయడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం, భూగర్భ జలాల పునరుత్పత్తి గణనీయంగా పెరుగుతోందన్నారు. జిల్లాలో 293 గ్రామాల్లో రీ-సర్వే పూర్తికాగా, 230 గ్రామాలకు సంబంధించి 1,47,031 పట్టాదారు పాస్ పుస్తకాల్లో 1,35,560 పాస్ పుస్తకాల ముద్రణ పూర్తయిందని, మిగిలిన పాస్ పుస్తకాల ముద్రణను వేగవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. జిల్లాలో 230.25 కి.మీ. జాతీయ రహదారి ప్రాజెక్టులకు భూములు కోల్పోయిన రైతులకు రూ.373.92 కోట్ల నష్టపరిహారం చెల్లించామన్నారు. ప్రస్తుతం ఉన్న ఆరు ప్రాజెక్టులకు అదనంగా ఎన్‌హెచ్ - 544డి కేటాయింపు జిల్లా అభివృద్ధికి మరింత ఊతమిస్తోందన్నారు. సోలార్ పవర్ సంస్థల అభివృద్ధికి అభివృద్ధికి 12,519 ఎకరాలు, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు 102 ఎకరాలు, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టులకు 317 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించడం జరిగిందన్నారు. అనంతరం శ్రీశైల దేవస్థానం, వ్యవసాయ, ఉద్యాన, డిఎంహెచ్వో, విద్యాశాఖ, ఆర్డబ్ల్యూఎస్, మున్సిపాలిటీ, హౌసింగ్, వాటర్ రిసోర్సెస్, డ్వామా, డిఆర్డిఏ, డిపిఓ, కోఆపరేటివ్, ఐసిడిఎస్, ఏపీఎస్పీడీసీఎల్, ఇండియన్ రెడ్ క్రాస్, పర్యాటకం శక్తి టీం ఆర్టీవో తదితర శాఖలు ప్రదర్శించిన శకటాల ప్రదర్శన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ పనితీరు కనపరిచిన అధికారులు, ఉద్యోగులకు, స్వచ్ఛంద సేవా సంస్థలకు ప్రశంసా పత్రాలను మంత్రి, కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా పంపిణీ చేశారు.






# కడపలో ఘనంగా 80వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

## జాతీయ జెండాను ఆవిష్కరించిన

## రాష్ట్ర భవనాలు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి




**కడప బ్యూరో చీఫ్ ఆగస్టు 15 నంది పత్రిక**స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లో శనివారం ఉదయం అత్యంత వేడుకగా... కన్నుల పండువగా ప్రారంభమైన 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.ఈ వేడుకలలో రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖామంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసి డా. నిధీ మీనా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఉదయం 9.00గం లకు వందేమాతరం గీతాలాపన అనంతరం రాష్ట్ర మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్రీయ సెల్యూట్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ లతో కలిసి మైదానంలో పటాలాలను పరిశీలించారు. వివిధ ప్లాటూన్లు మార్చ్ ఫాస్ట్ నిర్వహించాయి ఈ సందర్భంగా ప్రభుత్వం జిల్లాలో చేపట్టి, అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు రాష్ట్ర మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి సందేశమిచ్చారు.

# వెలుగోడులో మిన్నంటిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**పాఠశాలలు, ఆఫీసులు, పొలాల్లో రెపరెపలాడిన జాతీయ జెండా**



**వెలుగోడు ఆగస్టు 15 (నందిపత్రిక):** వెలుగోడు పట్టణం మరియు పరిసర ప్రాంతాలలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. మండల వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వివిధ రాజకీయ పార్టీల ఆఫీసులు, గ్రంథాలయం, ప్రెస్‌క్లబ్‌లలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి ప్రజలు, అధికారులు, నాయకులు తమ దేశభక్తిని చాటుకున్నారు.

**ప్రభుత్వ కార్యాలయాల్లో జెండా వందనం:** పోలీస్‌స్టేషన్: ఎస్ఐ బి. సురేష్ జాతీయ జెండాను ఆవిష్కరించి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.తహశీల్దార్ కార్యాలయం: తహశీల్దార్ శ్రీనివాసులు గౌడ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.ఎంపీడీఓ కార్యాలయం: ఎంపీపీ లాలం రమేష్ ముఖ్య అతిథిగా హాజరై జెండా వందనం నిర్వహించారు.గ్రామ పంచాయతీ: స్పెషల్ ఆఫీసర్ స్వాతి జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఇతర శాఖలు: విద్యుత్ శాఖ ఆఫీస్‌లో ఏఈ రవీంద్ర నాయక్, ఎంఈఓ కార్యాలయంలో బ్రహ్మం నాయక్, శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి సుమలత త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. పాత్రికేయులు, రాజకీయ నాయకుల వేడుకలు: ప్రెస్‌క్లబ్: వెలుగోడు ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయుడు అభిమన్యుడు జాతీయ జెండాను ఎగురవేశారు.తెలుగుదేశం పార్టీ నాయకుడు అన్నారపు శేషిరెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు.ఎస్డీపీఐ పార్టీ ఆఫీసు వద్ద నాయకుడు ఆరిఫ్ హుస్సేన్ జెండా వందనం నిర్వహించారు.జనసేన పార్టీ: పార్టీ నాయకుడు షాలు భాష జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో జెండా వందనం నిర్వహించి, విద్యార్థులకు స్వాతంత్ర్య పోరాట ప్రాముఖ్యతను వివరించారు.ప్రత్యేకించి, ఉపాధి హామీ పథకం కూలీలు కూడా తమ దేశభక్తిని వినూత్నంగా చాటుకున్నారు. నూరుల్లా ఆధ్వర్యంలో పనుల్లో ఉన్న కూలీలు పొలాల్లోనే జాతీయ జెండాను ఎగురవేసి, సెల్యూట్ చేసి జాతీయ సమైక్యతను చాటారు. ఈ వేడుకలలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కూలీలు మరియు స్థానిక ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.



# ఆకట్టుకున్న బాలల వేషధారణలు...

## బాలల చేతుల్లో రెపరెపలాడిన త్రివర్ణ పతాకం




**శిరీవెళ్ల :(నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు తల్లిదండ్రులు తమ చిన్నారులను స్వాతంత్ర్య సమరయోధులుగా వేషధారణలు వేయించి పాఠశాలలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు తీసుకువెళ్లారు. దేశ నాయకుల వేషధారణలో ఉన్న బాల బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను, పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. తమ పిల్లల్లో మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి దేశ నాయకుల వేషధారణలు కట్టుకున్నాయి. బాలల చేతుల్లో భారత దేశ త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. చిన్నారి బాల బాలికలు శుభోదయాన్నె పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధమై కొత్త దుస్తులు ధరించి మువ్వన్నెల మూడు రంగుల త్రివర్ణ పతాకం చేత పట్టుకొని వెళ్ళుతూ దేశభక్తి చాటారు.

## నంద్యాల జిల్లా పెరేడ్‌లో 'లిటిల్ ఏంజెల్స్' ప్రతిభ బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు కైవసం



**వెలుగోడు ఆగస్టు 15 (నందిపత్రిక):** నంద్యాల జిల్లా కేంద్రంలోని పెరేడ్ గ్రౌండ్‌లో శనివారం ఘనంగా జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వెలుగోడు పట్టణానికి చెందిన లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో తమ ప్రతిభను చాటి 'బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు' సాధించారు. ఈ సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొనేందుకు వెలుగోడు లిటిల్ ఏంజెల్స్ పాఠశాలకు జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రెడ్డి ప్రత్యేక అవకాశం కల్పించారు.

**ఆకట్టుకున్న పిరమిడ్లు, దేశభక్తి నృత్యాలు:** జిల్లా స్థాయి వేడుకల్లో భాగంగా మొత్తం 9 పాఠశాలలకు చెందిన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పోటీపడగా, లిటిల్ ఏంజెల్స్ పాఠశాలకు చెందిన 100 మంది విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్లు, దేశభక్తి నృత్యాలు ప్రేక్షకులను, న్యాయనిర్ణేతలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థుల అద్భుత ప్రదర్శనకు మెచ్చిన న్యాయనిర్ణేతలు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన మూడు పాఠశాలల్లో ఒకటైన లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌కు 'బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు' ప్రకటించారు.

**ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు ప్రదానం:** ఈ పురస్కారాన్ని రాష్ట్ర మంత్రి ఎన్.ఎమ్.డి. ఫారూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియ, జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ మరియు జాయింట్ కలెక్టర్ల చేతుల మీదుగా పాఠశాల యాజమాన్యానికి, విద్యార్థులకు ఘనంగా అందజేశారు.

**పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు:** జిల్లా స్థాయి పెరేడ్‌లో పాల్గొనే అవకాశం కల్పించిన డీఈవో జనార్దన్ రెడ్డికి, ఎంఈఓ బ్రహ్మం నాయక్‌కు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం. ఎఫ్. ఇమ్మానియేల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల కఠోర శ్రమ, ఉపాధ్యాయుల నైపుణ్యానికి ఈ అవార్డు నిదర్శనమని, భవిష్యత్తులో పాఠశాల మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

జిల్లా స్థాయిలో వెలుగోడు పట్టణానికి మంచి గుర్తింపు తెచ్చిన లిటిల్ ఏంజెల్స్ పాఠశాల విద్యార్థులను, యాజమాన్యాన్ని వెలుగోడు పట్టణ ప్రజలు, పలు పాఠశాలల కరస్పాండెంట్లు, బంధుమిత్రులు హృదయపూర్వకంగా అభినందిస్తూ సంతోషం వ్యక్తం చేశారు.

## బేతంచెర్ల సీపీఐ కార్యాలయం నందు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.



**బేతంచెర్ల ఆగస్టు 15 ( నందిపత్రిక ).** బేతంచెర్ల పట్టణంలోని సీపీఐ కార్యాలయం నందు 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి నాగరాజు, సిపిఐమండల సహాయ కార్యదర్శులు తాలూకా తిరుమలేష్, డి.దస్తగిరి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు భారత రాజ్యాంగం నిర్దేశించిన లౌకిక, ప్రజా స్వామిక,సామ్య వాద విలువలు రక్షించు కోవడానికి దేశ ప్రజలందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని సాధించడానికి భావా ప్రకటన విశ్వాస ఆరాధనలలో స్వేచ్ఛ కాపాడుకోవడానికి.దేశ స్వతంత్రాన్ని, సమైక్యతను, సార్వభౌమత్యాన్ని సంరక్షించు కోవడానికి మేమంతా పునర్అంకితమవుతాం"మార్పు రావాలి -మార్పు కావాలి" అనే నినాదంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను,పాలకులు అనుసరిస్తున్న అనాలోచిత, తిరోగమన విధానాలను ఎండగట్టేందుకు,ప్రజావ్యతిరేక నిర్ణయాలను,మతోన్మాద చర్యలను,ప్రైవేటీకరణ యత్నాలను తిప్పి కొట్టేందుకు ప్రజల,మాన,ప్రాణ,హక్కుల రక్షణ కోసం,శాంతి,సమానత, సామరస్యం పరిరక్షణ కోసం, మేము సైతం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సారథ్యంలో కమ్యూనిస్టులుగా, ప్రజల తరపున ఉద్యమిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నాం.అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ సీపీఐ మండల మధు, గౌరీ ఉదయ్,శివ,ఖదీర్,గోపి, ధనుంజయ,శివ,హమీద్, మహబూబ్,ఇద్రుస్ భాష,సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

**వెలుగోడు ఆగస్టు 15 (నందిపత్రిక):** వెలుగోడు స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మంగళవారం స్కాలర్‌షిప్‌లను అందజేశారు. విద్యార్థులు చూపిన ప్రతిభ (మెరిట్) ఆధారంగా, ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీ బాల బాలికలకు ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు. కెనరా బ్యాంక్ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రతి సంవత్సరం ఒక ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేసుకుని, అక్కడ చదువుతున్న నిరుపేద, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ స్కాలర్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ కె. పరశురాముడు, కె.ఎం.డి. హుస్సేన్, ఆచారి, రాజేష్, రాజు, ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ఈ సహాయం అందిస్తున్నామని, విద్యార్థులందరూ లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**సిరివెళ్ల( నంది పత్రిక** స్థానిక ఎర్రగుంట్ల జిటిఆర్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడమైనది .ఈ సందర్భంగా కళాశాల లెక్చరర్లు స్వాతంత్ర దినోత్సవ ప్రాముఖ్యత గురించి విద్యార్థినీ, విద్యార్థులకు తమ సందేశం ద్వారా వివరించడమైనది. అలాగే మా కళాశాల సివిక్స్ లెక్చరర్ పి. అంజయ్య చౌదరి తన సబ్జెక్టులో అత్యధిక మార్కులు సాధించిన సిఇసి విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారు. నగదు బహుమతులు పొందిన వారిలో

టీ.ప్రియాంక కు రూ.2000/- డి. హుస్సేనయ్య కు రూ.1000/-

యం. చిన్న కు రూ. 1000/- ఎ. కార్తిక్ కు రూ. 1000/-

జి. రాఘవేంద్ర కు రూ.1000/-లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డి. శ్రీనివాసులు, లెక్చరర్లు బాలచంద్రుడు, అంజయ్య చౌదరి,బాలరాజు,బాలచింతలయ్య మరియు నాన్ టీచింగ్ స్టాఫ్ సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఘనంగా 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు



**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 15 . (నంది పత్రిక ):**స్థానిక కేసీ కెనాల్ కాంపౌండ్ లోని రెడ్ క్రాస్ బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ఆవరణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరిగింది.నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ కోశాధికారి డాక్టర్ అరుణ కుమారి పతక ఆవిష్కరణ చేయగా రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ భాష, నంద్యాల జిల్లా ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్ ఆనంద గురూజీ, రెడ్ క్రాస్ మీ ఇంటికి మీ డాక్టర్ ప్రాజెక్టు వైద్యులు డాక్టర్ కమల్, సీనియర్ టెక్నీషియన్ రమేష్, డిఎఫ్ఓ అబ్దుల్లా రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరికలు

### వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరిన 15 కుటుంబాలు

### తిరునాంపల్లి గిరి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కండువాలు కప్పిన ఎమ్మెల్యే కోట్ల



**నందిపత్రిక -డోన్** డోన్ మండల పరిధిలో తెలుగుదేశం పార్టీ రోజురోజుకూ మరింత బలోపేతమవుతోంది. తిరునాంపల్లి గిరి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో డోన్ మండలానికి చెందిన కోట్రాయి, తిరునాంపల్లి, కొత్తబుర్జు, నాకవాగుపల్లె గ్రామాల నుండి దాదాపు 15 కుటుంబాలు వైఎస్సార్‌సీపీకి గుడ్‌బై చెప్పి తెలుగుదేశం పార్టీలో చేరాయి. డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో, డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొని, నూతనంగా పార్టీలోకి వచ్చిన వారికి పచ్చ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

**కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పెరిగింది** ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీ వైపు వస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంపై రోజురోజుకూ ప్రజలకు విశ్వాసం పెరుగుతోందనడానికి ఈ చేరికలే నిదర్శనమని పేర్కొన్నారు. పార్టీ నమ్మి వచ్చిన ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయి సహకారం ఉంటుంది. నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి ఆయా గ్రామాల్లో పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరి ప్రసాద్ రెడ్డి టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


## అవార్డు పొందిన జూనియర్ అసిస్టెంట్ మౌనిక

### ప్రశంసించిన రెవిన్యూ సిబ్బంది

**చాగలమర్రి ఆగస్టు 15 నంది పత్రిక** మండల కేంద్రమైన చాగలమర్రిలోని తహసిల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఓ మౌనిక 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ జూనియర్ అసిస్టెంట్ గా, బెస్ట్ బిఎల్ఓ గా శనివారం రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఘనోర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. విధి నిర్వహణలో భాగంగా ఎస్ ఐ ఆర్, ఓటర్ జాబితా సవరణలో ప్రజలకు అందుబాటులో ఉండి ఓర్పుతో సహనంతో సేవలందించారని, అలాగే బెస్ట్ బి ఎల్ వో గా ప్రసాద్ రెడ్డి కూడా అవార్డుకు ఎంపికైనందున చాగలమర్రి తహసిల్దార్ ఫణీంద్రుడు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్తార్, మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారులు, సహాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు అభినందించారు. ఇలాంటి ప్రశంస పత్రాలు మరిన్ని అందుకోవాలని ప్రశంసించారు.



# సేవలకు నజరానా... ప్రశంసల పురస్కారం



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 15:** విధి నిర్వహణలో అంకితభావంతో ప్రజలకు సేవలందించిన బండి ఆత్మకూరు మండలంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులకు ప్రశంసల పురస్కారం లభించింది. ప్రశంసలు పొందిన ఉద్యోగుల సేవలను గుర్తించి తోటి ఉద్యోగస్తులందరూ వీరినిస్ఫూ ర్తిగా ను మార్గదర్శకంగా తీసుకొని ప్రజలకు మరింత సేవలు అంద చేస్తారని భావిస్తూ, జిల్లా యంత్రాంగం ప్రత్యేక ప్రశంసల పేరిట పురస్కారాలను అందజేస్తూ ఉంది. 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా, బండి ఆత్మకూరు మండలంలోని వివిధ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ, జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్, ట్రాన్స్ కో ఎస్ ఇ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఉపాధి హామీ విభాగంలో ఏపీవోగా పనిచేస్తున్న డాక్టర్ వసుధా రెడ్డి విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో జరుగుతున్న ఉపాధి పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించడం, సిబ్బందిని అనునిత్యం అప్రమత్తం చేస్తూ బాధ్యత విధంగా విధులు నిర్వహిస్తున్న వసుధా రెడ్డి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. వ్యవసాయ విభాగంలో ఏ ఈ ఓ గా పనిచేస్తున్న లక్ష్మయ్య శనివారం నాడు జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా సేవ పురస్కారాన్ని అందుకున్నారు. రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న శ్యాం కుమార్, పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న శివలింగం, సంత జుటూరు గ్రామంలో ఆశా వర్కర్ గా పనిచేస్తున్న బేతి సువర్ణమ్మ,లకు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. బండి ఆత్మకూరు విద్యుత్ కార్యాలయంలో లైన్మెన్ గా పనిచేస్తున్న వెంకటయ్య, ట్రాన్స్కో సూపరింటెండెంట్ ఇంజనీరు సుధాకర్ రావు చేతుల మీదుగా స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. విధి నిర్వహణలో ప్రశంసా పత్రాలను అందుకున్న సిబ్బందికి ఆయా శాఖలకు చెందిన అధికారులు అభినందనలు తెలియజేశారు. తమ సేవలకు దక్కిన ఈ గౌరవాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రజలకు మరింత సేవలను అందిస్తామని పురస్కార గ్రహీతలు పేర్కొన్నారు.



## ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.



**సిరివెళ్ల (నంది పత్రిక)**భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను సిరివెళ్ల మండల పరిధిలోని సిరివెళ్ల మెట్ట వద్ద అథర్ నిజాముద్దీన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిరివెళ్ల ఎస్ఐ లిమధుసూదన్ గారులి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి,దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మధుసూదన్ గారు మాట్లాడుతూ,స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని,దేశభక్తి, ఐక్యత,రాజ్యాంగ విలువలను గౌరవించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత దేశ అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో రాజకీయ నాయకులు వీరా చీ వసీం, వైస్ సర్పంచ్ దీ.ఇంతియాజ్,దీజ ఫిదా ఖా. చాంద్ , - ప్రజా సంఘాల ప్రతినిధులు బిరువాల బాషా,జాన్సన్,రాజు, - సిరివెళ్ల యువత,స్థానిక ప్రముఖులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

**ఈ సందర్భంగా అథర్ నిజాముద్దీన్** మాట్లాడుతూ,స్వాతంత్ర్య దినోత్సవం కేవలం జెండా ఆవిష్కరణకు పరిమితమైన కార్యక్రమం కాదని,స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుని దేశ సేవ పట్ల మన బాధ్యతను గుర్తుచేసుకునే పవిత్రమైన రోజని అన్నారు. సిరివెళ్ల యువతను సామాజిక సేవ,విద్య, ఉపాధి మరియు ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో మరింతగా భాగస్వామ్యం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఐక్యత,అభివృద్ధి,ప్రజాసేవే మన లక్ష్యం.



# రెపరెపలాడిన త్రివర్ణపతాకం

**-ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవం**



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలో త్రివర్ణపతాకం రెపరెపలాడింది. శనివారం మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవం అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మేరి, ఎంపీపీ కుసుమలత, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, పోలీసు స్టేషన్ నందు ఎస్ఐ జయశేఖర్, వెలుగు కార్యాలయంలో ఏపీఎం పుల్లయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మహమ్మదు బెగ్ త్రీవర్ణపతాకాన్ని ఎగురవేశారు. అదేవిధంగా వీబీజీ రాంజీ పనులవద్ద కులీలతో కలసి ఏపీఓ విమలమ్మ, కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాలలో ప్రిన్సిపాల్ కృష్ణాబాయి, ఎమ్మార్సీ భవనం నందు ఎంఈఓ నాగరాజు, మండల వ్యవసాయ కార్యాలయంలో ఏఓ అమిరున్నీసా బేగం, సరస్వతి విద్యామందిర్ నందు కరస్పాండెంట్ మల్లయ్య, రాజరాజేశ్వరి హైస్కూల్ నందు ప్రిన్సిపాల్ వాసుదేవరెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణలు జెండా ఎగురవేసి స్వాతంత్ర్య వేడుకులు జరుపుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ సుధారెడ్డి, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బద్వేల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సముదాయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**బద్వేల్, ఆగస్ట్ 15 (నంది పత్రిక):** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బద్వేల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సముదాయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి వై. సరిత గారు జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి వై. సరిత మాట్లాడుతూ మొక్కలు, చెట్లు మానవాళికి ఎంతో ముఖ్యమని, ప్రకృతిని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని దేశం పట్ల గౌరవం, ప్రేమ కలిగి ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## ఘనంగా80వస్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.



**సిరివెళ్ల (నంది పత్రిక)** నంద్యాల జిల్లా, సిరివెళ్ల లోని ఏ.ఆర్. మోడల్ స్కూల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ వేడుకలకు మాజీ గ్రౌజ సభ్యులు శ్రీ యమ గూరప్ప గారు, వావీజ చైర్మన్ శ్రీమతి మచ్చ లావణ్య గారు, పాఠశాల స్థల దాత శ్రీ అబ్దుల్ లతీఫ్ గారు, శ్రీ లింగమయ్య గారు ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు మరియు వివిధ వినోదాత్మక కార్యక్రమాలతో అందరినీ అలరించారు. అనంతరం వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా. ఇష్రత్ బేగం గారు స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించి, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది మరియు తల్లిదండ్రులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఉత్తమ సేవ పురస్కర అవార్డు అందుకున్న. ఏపిఎం అంబమ్మ



**జూపాడుబంగ్లా ఆగస్టు 15 (నంది పత్రిక)** ప్రతి సంవత్సరం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన అధికారులకు ప్రశంస పత్రాలు పురస్కారాలు అందించడం మనదేశ ఆనవాయితీ ఈకోలో ఉత్తమ సేవలు అందించిన జూపాడుబంగ్లా మండలంలోని ఏపీఎం అంబమ్మకు నంద్యాల కలెక్టర్ కార్యాలయం నందు 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. త్రివర్ణపతాకం ఎగురవేసిన అనంతరం రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ మరియు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా జూపాడుబంగ్లా ఏపిఎం అంబమ్మ ఉత్తమ ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఉత్తమ సేవా ప్రశంస పత్రాలను అందుకున్న ఏపీఎంను కార్యాలను సిబ్బంది మరియు జూపాడు బంగ్లా ప్రజలు అభినందనలు తెలియజేశారు .

## టిడిపి కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ

**నంది పత్రిక ఆత్మకూరు...** నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలంలో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నేడు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి కార్యాలయం నందు జాతీయ పథకాన్ని ఎగురవేసిన పార్టీ పరిశీలకులు గుడిపూడి భాస్కర్, ఈయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎందరో మహానీయులు స్వాతంత్ర్యం కొరకు బ్రిటిష్ వారి పైన పోరాటం చేసి వారి ప్రాణ త్యాగానికి కూడా వెనకడుగు వేయకుండా మన భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించినారు ఈ జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమంలోపట్టణ పార్టీ అధ్యక్షుడు జెట్టి వేణు గోపాల్, మండల అధ్యక్షులు రవీంద్రబాబు, సింగిల్ విండో చైర్మన్ షాబుద్ధిన్, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, క్లస్టర్ ఇంచార్జ్ లు కమతం శంకర్, దినకర్, కొప్పరపు రవి, ఉమాదేవి, సరోజ, శిరీష తదితరులు. పాల్గొన్నారు



# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్

**పోరుమామిల్లలో ఘనంగా జెండా ఆవిష్కరణ దేశభక్తి, మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి**



**పోరుమామిల్ల, ఆగస్టు 15: ( నంది పత్రిక):** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పోరుమామిల్ల పట్టణంలోని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ కార్యాలయంలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సభ్యులు, కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ గంగన్న ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్యం అనేది కేవలం బ్రిటిష్ పాలన నుంచి విముక్తి మాత్రమే కాదని, ప్రతి పౌరుడికి సమాన హక్కులు, గౌరవం, స్వేచ్ఛ లభించే సమాజాన్ని నిర్మించడమే నిజమైన స్వాతంత్ర్య స్ఫూర్తి అని పేర్కొన్నారు. మానవ హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని గంగన్న పిలుపునిచ్చారు. సమాజంలో బలహీన వర్గాలు, పేదలు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు తదితరులకు అన్యాయం జరిగినప్పుడు వారి తరఫున నిలబడటం మానవత్వానికి నిదర్శనమని అన్నారు. ఎక్కడైనా హక్కుల ఉల్లంఘన జరిగితే ప్రజలకు అవగాహన కల్పిస్తూ, చట్టపరమైన మార్గాల్లో వారికి న్యాయం జరిగేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని, యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న సమానత్వం, సామాజిక న్యాయం, సోదరభావం కలిగిన భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గంగన్న ఆకాంక్షించారు. అలాగే జాతీయ పండుగలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా దేశం పట్ల మన బాధ్యతలను గుర్తుచేసే సందర్భాలుగా ఉండాలని ఆయన అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవడంతో పాటు, ఇతరుల హక్కులను గౌరవించడం కూడా ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సెక్రటరీ ఫణి రావు, ప్రెసిడెంట్ గంగన్న, ఆఫీస్ సెక్రటరీ ప్రవీణ్, ఆర్గనైజర్ సెక్రటరీ సాగర్, ఆర్గనైజర్ సెక్రటరీ రాజు, సంస్థ సభ్యులు సుహాసిని, రామకోటి, రామయ్య, చంద్రశేఖర్, శేఖర్ తదితరులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు. అనంతరం సభ్యులు ఒకరికొకరు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. దేశ సమగ్ర అభివృద్ధి, ప్రజల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని సభ్యులు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కార్యాలయంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమం దేశభక్తి వాతావరణంలో ఉత్సాహంగా సాగింది.

## ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**పోరుమామిల్ల, ఆగస్టు 15 (నంది పత్రిక )** సిద్దవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కె. గంగయ్య ఆధ్వర్యంలో ఘనంగా 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్ర్యం ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా లభించిందని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య స్ఫూర్తిని విద్యార్థుల్లో పెంపొందించడంతో పాటు, దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, నైతిక విలువలను అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. "నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి విద్యతో పాటు మంచి సంస్కారం, నైతిక విలువలు, పెద్దల పట్ల గౌరవం, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించుకున్నప్పుడే బలమైన, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించగలం" అనితెలియజేశారు. పాఠశాల చైర్మన్ వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు వివిధ వేషధారణలు ధరించి పాల్గొనడం జరిగింది. ఆటలలో గెలుపొందిన వారికి బహుమతులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె.వి.సుబ్బారెడ్డి పి.హరినాధరెడ్డి శ్రీ సి. సుమలత, కె. చంద్రశేఖర్ బి.ఆర్.యస్.చంద్రకుమార్, యల్. ఓబులమ్మ ,కె.పుల్లయ్య, డి. లక్ష్మి ప్రసన్న,కె.చెన్న కృష్ణయ్య ,యమ్. రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు

## ఎంపిడిఒ ఆఫీస్ లో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.

**ముప్వన్నెల జెండాను ఎగురవేసిన ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం.**



**సిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం లో ఎంపిడిఒ శివ మల్లేశ్వరప్ప ఆధ్వర్యంలో ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం అధ్యక్షతన 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ, మరియు ఇతర జాతీయ నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఎంపీపీ నాయక్ మొహమ్మద్ వసిమ్ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ రెపరెపలాడే ముప్వన్నెల త్రివర్ణ పతాకాన్ని ఎగరవేసి దేశభక్తి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సిరివెళ్ల మండల వ్యాప్తంగా ఉన్నటువంటి అధికారులకు పౌరులకు సిబ్బందికి ఉన్నత అధికారులకు 80వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. భారత జాతి స్వేచ్ఛ స్వాతంత్రం కోసం ఎందరో మహానుభావులు తమ ఆస్తులను కుటుంబాలను కోల్పోవడమే కాకుండా ప్రాణాలను సైతం త్యాగం చేశారన్నారు. ఆమహనీయుల త్యాగ ఫలితాన్ని స్మరించుకుంటూ జరుపుకునే 80 స్వతంత్ర దినోత్సవాన్ని ప్రతి ఒక్కరు పండగల జరుపుకోవడం దేశభక్తికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర సమరయోధులత్యాగధనుల పుణ్యఫలమే స్వాతంత్ర్యం దినోత్సవ ... తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్



**జూపాడు బంగ్లా ఆగస్టు 15( నంది పత్రిక )** ఎందరో మహానుభావుల త్యాగ ఫలితంగా భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించుకున్నాం తాహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్ పేర్కొన్నారు. శనివారం జూపాడుబంగ్లా లో 80 వ స్వాతంత్ర్య దినోత్సవాలను ఘనముగా నిర్వహించారు . తహసిల్దార్ కార్యాలయం లో తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్ జెండాను ఎగరవేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మిద్దె నీలమ్మ , పోలీస్ స్టేషన్లో లో ఎస్ఐ,కే. మల్లికార్జున, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, వెలుగు కార్యాలయంలో 80 బన్నూరు సొసైటీలో చైర్మన్ పిక్కిరి శ్రీనివాసులు జాతీయ జెండాను ఎగురవేశారు. జాతీయ జెండాలను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్ మాట్లాడుతూ బ్రిటిష్ దొరల పాలనలో భారతదేశం బానిస సంకెళ్ళ లో చిక్కుకొని పోయిన తరుణంలో స్వాతంత్ర్యాన్ని కాంక్షిస్తూ బహుజనులు ఉద్యమానికి బాసటగా నిలిచారు. తెల్లదొరలను పారద్రోలుటకు మహాత్మా గాంధీ ఇచ్చిన ఉప్పుసత్యాగ్రహం మరియు శాంతి పోరాటాలకు మహాత్మాగాంధీ వెంట ఉండి బ్రిటిష్ వారి దురాగతాలను ఆరి కట్టారు. లాఠీ దెబ్బలు తిని భరించి తుపాకుల తూటాలకు ఎదురొడ్డి ఎంతో సహనం ఓపికతో భారతావని పట్ల జాతి భావంతో ముందుకు సాగిన ఘనత బహుజనులకు దక్కుతుందన్నారు. మన్యం వాసుల అల్లూరి సీతారామరాజు వెంట ఉండి ఎన్నో అరాచకాలకు ప్రాణాలు కోల్పోయి భార్య బిడ్డలు అనాధలైన స్వాతంత్ర్యం తమ జన్మహక్కు అని అల్లూరి సీతారామరాజు వెంట ఉండి అతివాదం పోరాటానికి బాసటగా నిలిచిన మాన్యం వాసులు బహుజనలే అజిత్ సింగ్ గణపతి ,నేతాజీ ,సైన్యంలో చేరి తెల్లదొరల పాలనను అంతమొందించడానికి నడుంబిగించి నేతాజీ సైన్యంలో చేరి కుటుంబాలు సైతం త్యాగాలు చేసి భారతమాత సంకెళ్లను తెంచి తెల్లదొరలను పారదూలి భారతదేశానికి స్వాతంత్రాన్ని తెచ్చి పెట్టారు. నిరంతరం పోరాడి త్రివర్ణ పథకం ఢిల్లీ కోట పై ఎగురవేయ బడటానికి బహుజనుల త్యాగాలు ఎన్నో మరణాలు కుటుంబ ఆవేదనలో భార్య పిల్లలను అర్త నాదాలు ఎన్నో ఈ దేశానికి స్వాతంత్రం అందించడంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని దేశ అభివృద్ధికి ఒక బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగ ఫలితంగానే మనకు స్వేచ్ఛ లభించిందని పేర్కొన్నారు. మండలంలోని గ్రామ సచివాలయం దగ్గర పంచాయతీ సెక్రెటరీలు జాతీయ జెండాను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దారులు సత్యదీప్, ఎన్. నాగన్న, వీఆర్వోలు, రెవిన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది వెలుగు సిబ్బంది, విద్యార్థి విద్యార్థినీలు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవం వేళ ఐరన్ క్లబ్ యువత రక్తదానం

**35 మంది యువకుల రక్తదానం.. సామాజిక బాధ్యత చాటుకున్న యువత**




**వెలుగోడు, ఆగస్టు 15 (నంది పత్రిక):** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వెలుగోడు పోస్ట్ఆఫీస్ సమీపంలోని ఐరన్ క్లబ్ ఫిట్నెస్ జిమ్ ఆవరణలో శనివారం భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. జిమ్ ట్రైనర్ సాదిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో జిమ్‌కు చెందిన 35 మంది యువకులు ఉత్సాహంగా రక్తదానం చేసి దేశభక్తితో పాటు సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు గన్ని కరీం, ఇలియాస్ ఖాన్, షంషీర్, మాట్లాడుతూ రక్తదానం ఎంతో విలువైన సేవా కార్యక్రమమని, అత్యవసర సమయంలో రక్తం అందించి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. యువత ఆరోగ్యంపై శ్రద్ధ చూపడంతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ ముందుండాలని పిలుపునిచ్చారు. నిర్వాహకులు ఐరన్ క్లబ్ ఫిట్నెస్ ట్రైనర్ సాదిక్ మాట్లాడుతూ "ఆరోగ్యకరమైన శరీరంతో పాటు పరోపకార గుణం కలిగి ఉండడమే అసలైన ఫిట్‌నెస్" అని పేర్కొన్నారు. రక్తదానం వల్ల ఇతరులకు ప్రాణదానం చేసిన వారవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఖాజా బాబా, గులాం, రాము, జన్నత్ ఖాన్, తెలుగు రమణ, టీచర్ రఫీ, ఫయాజ్, రాజేష్, కొడవత్ శంకర్ నాయక్,వలి, జిమ్ సభ్యులు, స్థానిక యువకులు పాల్గొన్నారు. యువత చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు అభినందించారు.

## పలు స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొన్న సొసైటీ చైర్మన్ కొండమడుగుల.



**శిరివెళ్ల (నంది పత్రిక) :** సిరివెళ్ల మండల పరిధిలోని వీరారెడ్డిపల్లె గ్రామంలో గల జిల్లా పరిషత్ హై స్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం మరియు మండల కేంద్రంలోని శిరివెళ్ల మేజర్ గ్రామపంచాయతీలో గల ప్రాథమిక వ్యవసాయ రైతు సేవా సహకార సంఘ సొసైటీలో జరిగినటువంటి 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో టిడిపి నేత శిరివెళ్ల సొసైటీ చైర్మన్ కొండమడుగుల శ్రీనివాసరెడ్డి విరివిగా పాల్గొన్నారు. సొసైటీ సీఈవో మహబూబ్ బేగ్ ఆధ్వర్యంలో చైర్మన్ కొండమడుగుల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థలు అంగన్వాడీ కేంద్రాలు సహకార సంఘ సొసైటీ లలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి కొండ మాడుగుల నివాళులు అర్పించారు. అనంతరం త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా చైర్మన్ కొండమడుగుల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ భరతమాత మట్టిలో మన పూర్వీకుల త్యాగాల పరిమళం ఉందని ఆ పరిమళాన్ని సగర్వంగా కాపాడుకోవడం మన బాధ్యత అని అన్నారు. భారతదేశం ఒక భూభాగం నేల మాత్రమే కాదని కోట్లాది హృదయాలను కలిపే ఒక మహోత్తర పుడమి తల్లి అని అన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వాలే కాదు ప్రతి పౌరుడు ఆలోచన ఆచరణ కూడా అవసరం అన్నారు భరతమాత మట్టి మనకు జన్మనిచ్చిందని ఈ దేశం మనకు గుర్తింపునిచ్చిందని అందుకే భరతమాతకు ప్రతి పౌరుడు రుణపడి ఉండాల న్నారు. జిల్లా పరిషత్ హై స్కూల్ లో పలు క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రాథమిక పాఠశాలలో సైతం విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించి స్వాతంత్ర దినోత్సవం మరియు దేశభక్తి యొక్క ఆవశ్యకత గురించి వివరించారు. అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులకు చైర్మన్ కొండ మడుగుల శ్రీనివాసరెడ్డి స్వాతంత్ర వేడుకల తీపి జ్ఞాపకంగా వారికి స్వీట్లు పంచి అభినందించారు. ఈ కార్యక్రమాలలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అంగన్వాడీ టీచర్ ఆయాలు సొసైటీ సిబ్బంది రైతులు విద్యార్థులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



## మహిళలు ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదిగి మరికొందరికి ఉపాధి కల్పించాలి

## నంద్యాల పురపాలక పరిధిలో ప్రజలకు స్వచ్ఛమైన నీరు, గాలి, ఆహారం అందించాలి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, ఆగస్టు 15(నంది పత్రిక):–** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం నాటి తరం చేసిన త్యాగాలు, పోరాటాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్య, ఉపాధి, పారిశ్రామిక, సాంకేతిక తదితర అన్ని రంగాల్లో ప్రతిభను చాటుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రస్తుత సంవత్సరం ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు, ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. వ్యవసాయం, తాగునీటి సరఫరా వంటి అంశాల్లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ తెలిపారు. "ఒక కుటుంబంలో ఒక వ్యవస్థాపకుడు– ఒన్ ఫ్యామిలీ ఒన్ ఇంట్రెప్రెనేర్ " అనే లక్ష్యంతో మహిళలను స్వయం ఉపాధి, జీవనోపాధి కార్యక్రమాల ద్వారా ఎంటర్‌ప్రెన్యూర్లుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడంతో పాటు మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తద్వారా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు అభివృద్ధి చెంది కుటుంబ ఆదాయం, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. నంద్యాల పురపాలక పరిధిలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన గాలి, నాణ్యమైన ఆహారం, ఆహ్లాదకరమైన వాతావరణం అందేలా అధికారులు నిరంతరం కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. పారిశుద్ధ్యం, పచ్చదనం, ప్రజారోగ్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలన్నారు. ప్రజల్లో మున్సిపాలిటీపై విశ్వాసం, సానుకూల దృక్పథం పెంపొందించేలా అధికారులు సేవా భావంతో పనిచేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. నిరుపేదలు, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పారదర్శకంగా అందించడంతో పాటు, ప్రజల సమస్యల పరిష్కారంలో సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. రైతులకు సమృద్ధిగా పంటలు పండి, వ్యవసాయం అభివృద్ధి చెందాలని, నంద్యాల జిల్లా అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తూ అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



# ఉత్తమ సేవలకు అత్యుత్తమ పురస్కారం.

## శిరివెళ్ల తహసిల్దార్ ఐ విజయశ్రీ గారికి ఉత్తమ తహసిల్దారుగా ప్రశంసా పత్రం అందజేసిన రాష్ట్ర మంత్రి వర్యులు,జిల్లాకలెక్టర్



**శిరివెళ్ల :(నంది పత్రిక)** నంద్యాల జిల్లా కేంద్రంలో జరిగినటువంటి 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శిరివెళ్ల మండల తహసిల్దార్ ఐ.విజయశ్రీ గారు ఉత్తమ తహసిల్దారుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మరియు నంద్యాల జిల్లా మెజిస్ట్రేట్ అండ్ జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా చేతులమీదుగా ఉత్తమ అవార్డు ప్రశంసా పత్రం అందుకున్నారు. శిరివెళ్ళ మండలంలో విశిష్ట సేవలు అందించిన ఉత్తమ తహసిల్దారుగా జిల్లా అధికారులు గుర్తించివిధి నిర్వహణలో చూపించిన నీతి నిజాయితీ నిబద్ధత మరియు ఉన్నతాధికారుల ఆదేశాలు ప్రభుత్వం ఆదేశించే పలు సర్వేలు సకాలంలో పూర్తి చేయడం అర్జీదారులకు సత్వర న్యాయం చేసే విధంగా స్పందించడం వంటి మంచి పేరు అనతి కాలంలోనే లభించడం వంటి ఉత్తమ సేవలను ప్రభుత్వం గుర్తించింది. తాసిల్దార్ అంకిత భావానికి గుర్తింపుగా శనివారం రాష్ట్రమంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ,ఎస్పీ సునిల్ షరాణ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు,రెవెన్యూ శాఖ అధికారులు వీఆర్వో లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు..

# టీడీపీ కార్యాలయంలో పతాకావిష్కరణ ఆలస్యం నేతల నిర్లక్ష్యంపై కార్యకర్తల తీవ్ర ఆగ్రహం !





**నందిపత్రిక –ప్యాపిలి** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్యాపిలిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద విచిత్రమైన వాతావరణం నెలకొంది. సమయానికి జాతీయ జెండాను ఎగురవేయడంలో నాయకులు చూపిన నిర్లక్ష్యంపై స్థానిక పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఉదయం 11:28 గంటలు దాటినా జాతీయ జెండా ఎగురవేయకపోవడం చర్చనీయాంశంగా మారింది.

**వాట్సాప్ ప్రచారం కోసమేనా జెండా?** సాధారణంగా ఉదయమే గౌరవప్రదంగా జాతీయ జెండాను ఆవిష్కరించాల్సి ఉండగా, ప్యాపిలి టీడీపీ కార్యాలయం వద్ద ఆలస్యంగా జెండా ఎగురవేశారు. జెండా ఎగురవేసిన అనంతరం పలువురు నాయకులు జెండా ముందు ఫొటోలు దిగి, ఆ ఫొటోలను వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయడానికి చూపించిన ఉత్సాహం.. సరైన సమయానికి పతాకావిష్కరణ చేయడంలో చూపించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "ఇది వాట్సాప్ ఫొటోల కోసమే చేసిన ఆర్భాటమా?" అని శ్రేణులు మండిపడుతున్నాయి.

**నాయకుల మధ్య సఖ్యత లేకపోవడమే కారణం** పార్టీ స్థానిక నాయకుల మధ్య సరైన సమన్వయం, సఖ్యత లేకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని తెలుస్తోంది. వర్గపోరు, సమన్వయ లోపం కారణంగా జాతీయ పండుగ రోజున కూడా పతాకావిష్కరణ తీవ్ర ఆలస్యమైందని, ఇలాంటి ఘటనలు పార్టీకి చెడ్డపేరు తెస్తున్నాయని నిజాయితీ గల కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇది దేశభక్తా లేక లౌకికమా?** సమయానికి జెండా ఎగురవేయకపోవడంపై స్థానిక టీడీపీ శ్రేణుల్లోనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ పతాకం విషయంలో ఇంతటి నిర్లక్ష్యం తగదని,ఇది నిజమైన దేశభక్తా లేక కేవలం లౌకిక ప్రదర్శనా?" అని ప్రశ్నిస్తున్నారు.

**పార్టీ ప్రతిష్టకు దెబ్బ** జాతీయ జెండా ఆవిష్కరణ విషయంలో జరిగిన ఆలస్యం పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉందని నాయకులు, కార్యకర్తలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు తమ వైఖరిని మార్చుకుని, జాతీయ పతాకం పండుగల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే స్వాతంత్ర్య స్ఫూర్తికి నిజమైన ప్రతిరూపం

## ప్రభుత్వ ఉద్యోగులపై ప్రజాసేవలో మరింత బాధ్యత ఉంది

## జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్

**నంద్యాల బ్యూరో, ఆగస్టు 15(నంది పత్రిక):–** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నంద్యాల కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలన నుంచి భారతదేశానికి అధికార బదలాయింపు జరిగి, దేశం స్వాతంత్ర్యం పొందిన చారిత్రక దినం ఆగస్టు 15 అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, వారు దేశ స్వేచ్ఛ కోసం చేసిన పోరాటాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు చేసిన త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాతావరణంలో జీవిస్తున్నామని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రజలు తమ అవసరాలు, సమస్యల పరిష్కారం, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రభుత్వంపై, ప్రభుత్వ ఉద్యోగులపై గణనీయంగా ఆధారపడుతున్నారని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా, పారదర్శకంగా, సకాలంలో అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉందన్నారు. దేశం, రాష్ట్రం అభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగులు తమ వంతు బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం కేవలం వేడుకలకు మాత్రమే పరిమితం కాకుండా, మన బాధ్యతలను మననం చేసుకునే సందర్భంగా భావించాలని ఆయన అన్నారు. ప్రభుత్వ వ్యవస్థలో, సమాజంలో ఉన్న లోపాలను నిరంతరం అధిగమిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించగలగడమే స్వాతంత్ర్య స్ఫూర్తికి నిజమైన అర్థమని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, సుపరిపాలన, పారదర్శకత, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేస్తూ జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మరింత అంకితభావంతో పనిచేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు.



# దళితులకు దరి చేరని స్వాతంత్ర్య ఫలాలు : కెవిపిఎస్



**కొత్తపల్లి – నంది పత్రిక :** దేశానికి స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాల అవుతున్న స్వాతంత్ర ఫలాలు నేటికీ దళితుల దరిచేరడం లేదని వాటిని సాధించేందుకు మరో పోరాటానికి సిద్ధం కావాలని కెవిపిఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు వి యేసురత్నం జిల్లా నాయకులు ఎన్ సంపత్ పాతకోట భాస్కర్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు పిలుపునిచ్చారు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ( కెవిపిఎస్ ) ఆధ్వర్యంలో మండలంలోని సింగరాజుపల్లి నందికుంట గ్రామాల్లోని దళిత కాలనీలలో 80 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగరవేయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుండి దేశానికి స్వాతంత్రం సాధించేందుకు ఎందరో మహనీయులు త్యాగాలు చేసిన ఫలితంగా 1947 ఆగస్టు 15న మన దేశానికి స్వాతంత్రం సాధించుకున్నాం స్వాతంత్ర్య అనంతరం దేశంలోని ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, ఉపాధి అవకాశాలు సమానంగా ఉండాలని భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకున్నాం 80 సంవత్సరాలు పూర్తయిన నేటికీ దళితులకు సమాన అవకాశాలు దక్కలేదు అని అన్నారు. నేటికీ అంటరానితనం,నిరుద్యోగం, ఉపాధి లేమి, రైతు ఆత్మహత్యలు, కొనసాగుతున్నాయి కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం, అమెరికా సామ్రాజ్యవాదానికి కీలుబొమ్మగా మారి రైతులు కార్మికులు వ్యవసాయ కూలీలు ఉద్యోగుల హక్కులను కాల రాస్తుందన్నారు, దళిత కాలనీలలో నేటికీ విద్యుత్తు, మంచినీళ్లు, రోడ్లు, డ్రైనేజీ కాలువలు తదితర మౌలిక సదుపాయాలు లేవు, క్రైస్తవుల అనే పేరుతో దళితుల రిజర్వేషన్లను ధ్వంసం చేస్తూ సామాజిక న్యాయానికి పాలకులు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు అందుకే కులవ్యక్ష వ్యతిరేక పోరాట సంఘం సామాజిక శంఖారావం పేరుతో స్వాతంత్ర ఫలాలు సాధన కోసం సామాజిక న్యాయం కోసం నిర్వహించే పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కమతం రామకృష్ణ స్వాములు లక్ష్మ ణ్ వజ్రమ్మ శ్రీదేవి దేవకుమార్ మార్కు జయరాజు రవి సర్దార్ తదితరులు పాల్గొన్నారు

# రుద్రవరం మండలంలో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా



**రుద్రవరం ప్రతినిధి ఆగస్టు 15 (నంది పత్రిక):** 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని రుద్రవరం మండలంలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక తహాశీల్దార్ కార్యాలయం లో డిప్యూటీ తహాశీల్దార్ చంద్రశేఖరయ్య, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మబ్బు బాలస్వామి, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై జయప్ప, పశు వైద్యశాలలో ఏడి మనోరంజన ప్రతాప్, అటవీశాఖ కార్యాలయంలో రేంజ్ అధికారి ముర్తుజావలి, విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏఈ రాజశేఖర్, వ్యవసాయ కార్యాలయం వద్ద ఏవో సుమతి, ఎంఈఓ కార్యాలయం వద్ద ఎంఈఓ లు, ఉపాధి, వెలుగు, రుద్రవరం గ్రామపంచాయతీ స్వర్ణ గ్రామం కార్యాలయాలతోపాటు మండలంలోని స్వర్ణ గ్రామం కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా పాఠశాల, జిల్లా పరిషత్తు పాఠశాల తోపాటు మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలలో మువ్వన్నెల జెండాను అధికారులు ఉపాధ్యాయులు ఎగురవేశారు. ప్రతి ఒక్కరూ దేశభక్తితో భారత రాజ్యాంగ స్ఫూర్తితో ఐకమత్యంగా ముందుకు సాగాలని స్వాతంత్ర దినోత్సవానికి సంబంధించిన పలు అంశాలపై వక్తలు మాట్లాడారు. పాఠశాలలలో సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులతో నిర్వహించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రధాన చేశారు. ఈ కార్యక్రమాలలో ఆయా శాఖల అధికారులు సిబ్బంది ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న అధికారులు







**మహానంది, ఆగస్టు 15 (నంది పత్రిక):–** మహానంది మండలంలో అధికారుల సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తమ అధికారులుగా ప్రశంస పత్రాలను అందజేసింది. శనివారం నంద్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా మహానంది ఎస్ఐఎన్ రామ్మోహన్ రెడ్డి, దేవస్థానం ఈవో ఎన్. శ్రీనివాస రెడ్డి, ఏఈవో మధులు రాష్ట్ర మంత్రి ఎన్ ఎం.డి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ షోరాణ్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పత్రాలు అందుకున్నారు. వారు మాట్లాడుతూ ఉత్తమ సేవా అవార్డు అందుకోవడంతో మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. వీరిని మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

# కృష్ణా నదిలో మునిగి ముగ్గురు యువకుల మృతి

విజయవాడలో శనివారం సాయంత్రం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కృష్ణా నదిలో సరదాగా ఈతకు వెళ్లిన ముగ్గురు యువకులు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదం కృష్ణలంక మెట్ల బజారు సమీపంలోని పద్మావతి ఘాట్ వద్ద సంభవించింది. వివరాల్లోకి వెళితే.. ముగ్గురు యువకులు పద్మావతి ఘాట్ వద్ద నదిలో ఈత కొట్టేందుకు నీటిలోకి దిగారు. అయితే, ప్రవాహ వేగాన్ని, నీటి లోతును అంచనా వేయలేక వారు గల్లంతయ్యారు. స్థానికుల సమాచారంతో పోలీసులు, విపత్తు నిర్వహణ సిబ్బంది తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికే గాలింపు బృందాలు ముగ్గురి మృతదేహాలను వెలికి తీశాయి. మృతులను గడ్డం జాషువా (17), వీసం గౌతమ్ (18), తిగుళ్ల తేజ (18)గా గుర్తించారు. మృతులంతా తక్కువ వయసు వారే కావడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# అత్యవసరంలో ఉన్న వారికి ఉచిత ఆటో సర్వీస్



**కొత్తపల్లి – నంది పత్రిక :** మండలంలోని ముసలిమడుగు గ్రామ ప్రజలకు గ్రామ యువకుడు ఎం ఎం జి అబ్దుల్లా యూట్యూబర్ ఆధ్వర్యంలో అత్యవసరంలో ఉన్న వారికి ఉచిత ఆటో సర్వీసును ఎస్సై జయ శేఖర్ ,గ్రామ పెద్దలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మారుమూల ప్రాంతంలోని ఓ యువకుడు తాను పుట్టిన గ్రామానికి సేవ చేయాలన్న ఆలోచనతో ఉచిత ఆటో సర్వీస్ ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. గ్రామంలో కుల మతాలకతీతంగా ఎవరికైనా సరే అత్యవసర వైద్య సమయాల్లో రవాణా సదుపాయం లేక ఎవరూ ఇబ్బంది పడకూడదనే మంచి ఉద్దేశ్యంతో ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. మన గ్రామం మన ఆరోగ్యం మన బాధ్యత అన్న సంకల్పంతో ముందుకు వచ్చి గ్రామస్తులకు సేవ చేయాలన్న ఆలోచన మంచిదన్నారు. అనంతరం ఎం ఎం జి అబ్దుల్లా యూట్యూబర్ మాట్లాడుతూ గ్రామంలోని గర్భిణీ మహిళలు, గుండెపోటు తో బాధపడే వారికి, పాము కాటు గురైన వారికి, పురుగుల మందు తాగిన వారు, పలు ప్రమాదాలకు గురైన వారికి గ్రామంలోని మూడు ఆటోలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయన్నారు. ఎవరికి ఆపద వచ్చిన అత్యవసర పరిస్థితి అయినా తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. తాను పుట్టి పెరిగిన గ్రామానికి సేవ చేయడమే లక్ష్యంగా ఉన్నానన్నారు. పేద విద్యార్థుల విద్యకు ప్రోత్సహించేందుకు తాను ముందుంటానన్నారు. గ్రామ పెద్దలు యువకులు అందరూ తనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# నందికొట్కూరులో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.





**నందికొట్కూరు ఆగస్టు 15( నంది పత్రిక)** నందికొట్కూరు పట్టణంలో మున్సిపల్ కార్యాలయం నందు కమిషనర్ జి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య హాజరయ్యారు. ముందుగా భారత జాతీయ పతాకమును ఎగరవేసిన గౌరవ వందనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ ఎందరో మహానుబావుల త్యాగాల ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందన్నారు. దేశానికి త్యాగమూర్తుల చేసిన సేవలు, త్యాగాలు మరువలేనివన్నారు. దేశ స్వాతంత్ర పోరాటంలో ఎందరో మహనీయులు ప్రాణాలు త్యాగాలు చేశారని, తెల్ల దొరల పాలనలో బంధీగా ఉన్న భరతమాతను విముక్తి చేయడంలో జాతిపిత మహాత్మా గాంధీ చేసిన పోరాటం ప్రత్యేకమైనది అన్నారు. స్వాతంత్రానంతరం మన దేశాన్ని మనమే పరిపాలించుకునే విధంగా దేశానికి ఆదర్శవంతమైన రాజ్యాంగాన్ని రక్షించి పౌరులకు స్వేచ్ఛ సమానత్వం, హక్కులు కల్పించి సార్వభౌమ, సర్వసత్తాక, స్వామ్యవాద ప్రజాస్వామ్య దేశంగా విరజిల్లడంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యొక్క కృషి ఫలితమే అన్నారు. దేశ స్వాతంత్రానికి ఎంతోమంది ప్రాణాలు అర్పించారని, వారు త్యాగాలు వృధా కానివ్వరాదని దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ పాల్పంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మున్సిపల్ శాఖలో పనిచేసే సిబ్బందిని మరియు మెప్మా శాఖలో ఉత్తమ సేవలు అందించిన మహిళ ఉద్యోగులకు ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సిఐ అశోక్ కుమార్, ఎస్సై చంద్రశేఖర్, టిడిపి నాయకులు భాస్కర్ రెడ్డి,లాయర్ జాకీర్ హుస్సేన్, షకీల్ అహ్మద్, నిమ్మకాయల మోహన్, సౌదీ చాంద్ భాషా, కళాకర్, పాతకోట రమేష్, నిమ్మకాయల రాజు,కాటేపోగు నాగ సురేష్, ప్రేమ్ కుమార్, మహిళా నాయకురాలు డాక్టర్ వనజ, మీనాక్షి, మున్సిపల్ శాఖ అధికారులు మేనేజర్ స్నేహలత, టీ పి ఓ రంగస్వామి,ఏఈ దినేష్ కుమార్, టిడిపి నాయకులు భరత్ రెడ్డి, ఆచారి,చిన్న వంశీ మరియు మున్సిపల్ సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ కేసులతో భయపెట్టలేరు:

## కూటమి సర్కార్‌పై కాటసాని రామభూపాల్ రెడ్డి ధ్వజం

**జగన్ పర్యటనకు పోటెత్తిన ప్రజాదరణ చూసి వణుకు**

**పోలీసులను అడ్డం పెట్టుకుని నిరంకుశ పాలన**

**ప్రజల పక్షాన ఎంతటి న్యాయపోరాటానికైనా సిద్ధం: పాణ్యం మాజీ ఎమ్మెల్యే హెచ్చరిక**




**నంది పత్రిక కర్నూలు ప్రతినిధి** వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లా పర్యటనకు వెల్లువెత్తిన అపూర్వ ప్రజాదరణను చూసి ఓర్వలేకనే కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తనపై తప్పుడు కేసులు నమోదు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ... తమ ప్రియతమ నేత జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు ప్రజలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పోటెత్తారని పేర్కొన్నారు. అయితే, తట్టుకోలేని కూటమి ప్రభుత్వం జనం సమీకరణ చేశారంటూ 189(2), 126(2) దీటీా వంటి సెక్షన్ల కింద ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమ కేసులు బనాయించడం వారి నిరంకుశ వైఖరికి పరాకాష్ట అని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి కూటమి పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గాలికొదిలేయడంతో ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత మొదలైందని, జగనన్నతోనే పేదలకు మేలు జరుగుతుందన్న బలమైన నమ్మకంతోనే ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని స్పష్టం చేశారు. "పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని అక్రమ కేసులు పెడితే భయపడే ప్రసక్తే లేదు. ప్రజల పక్షాన నిలబడి ఎంతటి న్యాయపోరాటానికైనా సిద్ధం. చట్టపరంగా కూటమి ప్రభుత్వ దమననీతిని ఎదుర్కొంటాం" అని కాటసాని స్పష్టం చేశారు.

# పశువైద్యుడికి ఉత్తమ సేవా పురస్కారం

## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఏడీఏ డాక్టర్ మనోరంజన్ ప్రతాప్‌కు ప్రశంసాపత్రం



**రుద్రవరం ప్రతినిధి ఆగస్టు 15 (నంది పత్రిక):** పశు వైద్య రంగంలో మూగజీవాలకు అందిస్తున్న విశేష సేవలకు గాను రుద్రవరం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు (ఏడీఏ) డాక్టర్ మనోరంజన్ ప్రతాప్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఆయన చేసిన ఉత్తమ సేవలను ప్రభుత్వం గుర్తించి, ఉత్తమ అధికారిగా ఎంపిక చేసి ప్రశంసా పత్రాన్ని అందజేసింది. మూగజీవాలపై తనదైన ప్రేమ, అభిమానాలతో ఆయన అందించిన వైద్య సేవలు, స్థానికంగా పశువుల అభివృద్ధికి ఆయన పడిన శ్రమకు గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది. నంద్యాల జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో.. జిల్లా కలెక్టర్ మరియు రాష్ట్ర మంత్రి చేతుల మీదుగా డాక్టర్ మనోరంజన్ ప్రతాప్ ఈ ప్రశంసా పత్రాన్ని సగర్వంగా అందుకున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రశంసా పత్రాన్ని అందుకున్న శుభ సందర్భంగా డాక్టర్ మనోరంజన్ ప్రతాప్‌ను పలువురు పశుసంవర్ధక శాఖ అధికారులు, స్థానిక రైతులు, మరియు ప్రజాప్రతినిధులు అభినందించారు. మూగజీవాల పట్ల ఆయన చూపుతున్న శ్రద్ధను ఈ సందర్భంగా వారు కొనియాడారు.

# 'రాజా టీ ప్యాలెస్ 'ను ప్రారంభించిన ఎస్సై సురేష్.

**నందికొట్కూరు ఆగస్టు 15( నంది దినపత్రిక)** నందికొట్కూరు పట్టణంలోని జీవన్ జ్యోతి స్కూల్ సర్కిల్ నందు నూతనంగా ఏర్పాటుచేసిన రాజ టీ ప్యాలెస్ ను నిర్వాహకులు ఆహ్వానం మేరకు పట్టణ ఎస్సై సురేష్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమం అనంతరం ఎస్సై సురేష్ మాట్లాడుతూ నేటి యువత స్వయం ఉపాధి వైపు పయనించడం ఎంతో శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల జిల్లా అధ్యక్షుడు బి శ్రీనివాసులు, మరియు రాజా టీ ప్యాలెస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం: కమ్మరి పార్వతమ్మ

**సదాశివనగర్‌లో ఘనంగా '2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం' ప్రచారం**

**ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసిన ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్**



**నంది పత్రిక కర్నూలు ప్రతినిధి** రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ అన్నారు. శనివారం కల్లూరు మండలం 37వ వార్డు పరిధిలోని సదాశివనగర్ వెంకటేశ్వర స్వామి ఆలయ వీధిలో '2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలు, అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను స్థానిక ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తున్నామని స్పష్టం చేశారు. స్థానికంగా ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని తక్షణమే పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 37వ వార్డు ఇన్‌ఛార్జ్ సుతారు రాఘవేంద్ర, క్లస్టర్ కో-కన్వీనర్ కాసాని మహేష్ గౌడ్, యూనిట్ ఇన్‌ఛార్జ్ ఖాదర్ వలి, బూత్ ఇన్‌ఛార్జ్‌లు బాలకృష్ణ, సుబ్బరాయుడు, తలారి శివ, అన్వర్, అనిల్, బుజ్జితో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రుద్రవరం కానిస్టేబుల్ వీరాంజనేయులుకు జిల్లా స్థాయి విశిష్ట ప్రశంసా పత్రం



**రుద్రవరం ప్రతినిధి ఆగస్టు 15 (నంది పత్రిక):** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా విధి నిర్వహణలో అసాధారణ ప్రతిభ కనబరిచిన రుద్రవరం పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ పి. వీరాంజనేయులు జిల్లా స్థాయి విశిష్ట ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఆగస్టు 15న ఘనంగా జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ మరియు జిల్లా ఎస్పీ సునీల్ షరాన్ చేతుల మీదుగా ఆయన ఈ సత్కారాన్ని స్వీకరించారు. పోలీస్ శాఖలో ఆయన చూపిన అంకితభావం, క్రమశిక్షణ మరియు ప్రజలకు అందించిన అత్యుత్తమ సేవలను గుర్తించి ఉన్నతాధికారులు ఈ ప్రతిష్టాత్మక గౌరవానికి ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ సేవా పురస్కారం సాధించిన పీసీ వీరాంజనేయులును రుద్రవరం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జయప్ప మరియు తోటి పోలీస్ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ.. "శ్రీ వీరాంజనేయులు సాధించిన ఈ గుర్తింపు రుద్రవరం పోలీస్ స్టేషన్ సిబ్బంది అందరికీ ఎంతో స్ఫూర్తిదాయకం" అని కొనియాడారు.

# శ్రీశైలందేవస్థానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**శ్రీశైలం ఆగస్టు 15 (నంది పత్రిక)**దేవస్థానంలో (15.08.2026) 80వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ యం.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, పలువురు శాఖాధిపతులు, విభాగాధిపతులు, సిబ్బంది, శివసేవకులు, ఎస్.పి.ఎఫ్ సిబ్బంది, హోంగార్డు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థాన పరిపాలనా కార్యాలయభవన ప్రాంగణంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ముందుగా ఆలయసంప్రదాయాన్ని అనుసరించి మహాగణపతిపూజ జరిపించ బడింది. తరువాత జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల అర్పించబడింది. అనంతరం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది, హోంగార్డు సిబ్బంది, పతాకవందనం చేశారు. తరువాత ధర్మకర్తల మండలి అధ్యక్షులు జాతీయపతాకావిష్కరణ చేశారు. అనంతరం జాతీయగీతం ఆలాపించబడింది. తరువాత కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆధ్యాత్మికతకు జాతీయభావాలను జోడించి దేవస్థానంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. దేవస్థానం అభివృద్ధిలో ఉద్యోగులే ఎంతో కీలకపాత్రవహిస్తారన్నారు. అందుకే ఈ సంవత్సరం అంకితభావంతో విశిష్ట సేవలు అందిస్తున్న కొందరు ఉద్యోగులకు ఉత్తమ ఉద్యోగి పురస్కారంతో సత్కరించడం జరిగిందన్నారు. పురస్కారం పొందిన వారికి ప్రశంసా పత్రం, శేషవస్త్రం, ప్రసాదాలు అందజేయడం జరిగిందన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు గత జనవరి 26వ తేదీన నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలలో దేవస్థానం ధర్మపథ శకటంతో దేవస్థానం శకటాన్ని ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈ రోజు జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో కూడా దేవస్థానం ధర్మప్రచారంతో పాటు శకటాన్ని ప్రదర్శించడం జరుగుతోందన్నారు. అనంతరం ధర్మకర్తల మండలి అధ్యక్షులు మాట్లాడుతూ ఎందరో దేశభక్తుల, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా లభించిన స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను మనం అనుభవిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలను వివరించారు. స్వాతంత్ర్యం సాధింపజేసిన మహనీయులను మనం స్మరించుకోవాలన్నారు. ధర్మకర్తల మండలి అధ్యక్షులు గత సంవత్సరకాలంలో దేవస్థానం సాధించిన ప్రగతిని కూడా నివేదిక రూపంలో వివరించారు. క్షేత్రాన్ని దర్శించే భక్తుల సంఖ్య రోజురోజుకు అధికమవుతోందని, భక్తులరద్దీకనుగుణంగా ఆయా సౌకర్యాలు కల్పించాల్సి అవసరం ఉందన్నారు. భక్తులరద్దీకనుగుణంగా ఆయా సౌకర్యాల కల్పనకు దేవస్థానం తగు చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. ఒకవైపు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతో పాటు, క్షేత్రాన్ని అధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మరిన్ని చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. క్షేత్రాభివృద్ధి అనేది నిరంతరం జరిగే ప్రక్రియ అని పేర్కొన్నారు. సిబ్బంది అందరు కూడా క్షేత్రాభివృద్ధిలో తమవంతు పాత్రను పోషించాలన్నారు. కాగా కార్యక్రమంలో భాగంగా పతావిష్కరణ తరువాత కుమారి లిక్షితశ్రీ, లిక్షితాశ్రీ నృత్య కళాశాల, నందికొట్కూరు మరియు వారి బృందంచే దేశభక్తి గేయాలకు సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమములో చివరగా పురస్కారానికి ఎంపికచేయబడిన దేవస్థానం ఉద్యోగులకు ఉత్తమ ఉద్యోగి పురస్కారాన్ని అందజేశారు. మొత్తం 66 మంది ఉద్యోగులకు పురస్కారాలు అందజేయబడ్డాయి. పలువురు శాశ్వత, ఒప్పంద, పొరుగుసేవల సిబ్బంది ఈ పురస్కారాలు పొందినవారిలో ఉన్నారు.



# మహానంది మండలంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య వేడుకలు



**మహానంది ఆగస్టు 15 (నంది పత్రిక):-** మహానంది మండలంలో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు,పాఠశాలలో త్రివర్ణ పతాకం రెపరెపలా డింది. మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని తహ శీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పి.రమాదేవి,పోలీసు స్టేషన్ నందు ఎస్ ఐ ఎన్.రామ్మోహన్ రెడ్డి, మహానంది దేవస్థానం నందు ఈవో శ్రీనివాస్ రెడ్డి, చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎంపీడీవో కార్యాలయంలో టి.ఎస్.ఎస్ శ్రీనివాస్ శర్మ,మరియు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రవేట్ కార్యాలయాలు,పాఠశాలల్లో మువ్వెన్నెల జాతీయ జెండాను ఎగురవేశారు.పలువురు వక్తలు స్వాతంత్ర్య సమరయోధుల సేవలను కొనియాడారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థులు వేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

# ప్యాపిలి గ్రామ పంచాయతీలో గ్రామసభ ప్రజల, రైతుల నీటి సమస్యల పరిష్కారానికి శ్రీకారం !



**నందిపత్రిక -ప్యాపిలి** ప్యాపిలి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామసభ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సమావేశానికి మాజి డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా నారాయణమూర్తి, జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కాజాపీర్ అంకిరెడ్డి,డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్,ఈవో నాగేశ్వరరావు,ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.గ్రామసభలో ప్యాపిలి పట్టణ ప్రజలు, రైతులు, వివిధ వార్డుల వాసులు తమ ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న తీవ్ర తాగునీటి సాగునీటి సమస్యలను నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించిన నాయకులు, పంచాయతీ సిబ్బందిని వాటర్ మ్యాన్లను సభ మధ్యలోకి పిలిపించి నీటి సరఫరాలోని లోపాలు, సాంకేతిక సమస్యలపై క్షుణ్ణంగా సమీక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డుల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తక్షణ చర్యలు చేపడతామని, ప్రజలు రైతులు ఎదుర్కొంటున్న నీటి సమస్యలను త్వరలోనే శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపిటిసి వీరాంజనేయులు, దానం మధు,టీడీపీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఎస్ కె వలి, ప్యాపిలి పట్టణ టీడీపీ ఉపాధ్యక్షులు వెంకటేష్, మైనార్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ అక్బర్ వలి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న వ్యవసాయ మార్కెట్ యార్డ్ సెక్రటరీ సురేష్



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 15 నంది పత్రిక** ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ కమిటీ లో గ్రేడ్-1 ఇన్చార్జి కార్యదర్శిగా పనిచేస్తున్న ఇటిక్యాల సురేష్ ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. 80వ స్వాతంత్ర దినోత్సవ పురస్కరించుకొని నంద్యాల జిల్లా కేంద్రం పెరేడ్ గ్రౌండ్లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షరాన్ చేతులమీదుగా మార్కెట్ కార్యదర్శి ఇటిక్యాల సురేష్ ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ కు పలువురు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో చూపిన ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం వచ్చింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తనకు అవార్డు రావడం పట్ల ఎంతో ఆనందంగా ఉందన్నారు. అందరి సహకారం వల్లనే తనకు అవార్డు వచ్చిందన్నారు.

# నిత్యాన్నదాన పథకానికి భక్తులు విరాళాలు




**మహానంది ఆగస్టు 15 (నంది పత్రిక):-** మహానంది పుణ్యక్షేత్రంలో అమలవుతున్న మహానందీశ్వర స్వామివారి నిత్యాన్నదాన పథకానికి భక్తులు విరాళాలు అందజేశారు.కర్నూల్ జిల్లా రెమట విలేజ్ కి చెందిన వి.సర్వేశ్వర్ రెడ్డి రూ.1,00,000,పెద్దకొట్టాల గ్రామానికి చెందిన నంద్యాల చంద్రశేఖర్ రెడ్డి,లక్ష్మీదేవి దంపతులు రూ. 50,580, కర్నూలు కు చెందిన పి.అచ్యుత్ రెడ్డి , పి.కొత్తూరు లు రూ.5116 విరాళంగా నిత్యాన్నదానానికి భక్తితో అందజేశారు.దాతలను ఆలయ పర్యవేక్షకులు నీలకంఠేశ్వర రాజు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ,అన్నదాన బాండు అందజేయగా,వేదపండితులు రవిశంకర్ అవధాని ఆశీర్వదించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# దళితవాడలో ఘనంగా ఆగస్టు 15 జెండా ఆవిష్కరణ.



**బేతంచెర్ల ఆగస్టు 15 ( నంది పత్రిక ).** బేతంచెర్ల పట్టణంలోని దళితవాడలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని,దేశ ఐక్యత, సమానత్వం,సామాజిక న్యాయం కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. దళితవాడ ప్రజలు, యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాకు వందనం చేశారు. జై హింద్, వందే మాతరం నినాదాలతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# గౌతమ్ స్కూల్ లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి బహుమతుల ప్రదానం**



**నంది పత్రిక ఆత్మకూరు** ఆత్మకూర్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక గౌతమ్ స్కూల్ లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముఖ్య అతిథులు మరియు స్కూల్ యాజమాన్యం జెండాను ఆవిష్కరించిన అనంతరం, వివిధ క్రీడా మరియు విద్యా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా, పదవ తరగతి ( బి -సెక్షన్) విద్యార్థిని సాయి దీపిక, పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించి ఫస్ట్ ర్యాంకు సాధించినందుకు గాను మెడల్ తో సత్కరించబడ్డారు. స్కూల్ ఎండి సాయి ప్రణీత్ గారు మరియు స్కూల్ హెడ్మాస్టర్ శ్రీనివాసులు కలిసి ఆమెకు మెడల్ మరియు సర్టిఫికేట్ అందజేశారు.పాఠశాల యాజమాన్యం విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ప్రశంసనీయమని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న నంద్యాల వ్యవసాయ మార్కెట్ సహాయక సూపర్వైజర్ మస్తాన్



**నంద్యాల ప్రతినిధి ఆగస్టు 15 నంది పత్రిక** నంద్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ లో సహాయక సూపర్వైజర్ గా పనిచేస్తున్న మస్తాన్ ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. 80వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా నంద్యాల జిల్లా కేంద్రం పెరేడ్ గ్రౌండ్లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ షరాన్ చేతులమీదుగా మస్తాన్ సహాయక సూపర్వైజర్ ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మస్తాన్ కు నంద్యాల మార్కెట్ యార్డ్ సెక్రటరీ డిఆర్ కుమార్ నాయక్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధికారులు సిబ్బంది పలువురు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో చూపిన ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం వచ్చింది. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ తనకు అవార్డు రావడం పట్ల ఎంతో ఆనందంగా ఉందన్నారు. అందరి సహకారం వల్లనే తనకు అవార్డు వచ్చిందన్నారు.

## ఉత్తమ అధికారి అవార్డు అందుకున్న ఏఎస్ఐ జయతీర్థ



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 15 నుండి పత్రిక** ఆళ్లగడ్డ పట్టణ ఏఎస్ఐ జయతీర్థకు ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రం లభించింది. 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నంద్యాల జిల్లా కేంద్రం పెరేడ్ గ్రౌండ్లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ జిల్లా కలెక్టర్ రాజకుమారి జిల్లా ఎస్పీ సునీల్ షరాన్ చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఆళ్లగడ్డ పట్టణ ఏఎస్ఐ విధులు నిర్వహిస్తున్న ఆయన వివిధ పలు స్టేషన్లో పనిచేశారు అందరి అధికారుల చేత ప్రశంసలందుకున్న ఏఎస్ఐ జయ తీర్థఆయన అందించిన సేవలను గుర్తించి ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ డీఎస్పీ శ్రీనివాసరావు పట్టణ సీఐ ఎస్ఐ పీరయ్య శ్రీనివాస గౌడ్ స్టేషన్ పోలీస్ సిబ్బంది పలువురు పోలీస్ అధికారులు ఇతర ఉన్నతాధికారులు మరియు పలువురు జయతీర్థకు శుభాకాంక్షలు తెలిపారు.

## రెపరెపలాడిన మువ్వన్నెల జెండా



**,ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 15 నంది పత్రిక:** ఆళ్లగడ్డ పట్టణంలోని , కోర్టులో, సబ్ జైల్లో 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోర్టు ఆవరణంలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్ .శైలజ, జూనియర్ సివిల్ జడ్జి టి. భాస్కర్ జెండా ఆవిష్కరణ చేశారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అలాగే సబ్ జైల్లో సూపరిండెంట్ అనిల్ యోగేష్ కుమార్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేసి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. .

## ఆర్ఎస్ఐ శ్రీహర్షవర్ధన్ రెడ్డికి ఉత్తమ ఎస్ఐగా ప్రశంసా పత్రం..



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 15 నంది పత్రిక** నంద్యాల ఆర్ఎస్ఐ కె. శ్రీహర్షవర్ధన్ రెడ్డికి ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రం లభించింది. 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నంద్యాల జిల్లా కేంద్రం పెరేడ్ గ్రౌండ్లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ జిల్లా కలెక్టర్ రాజకుమారి జిల్లా ఎస్పీ సునీల్ షరాన్ చేతులమీదుగా ఆయన ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పోలీస్ శాఖ అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గతంలో నంద్యాల జిల్లాలోని నందికొట్కూరు వివిధ ప్రాంతాల్లో ఆళ్లగడ్డ టౌన్ ఎస్ఐ గా పని చేసి ప్రొద్దుటూరులో పదవీ విరమణ చేసిన కే పి బి వెంకటరెడ్డి కుమారుడైన శ్రీ హర్షవర్ధన్ రెడ్డి పోలీసు శాఖలో తనదైన శైలిలో ఉత్తమ సేవలు అందించిన విషయాన్ని గుర్తించిన పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఆయనను ఎంపిక చేసి శనివారం జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో ఆయనకు ప్రశంశా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఐ శ్రీహర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. తన తండ్రి వెంకటరెడ్డి అడుగుజాడలలో క్రమశిక్షణతో నడిచి ఈ రోజు తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే అవార్డు అందుకున్నట్లు శ్రీ హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు.

## ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 15, నంది పత్రిక :** ఆళ్లగడ్డ పరిధిలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల వద్ద శనివారం 80 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అధికారులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని డిఎస్పీ కార్యాలయం డీఎస్పీ శ్రీనివాసరావు, ఆళ్లగడ్డ రూరల్ సర్కిల్ కార్యాలయంలో రూరల్ సీఐ బివి రమణ రూరల్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐ వరప్రసాద్ పట్టణ సర్కిల్ కార్యాలయంలో సిఐ నాగరాజారావు ఎస్ఐలు పీరయ్య శ్రీనివాస గౌడ్ రామకృష్ణారెడ్డి ,ఎంపిడిఓ కార్యాలయం ఎంపీడీవో నూర్జహాన్ బేగం, వ్యవసాయ శాఖ కార్యాలయం, తాహసీల్దార్ కార్యాలయం, జ్యోతిరత్నకుమారి మున్సిపల్ కార్యాలయం, మున్సిపల్ కమిషనర్ పి కిషోర్ పలు ప్రభుత్వ ప్రైవేటు డిగ్రీ జూనియర్ కళాశా లలు పాఠశాలలలో ఉపాధ్యాయులు అధ్యాపకులు ప్రిన్సిపాల్ లు అధికారులు జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రం కోసం ఎందరో త్యాగధనులు ఐక్యమత్యంతో తమ ధన మాన ప్రాణాలను త్యాగం చేసి, ఈ దేశానికి స్వాతంత్రం తీసుకుని వచ్చారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చినవారి త్యాగాలను స్మరించుకోవడం తోపాటు దేశాభివృద్ధి కోసం పాటుపడిన ఎందరో మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది తదితరులు పాల్గపన్నారు.



## రక్తదాన చేసి ఆదర్శంగా నిలిచిన యువకులు



**మహానంది ఆగస్టు 15 (నంది పత్రిక):-** దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో యువత రక్తదానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచారు. తిమ్మాపురం గ్రామంలోని పీర్ల చావిడి వద్ద ఆర్ ఎంపీ బాలసుబ్బయ్య ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో మహానంది మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన 40 మంది యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు.నంద్యాల బ్లడ్ సెంటర్ నిర్వాహకులు ఈ శిబిరానికి హాజరై యువకుల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ రక్తసేకరణ కార్యక్రమంలో డాక్టర్ హసీనా మరియు బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్లు టెక్నీషిఆన్లు అశోక్ , గజేంద్ర,మహేష్ తదితరులు పాల్గొన్నారు .స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రాణదాతలుగా నిలిచిన యువకులను,ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులను పలువురు ప్రశంసించారు.

## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి





**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 15 నంది పత్రిక** దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరంలోని జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల పోరాట ఫలితంగా నే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామన్నారు. జిల్లా యంత్రాంగం అంతా అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేర్చాలని ఆదేశించారు. విద్య, వైద్యం, మహిళా సాధికారత, గ్రామాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో జిల్లా ముందంజలో ఉంటూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడుతున్నాయని వివరించారు. మన జిల్లా, రాష్ట్రం, దేశం ప్రపంచంలోనే ఉన్నతమైన గుర్తింపు సాధించేలా అధికారులు కృషి చేయాలని ఆకాంక్షించారు. పతాకావిష్కరణకు ముందు కలెక్టరేట్ ప్రాంగణంలోని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, ఇతర ఉన్నతాధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ వేడుకల్లో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి డిఆర్ఓ పి. ప్రభాకర్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు..



## సమాచార ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు



**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 15 నంది పత్రిక** 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్ భీమవరం పెరేడ్ గ్రౌండ్ లో శనివారం సమాచార పౌర సంబంధాల శాఖ, భీమవరం కార్యాలయంలో పనిచేస్తున్న ఏపీ ఆర్ ఓ కె.సత్యనారాయణ రాజు, టెక్నికల్ సబర్డినేట్ పి. వీరభద్రం, ఫోటోగ్రాఫర్ పి. వై రత్నాకర్ లకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ టి. మోహన్ రాజు, ఏఈఐ ఇ వరప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కె.వెంకటేశ్వరరావు, టైపిస్ట్ కె.జ్యోతి,రికార్డ్ అసిస్టెంట్ డి.సోమరాజు, సిబ్బంది ఆర్. వైశాలి అభినందనలు తెలిపారు.



## 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

**కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో వినతుల స్వీకరణ**

**మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహణ**

**సమస్యల సమాచారం కోసం '1100' కాల్ సెంటర్ సేవలు: కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**



**నంది పత్రిక కర్నూలు ప్రతినిధి** ఈ నెల 17వ తేదీ సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి కర్నూలు కలెక్టరేట్ ప్రాంగణంలోని సునయన ఆడిటో రియంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేదిక ద్వారా ప్రజల నుంచి నేరుగా సమస్యలు, అర్జీలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు (తహసీల్దార్ ఆఫీసులు), రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు (ఆర్డీవో ఆఫీసులు), మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ఏకకాలంలో ఈ ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**అర్జీల సమాచారం కోసం 1100కు కాల్ చేయవచ్చు** అర్జీదారులు సమర్పించిన దరఖాస్తుల పురోగతిని తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తు పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకోవడానికి '1100' టోల్ ఫ్రీ కాల్ సెంటర్ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు పొందవచ్చని సూచించారు. అలాగే ప్రజలు తమ సమస్యలను నేరుగా నమోదు చేసుకునేందుకు వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు.

## షేహ్రే జమియాతే అహ్లే హదిస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం.



**నందికొట్కూరు ఆగస్టు 15( నంది పత్రిక)** నందికొట్కూరు పట్టణంలోని సంత గేట్స్ స్కూల్ నందు శనివారం 80 వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని షేహ్రే జమియాతే అహ్లే హదిస్ సంఘం ప్రెసిడెంట్ షమివుల్లా, ఉపాధ్యక్షుడు షేక్ చాంద్బాషా ( సౌదీ చాంద్) విద్యా కమిటీ చైర్మన్,) కార్యదర్శి మౌలానా మొహమ్మద్ రఫీ (జమయై ) ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు షకీల్ అహ్మద్, ఎంఈఓ రామిరెడ్డి హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోనే పలువురు యువకుల స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి టిడిపి నాయకుడు షకిల్ అహ్మద్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రానికి ఎందరో మహనీయులు త్యాగ ఫలితమే ఉన్నారు. మహనీయులు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని దేశ ప్రగతికి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. రక్తదానం మహా గొప్పదానమని, ఆపద సమయంలో రక్తం ఎంతోమందికి ప్రాణదానం చేస్తుందని, రక్తం దానం చేసిన వారు ప్రాణదాతలుగా చిరస్మనీయంగా నిలిచిపోతారని ఇది మంచి కార్యమన్నారు. రక్తదానం చేయడంలో యువత స్వచ్ఛందంగా స్పందించే గుణం ఉండాలని ఆయన సూచించారు. ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనారిటీ ప్రజలు మరియు నాయకులు ఐక్యతతో బ్రిటిష్ వారిని గడ గడ లాడించి దేశం వదిలి వెళ్ళిపోయేలా, పోరాటము చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో షేహ్రే జమియాతే అహ్లే హదిస్ సభ్యులు అబ్దుల్ హక్, ఖాదర్బాషా, మౌలాలి, జావిద్, అభిబుల్ల, రసూల్, మరియు యువత పాల్గొన్నారు.

## ఉత్తమ అధికారి సీఐ నాగరాజరావుకు ఉత్తమ ప్రశంసా పత్రం



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 15 నుండి పత్రిక** ఆళ్లగడ్డ పట్టణ సిఐ నాగరాజరావుకు ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రం లభించింది. 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నంద్యాల జిల్లా కేంద్రం పెరేడ్ గ్రౌండ్లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ జిల్లా కలెక్టర్ రాజకుమారి జిల్లా ఎస్పీ సునీల్ షరాన్ చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఆళ్లగడ్డ పట్టణ సిఐగా గత కొద్ది నెలల క్రితమే ఆయన బాధ్యతలు స్వీకరించడం జరిగింది. సీఐగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పట్టణంలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ తదితర అంశాలపై ఆయన దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఉన్నతాధికారులు ఆయన అందించిన సేవలను గుర్తించి ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ డిఎస్పి శ్రీనివాసరావు పలువురు పోలీస్ అధికారులు ఇతర ఉన్నతాధికారులు మరియు పలువురు సిఐ నాగరాజురావు కు శుభాకాంక్షలు తెలిపారు.

## సమరయోధుల త్యాగాలను స్మరించుకుందాం:::: సింగల్ విండో చైర్మన్ ఎ. షహబుద్దిన్.



**ఆత్మకూరు ఆగస్టు 15 నంది పత్రిక:** ఆత్మకూర్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ శ్రీశైలం నియోజకవర్గ పరిశీలకుడు గునుపాటి భాస్కర్ , ఆత్మకూర్ అర్బన్ ,రూరల్ అధ్యక్షులు వేణుగోపాల్ ,రవీంద్ర బాబు తో కలిసి జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ షహబుద్దిన్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జిలు శంకర్, దినకర్ రావు తోపాటు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఆత్మకూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నందు శ్రీశైలం నియోజకవర్గ నాయకులు వై. యుగంధర్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్ గారితో కలిసి జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ ఎ. షహబుద్దిన్. వీరి వెంట డైరెక్టర్ ప్రవీణ్, రైతులు వీరారెడ్డి, శంకర్ రెడ్డి ,శంషుద్దీన్ ,కాజు మియా ,సిబ్బంది రియాజ్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆత్మకూర్ బాలికల ఉన్నత పాఠశాల నందు విద్యా కమిటీ చైర్మన్ ఖాజావలి, ప్రధాన ఉపాధ్యాయురాలు జి. ఉమారాణి మరియు వేణుగోపాల్ తో కలిసి జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఉపాధ్యాయురాలు, స్థానిక నాయకులు అమృల్లా, శ్రీను, అబ్దుల్ రజాక్, మొహమ్మద్ ,మా భాష తదితరులు పాల్గొన్నారు.

**నలంద హై స్కూల్ లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు** నలంద హై స్కూల్ కరస్పాండెంట్ ఎం.వి. చలపతి తో కలిసి జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సింగిల్ విండో చైర్మన్ ఎ. షహబుద్దిన్. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కుల మత ప్రాంతాలకు అతీతంగా మన దేశ ఐక్యతను చాటే అతి పెద్ద పండుగ పంద్రాగస్టు వేడుక అని అన్నారు. మనమందరం దేశభక్తితో సరికొత్త స్ఫూర్తితో ఈ పండుగను జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిఇఓ బి. సుమతి, జిల్లా మేదరి సంఘం అధ్యక్షులు చందా రమణయ్య గారు, హెడ్మాస్టర్ సందయ్య, ఉపాధ్యాయ, ఉపాధ్యాయురాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహణ.





## రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డా. నిమ్మల రామానాయుడు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 15 నంది పత్రిక** భీమవరం కలెక్టరేట్ ఆవరణలోని పెరేడ్ గ్రౌండ్ లో శనివారం ఏర్పాటు చేసిన 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో రాష్ట్ర జలవనరుల శాఖా మాత్యులు డా. నిమ్మల రామానాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తో కలిసి జాతీయ జండాను ఆవిష్కరించ్చారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జలవనరుల శాఖా మాత్యులు డా. నిమ్మల రామానాయుడు 80వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగిస్తూ, పశ్చిమ గోదావరి జిల్లా లో వివిధ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి తెలియచేసారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు మాట్లాడుతూ ముందు గా జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులందరికీ ఘన నివాళులు అర్పించారు. 'స్వర్ణాంధ్రప్రదేశ్2047' లక్ష్యంగా రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయం, పారిశ్రామిక, పర్యాటక, సంక్షేమ రంగాల్లో అగ్రగామిగా నిలుస్తోందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరంలో పశ్చిమ గోదావరి జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు.

**జలవనరుల రంగం ద్వారా** పశ్చిమ డెల్టాలో 4,03,001 ఎకరాల ఆయకట్టుకు సకాలంలో సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. సుమారు 2,220 కిలోమీటర్ల కాలువల ద్వారా టెయిల్ ఎండ్ భూములకు సైతం నీరు అందించి పంటల దిగుబడులు పెంచే చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. డెల్టా ఆధునీకరణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టి జిల్లాకు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యమన్నారు. 2025-26లో 332 పనులకు రూ.1,269.35 లక్షలు, 2026-27లో 535 పనులకు రూ.2,840.15 లక్షలు మంజూరు చేసి నీటి వినియోగదారుల సంఘాల ద్వారా పనులు చేపట్టినట్లు తెలిపారు. వరద రక్షణ చర్యల్లో భాగంగా సుమారు రూ.28.03 కోట్లతో వరద కరకట్టల పనులు వేగవంతం చేసినట్లు చెప్పారు. 2027 గోదావరి పుష్కరాల కోసం రూ.31.54 కోట్ల పుష్కర ఘాట్ పనులు, హెడ్ వర్క్స్ కింద రూ.681.24 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. డెల్టా వ్యవస్థ ఆధునీకరణ కోసం రూ.13.42 కోట్లతో లీడర్ సర్వే నిర్వహిస్తున్నా మన్నారు.

**వ్యవసాయం, ఉద్యానవన రంగ ప్రాధాన్యం:-** ఖరీఫ్ సీజన్‌లో 2,19,511 ఎకరాలకు గాను 1,80,372 ఎకరాల్లో సాగు పూర్తయిందని తెలిపారు. అవసరమైన 43,633 మెట్రిక్ టన్నుల ఎరువులకు బదులుగా 51,455 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు.

కౌలు రైతులకు భరోసా కల్పించే విధంగా 2026-27లో లక్ష సీసీఆర్ సి కార్డుల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 43,338 సీసీఆర్ సి కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా గత రెండు సంవత్సరాల్లో 1,03,761 మంది రైతులకు రూ.207.52 కోట్లు నేరుగా ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. వ్యవసాయ యాంత్రీకరణ కింద రూ.2.89 కోట్ల సబ్సిడీతో యంత్ర పరికరాలు అందించినట్లు తెలిపారు. జిల్లాలో 21,297 హెక్టార్లలో కొబ్బరి, ఆయిల్‌పామ్, కోకో, అరటి తదితర ఉద్యాన పంటలు సాగవుతున్నాయని తెలిపారు. ఆక్వా రైతులకు మద్దతుగా ఫీడ్ ధరలు తగ్గించడంతో పాటు ప్రతి ఆక్వా రైతుకు యూనిట్ విద్యుత్‌కు రూ.1.50 సబ్సిడీని అందిస్తున్నట్లు చెప్పారు. మత్స్యకార కుటుంబాలకు వేట నిషేధ కాలంలో ఆర్థిక సహాయాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచి జిల్లాలో 1,774 కుటుంబాలకు రూ.3.57 కోట్ల సహాయం అందించినట్లు తెలిపారు.

**పౌరసరఫరాలు,** దీపం2 పథకం ద్వారా అర్హులైన మహిళలకు ప్రతి నాలుగు నెలలకు ఒక ఉచిత గ్యాస్ సిలిండర్ చొప్పున ఏడాదికి మూడు సిలిండర్లు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో నాలుగు విడతల్లో దాదాపు రూ.140 కోట్ల గ్యాస్ సబ్సిడీ నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. ఖరీఫ్ 2025-26లో 4.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి రూ.1,054.52 కోట్లు చెల్లించగా, రబీ 2025-26లో 7,82,118 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి రూ.1,855.80 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

**ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్, మహిళా సాధికారత:-** ఎన్. టి. ఆర్. భరోసా పథకం కింద వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళల పెన్షన్‌ను రూ.4,000కు, దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6,000కు పెంచినట్లు తెలిపారు. జూలై 2026లో జిల్లాలో 2,20,227 మంది లబ్ధిదారులకు రూ.96.02 కోట్ల పెన్షన్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు రుణ పరిమితిని రూ.10 లక్షల వరకు పెంచడంతో పాటు వడ్డీలేని రుణాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. 2026-27లో 15,726 సంఘాలకు రూ.269.58 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించినట్లు తెలిపారు. తాడేపల్లిగూడెంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో "చోకో టేల్స్" చాక్లెట్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి** జిల్లాలో 1.25 లక్షల యాక్టివ్ జాబ్ కార్డుల ద్వారా సుమారు 1.86 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. 2025-26లో 34 లక్షల పని దినాల లక్ష్యానికి గాను 32.52 లక్షల పని దినాలు కల్పించి రూ.91.57 కోట్ల వేతనాలు చెల్లించినట్లు వెల్లడించారు. 'పల్లె పండుగ' కార్యక్రమంలో పీపీపీ 1.0, 2.0 కింద రూ.116 కోట్లకు పైగా వ్యయంతో 1,568 సీసీ , బీటి రోడ్లు, 1,190 పశు, కోళ్ల షెడ్ల నిర్మాణాలను పూర్తి చేసినట్లు తెలిపారు.

**విద్యారంగంలో కీలక చర్యలు:-** జిల్లాలో 86,258 మంది విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పథకం కింద ఉచిత విద్యా కానుక కిట్లు అందించి రూ.26.93 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా 87,142 మంది విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. 2026-27 విద్యా సంవత్సరానికి 2,26,566 మంది లబ్ధిదారుల కోసం 1,59,890 తల్లుల ఖాతాలకు రూ.295 కోట్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. జాతీయ స్థాయిలో పెంటపాడుపోస్ట్ బేసిక్ హై స్కూల్ కు చెందిన 10వ తరగతి విద్యార్థి ఏ.డి.వి. సత్యనారాయణ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడం జిల్లాకు గర్వకారణమన్నారు.

**వైద్యం, ఆరోగ్య రంగం:-** వైద్యం, ఆరోగ్య రంగంలో విస్తృత సేవలు18 ఏళ్లు పైబడిన వారందరికీ ఎన్ సీడీసీడి 4.0 కింద ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 379 హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల ద్వారా ప్రాథమిక వైద్య సేవలు, 63 రకాల ల్యాబ్ పరీక్షలు అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద 80 నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా 7,257 మందికి ఉచిత కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించామని, 104 సేవల ద్వారా 6,482 మెడికల్ క్యాంపులు నిర్వహించి 6,21,836 మందికి వైద్య సేవలు అందించామని తెలిపారు. 108 అంబులెన్స్ సేవల ద్వారా 12,411 మంది ప్రాణాలను రక్షించినట్లు తెలిపారు. భీమవరం ఏరియా ఆసుపత్రిలో రూ.23.75 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ మెడికల్ బ్లాక్ నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

**గృహ నిర్మాణం, మౌలిక వసతులు:-** తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు, తణుకు పట్టణాల్లో మొత్తం 20,784 ఎన్టీఆర్ టిడ్కో ఇళ్లు మంజూరు చేసి, మిగిలిన పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంతో పాటు తాగునీరు, డ్రైనేజ్, ఎస్ టి పి, వీధి దీపాలు, అంగన్‌వాడీ, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రైతు బజార్లు, బ్యాంకులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.

**పారిశ్రామిక, విద్యుత్ రంగాల్లో పురోగతి** 2025-26లో 5,102 గృహాలకు 16.1 మెగావాట్ల సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలు ఏర్పాటు చేసి రూ.37.7 కోట్ల సబ్సిడీ అందించినట్లు తెలిపారు. చిన్న,సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమల వ్యవస్థాపకులకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అనుమతులను సులభతరం చేయగా, 2025-26లో 4,033 కొత్త పరిశ్రమలు నమోదై సుమారు 13,392 మందికి ఉపాధి లభించినట్లు వెల్లడించారు. రూ.30 కోట్ల పెట్టుబడితో ఇంటిగ్రేటెడ్ కొబ్బరి ప్రాసెసింగ్ క్లస్టర్‌కు ఆమోదం లభించినట్లు తెలిపారు.

**అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు భోజనం** పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో జిల్లాలో మొత్తం 10 అన్న క్యాంటీన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, ఉండి, నరసాపురంలో ఏర్పాటు చేసిన ఈ క్యాంటీన్ల ద్వారా ప్రతిరోజూ వేలాది మందికి అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తున్నట్లు వెల్లడించారు.

**తాగునీరు, రోడ్లు, పంచాయతీరాజ్ అభివృద్ధి** జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ సురక్షిత తాగునీరు అందించేందుకు 1,488 పనులకు రూ.335.75 కోట్లు మంజూరు చేయగా, 890 పనులు పూర్తయ్యాయని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖలో 1,295 పనులకు రూ.310.42 కోట్లు మంజూరు కాగా 1,111 పనులు పూర్తయ్యాయని చెప్పారు. రోడ్లు, భవనాల శాఖ పరిధిలో 1,574.417 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం, నిర్వహణకు రూ.431.93 కోట్ల పనులు మంజూరై పురోగతిలో ఉన్నట్లు వెల్లడించారు.

**ఉద్యోగ, ఉపాధి అవకాశాలు** యువతకు ఉపాధి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా డిఎస్ సి ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 28 జాబ్ మేళాలు నిర్వహించి 1,589 మందికి వివిధ రంగాల్లో ఉద్యోగాలు కల్పించినట్లు వెల్లడించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేసి ప్రధాన మంత్రి విశ్వకర్మ ద్వారా 199 మందికి శిక్షణ అందించినట్లు తెలిపారు.

**మహిళలు, దివ్యాంగులకు ఉచిత బస్ ప్రయాణం**

స్త్రీ శక్తి పథకం ద్వారా రాష్ట్రంలోని బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు అర్హత కలిగిన గుర్తింపు పత్రాలతో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో 214 బస్సుల ద్వారా సుమారు 45,794 మంది మహిళా ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుందని వెల్లడించారు.

దివ్యాంగ శక్తి పథకం ద్వారా దివ్యాంగులకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం అందిస్తున్నట్లు తెలిపారు.

సంక్షేమం, మహిళా శిశు సంక్షేమం

సామాజిక, బీసీ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలోని హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, ఆర్వో ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసిన తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ విద్యార్థుల పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు రూ.82.86 కోట్లు విడుదల చేయగా, బీసీ విద్యార్థులకు ఆర్. టి. ఎఫ్ కింద రూ.44.44 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో 1,626 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 15,738 మంది చిన్నారులకు ప్రీ-స్కూల్ విద్య, 13,377 మంది గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. 489 అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికీకరించినట్లు చెప్పారు.

**పర్యాటక రంగ అభివృద్ధి**

'స్వర్ణాంధ్ర పర్యాటక విజన్2047'లో భాగంగా జిల్లాలోని సహజ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పేరుపాలెం బీచ్ అభివృద్ధికి పి పి పి విధానంలో కార్యాచరణ రూపొందించామని, గోదావరి నదీ తీరంలోని దొంగరవిపాలెం, పెద్దమలాం ప్రాంతాల్లోని రిసార్టులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. భీమవరం, పాలకొల్లు వంటి పట్టణాల్లో పార్కులు, చెరువుల సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

**ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి**

పశ్చిమ గోదావరి జిల్లా పచ్చని పాడి పంటలు, శ్రమించే రైతులు, అపారమైన మత్స్య సంపద, చేనేత, పర్యాటక రంగాలతో దేశంలోనే రోల్ మోడల్‌గా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతోనే పూర్తి స్థాయిలో విజయవంతమవుతాయని తెలిపారు. పిల్లల భవిష్యత్తు, పచ్చని పల్లెల ప్రగతి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి రాష్ట్రాన్ని, పశ్చిమ గోదావరి జిల్లాను 'స్వర్ణాంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని మంత్రివర్యులు పిలుపునిచ్చారు.

అనంతరం వివిధ శాఖలలో వృత్తిపట్ల ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలను మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ఈ స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమం లో రాజ్య సభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, భీమవరం శాసన సభ్యులు పులపర్తి రామాంజనేయులు, జిల్లా ఎస్.పి అద్నాన్ నయీమ్ అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ, డిఆర్వో పీ ప్రభాకర్, ఆర్ డి ఒ కె. ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎమ్మార్వో రాంబాబు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, స్వతంత్ర సమరయోధులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

# ఆకట్టుకున్న శకటాల ప్రదర్శనలు



**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 15 నంది పత్రిక** జిల్లా కలెక్టరేటు పెరేడ్ గ్రౌండులో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన శకటాలు ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, అగ్నిమాపక శాఖ, విద్యాశాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, గృహ నిర్మాణ శాఖ, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ శకటాలను, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జంతు ప్రదర్శనలను వేదికపై నుండి మంత్రివర్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడు,రాజ్య సభ సభ్యులు పాక సత్యనారాయణ, జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్ప శ్రీ,రాష్ట్ర పీఏసీ చైర్మన్ భీమవరం శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు తిలకించారు. శాఖల అభివృద్ధిని సూచిస్తూ రూపొందించిన శకటాల ప్రదర్శనలో జిల్లా విద్యాశాఖ ప్రధమ స్థానం, పశుసంవర్ధక శాఖ ద్వితీయ స్థానం, మత్స్య శాఖ, వైద్య ఆరోగ్య శాఖకు తృతీయ స్థానాలు లభించడం పట్ల మంత్రి డా. నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత శాఖల జిల్లా అధికారులను అభినందించారు.

**విశేషంగా ఆకట్టుకున్న వివిధ శాఖల స్టాల్స్ ప్రదర్శన** స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ పేరేడ్ గ్రౌండ్స్ లో ఏర్పాటుచేసిన వివిధ శాఖల స్టాల్స్ ను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్ప శ్రీ కలసి పరిశీలించారు...జిల్లాలో ప్రభుత్వ శాఖలు సాధించిన ప్రగతి, అమలు చేస్తున్న పథకాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, మత్స్య శాఖ, విద్యా శాఖ - సమగ్ర శిక్ష, వ్యవసాయ శాఖ, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఉద్యాన శాఖ మరియు ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సేద్య పథకము, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, జిల్లా పరిశ్రమల కేంద్రం, యూనియన్ బ్యాంకు లీడ్ బ్యాంకు డిపార్ట్మెంటు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) స్టాల్స్ ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి డా.నిమ్మల రామానాయుడు ప్రతి స్టాల్సులో ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి, స్టాల్స్ లో ఏర్పాటుచేసిన ప్రతి వస్తువును పరిశీలించి వివరాలను స్టాల్స్ నిర్వాహకులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట జిల్లా ఎస్ పి. అద్నాన్ నయీమ్ అస్మి, భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్టాల్సు నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



# అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 15 నంది పత్రిక** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా కలెక్టరేట్ పేరేడ్ గ్రౌండ్స్ లో శనివారం వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వేదిక నుండి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ, రాజ్యసభ సభ్యులు పా కా వెంకట సత్యనారాయణ, భీమవరం శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు తదితరులు వీక్షించారు. తణుకు రూట్ స్కూల్ విద్యార్థినులు ప్రదర్శించిన దేశభక్తి గీతం రింగ్ డాన్స్ మొదటి బహుమతి, భీమవరం సెయింట్ మేరీస్ స్కూలు విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గేయం రెండో బహుమతి, భీమవరం పి ఎం ఎస్ బాలికల స్కూలు విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గేయ శాస్త్రీయ నృత్యం, ఉండి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన కరాటే ప్రదర్శన కర్ర సాము మూడవ బహుమతి గా గెలుపొందారు. పాలకొల్లు భారతీయ విద్యా భవన్ విద్యార్థులు దేశభక్తి గేయం,తాడేపల్లిగూడెం ఆరుగొలను ఏపీ ఆర్ ఎస్ డబ్ల్యు స్కూల్ విద్యార్థులు నేషనల్ బ్యాండ్ ప్రదర్శన లు చేశారు. ఈ ప్రదర్శనలో గెలుపొందిన వారికి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డా . నిమ్మల రామానాయుడు , జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ,జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ చేతులు మీదుగా ప్రశంసా పత్రం బహుమతులు అందజేసి విద్యార్థులను అభినందించారు.



# నందిగామ పల్లగిరి కొండపై ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు..

### జాతీయ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

### అమరవీరుల త్యాగాలకు జోహార్లు, దేశ సేవకు ప్రతి ఒక్కరు అంకితమవ్వాలని పిలుపు...



**నందిగామ బ్యూరో చీఫ్ ఆగస్టు 15 నంది పత్రిక** నందిగామ పల్లగిరి కొండపై క్రీస్తు సంఘము చర్చ్ ఆఫ్ క్రైస్ట్ వారి ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సంఘ పెద్దలు మరియు కూటమి నేతలతో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు.

తంగిరాల సౌమ్య మాట్లాడుతూ "ఈరోజు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామంటే, అది ఎందరో స్వాతంత్ర సమరయోధుల త్యాగఫలం. స్వాతంత్ర సమరంలో అసువులు బాసిన అమరవీరులకు జోహార్లు. ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి నిండు భారతిని అనే భావాన్ని ప్రతి ఒక్కరూ గుండెల్లో పెట్టుకోవాలి. దేశ సేవకు ప్రతి ఒక్కరు అంకితమవ్వాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, కూటమి నేతలు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని స్వాతంత్ర దినోత్సవ వేడుకలను మరింత ప్రత్యేకంగా మార్చారు.

# ఎర్రకోటపై జెండా ఎగరేసిన ప్రధాని మోడీ

దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజధాని ఢిల్లీలో ఎర్రకోటపై ప్రధాని మోదీ జాతీయ జెండా ఎగురవేశారు. ఢిల్లీలోని ఎర్రకోటపై మోదీ వరుసగా 13వ సారి జాతీయ జెండా ఎగురవేశారు. దేశ చరిత్రలో తొలిసారిగా వందేమాతరం గేయాన్ని పూర్తిగా ఈ వేడుకల్లో ఆలపించారు. అనంతరం జాతీయ గీతం 'జనగణమన'ను ఆలపించారు. ఆ సమయంలో వాయుసేన పూలవర్షం కురిపించింది. ఒక హెలికాప్టర్ జాతీయ పతాకాన్ని.. మరొకటి 'వందేమాతరం' అని రాసి ఉన్న జెండాను మోసుకెళ్లాయి. 'వందేమాతరం' గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గతేడాది నవంబర్ 7 నుంచి ఏడాది పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జాతీయ గీతం 'జన గణ మన'తో పాటు వందేమాతరానికి ప్రభుత్వం సమాన హోదా కల్పిస్తూ చట్టం చేసింది. ఈ చట్టం ప్రకారం.. 'వందేమాతరం'ని అవమానించినా, ఆలపిస్తున్న సమయంలో ఆటంకం కలిగించినా ఇకపై చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారు. స్వాతంత్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రముఖ సెర్చ్ ఇంజిన్ సంస్థ గూగుల్ ప్రత్యేక డూడుల్‌ను రూపొందించింది. ఇది భారతీయ వస్త్ర కళలు, సంస్కృతీ సంప్రదాయాలు, వైవిధ్యాన్ని చాటిచెబుతోంది. 22 విభిన్న ప్రాంతీయ వస్త్ర సంప్రదాయాలను తెలియజేసే డిజైన్‌లు అందులో కనిపిస్తున్నాయి. చేతితో నేసిన ఈ వస్త్రాల డూడుల్ దేశవ్యాప్తంగా ఉన్న నేత కార్మికులు, రైతులు, బ్లాక్-ప్రింటర్ల సామూహిక శ్రమను ప్రతిబింబిస్తోంది. జెండా ఎగురవేయడానికి ముందు ప్రధాని మోదీ రాజ్‌ఘాట్ వద్ద మహాత్ముడికి నివాళులు అర్పించారు. అనంతరం ఎర్రకోట వద్ద గౌరవవందనం స్వీకరించి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకలు ప్రారంభమైన సమయంలో వాయుసేన పూలవర్షం కురిపించింది. స్వాతంత్య్ర దినోత్సవం రోజున మోదీ జెండా ఎగురవేయడం ఇది 13వసారి కావడం విశేషం.

# వికసిత్ భారత్ - స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా పేదరిక నిర్మూలనకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నాం



## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తున్నాం
## పోలవరం ప్రాజెక్ట్ ను గోదావరి పుష్కరాల కంటే ముందుగానే పూర్తిచేసి జాతికి అంకితం చేసేందుకు ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారు
## వ్యవసాయ, సాగునీటి రంగాలకు అధిక ప్రాధాన్యత
## ఏలూరు అంగరంగ వైభవంగా జరిగిన స్వతంత్ర దినోత్సవ వేడుకలలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి

**ఏలూరు బ్యూరో చీఫ్, ఆగష్టు, 15 నంది పత్రిక:** వికసిత్ భారత్ – స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో శుక్రవారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని మంత్రి స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ భారతావనికి స్వేచ్ఛా, స్వాతంత్రాలు అందించిన మహానీయులను స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవలసిన బాధ్యతపై మనందరిపై ఉందన్నారు. వారి కలలను సాకారం చేసేందుకు స్వాతంత్ర అభివృద్ధి ఫలాలు ప్రతీ ఒక్కరికీ అందేలా మనమంతా కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వారి సంక్షేమానికి విధానాలు రూపొందించి, సంస్కరణలకు మానవీయకోణాన్ని జోడించి ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నామన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేసేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటినుండి తిరిగి పోలవరం పనులు పునర్జెవం పొందాయని, గోదావరి పుష్కరాలకు ముందుగానే 2027, మే నాటికి పోలవరం ప్రాజెక్ట్ ను పూర్తిచేసి జాతికి అంకితం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. భారతదేశంలో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా పేరుగాంచనున్న అమరావతిని నిర్మించే బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టారని ప్రశంసలు కురిపిస్తూ న్యూయార్క్ టైమ్స్ ప్రత్యేక కథనం ప్రచురించిందంటే.... ఎంతటి సంకల్ప దీక్షతో ముఖ్యమంత్రి పనిచేస్తున్నారో అర్థం అవుతోందని, అంతటి కార్యదీక్షాపరుడు అయిన మన ముఖ్యమంత్రివర్యుల మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఘనచరిత్రను లిఖించడం ఖాయం అని భావిస్తున్నానన్నారు. ప్రతి ఒక్కరం అదే నిబద్ధతతో పని చేద్దాం... స్వర్ణాంధ్రను సాకారం చేద్దామని మంత్రి విజ్ఞప్తి చేశారు. రైతు బాగుంటేనే రాష్ట్రం, జిల్లా సుభిక్షంగా ఉంటాయని మేం బలంగా నమ్ముతానని, అందుకే సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణంలో అడ్డంకులను తొలగించి, నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, సామాజిక పింఛన్లు రూ. 4 వేలకు పెంపు, అన్నా క్యాంటిన్లు పునరుద్ధరణ, ఉచిత ఇసుక విధానం, తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ పథకం, ఆటో డ్రైవర్ల సేవలో వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. పేదరికం లేని సమాజాన్ని నిర్మించడం, ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పన, నైపుణ్యం మానవ వనరుల అభివృద్ధి , నీటి వనరుల పరిరక్షణ, రైతు–వ్యవసాయ టెక్నాలజీ, ప్రపంచస్థాయి ఉత్తమ రవాణా సదుపాయాలు, విద్యుత్ ఇంధన రంగాలలో ధరల నియంత్రణ, అత్యుత్తమ ఉత్పత్తుల తయారీ, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, నిత్య జీవితంలో డీప్ టెక్నాలజీ అంశాలతో కూడిన పది సూత్రాలతో స్వర్ణాంధ్రఏ2047 లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. పేదరికంలేని సమాజం కూటమి ప్రభుత్వ విధానమని, సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న 10 శాతం మంది, అట్టడుగున ఉన్న 20 శాతం మందికి చేయూతను ఇవ్వడం ద్వారా పేదరికాన్ని తగ్గించవచ్చన్నారు. . పీ4 పీపుల్, పబ్లిక్, ప్రైవేట్, పార్ట్నర్షిప్ విధానంలో జీరో పావర్టీ సాధనకు కృషి చేసి,సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గిస్తామన్నారు. మన జిల్లాలో 71 వేల 910 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించి ఇప్పటివరకు 44 వేల 114 కుటుంబాలను 4 వేల 853 మంది మార్గదర్శులతో దత్తత తీసుకున్నామని,. ఇంతమంచి కార్యక్రమానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరిస్తున్న మార్గదర్శులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు .

"స్త్రీశక్తి పథకం" ఉచిత బస్సు పథకంలో జిల్లాలో ఇప్పటి వరకు 2 కోట్ల 12 లక్షల 87 వేల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు . "దివ్యాంగ శక్తి" ద్వారా ఉచిత ప్రయాణ సదుపాయాన్ని లక్ష 6 వేల 886 మంది దివ్యాంగులు వినియోగించుకున్నారన్నారు. రెవిన్యూ శాఖ ద్వారా జిల్లాలో ఇంతవరకు 5502 మందికి చెందిన 5520. 81 ఎకరాలను 22ఏ జాబితా నుండి తొలగించి వారి కళ్ళల్లో ఆనందాన్ని చూసామన్నారు. జిల్లాలో ఇంతవరకు 662 గ్రామాలలోని భూ రికార్డులను కంప్యూటరీకరించామని, రాజముద్రతో ముద్రించిన 1, 24, 207 పట్టాదార్ పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులకు అందించామని,. టాంపరింగ్ చేయలేని విధంగా బ్లాక్ చైన్ టెక్నాలజీ తో పూర్తి భద్రతా ప్రమాణాలతో రెవిన్యూ రికార్డులను ఆధునీకరిస్తున్నామన్నారు.

"అన్నదాత సుఖీభవ – పి.యమ్.కిసాన్ పథకం" క్రింద 2026–27 సంవత్సరానికి గానూ లక్షా 60 వేల 968 రైతులకు, మొదటి విడుతగా 106 కోట్ల 29 లక్షల రూపాయలను వ్యవసాయ పెట్టుబడి సాయంగా రైతులకు విడుదల చేసామని, ఈ ఆర్థిక సంవత్సరములో 33 వేల 824 మంది కౌలు రైతులకు పంట సాగుదారుల హక్కు పత్రాలను (జజ=జ) అందించి, 3401 మంది రైతులకు 20. 4 కోట్ల రూపాయలు రుణాలుగా అందించామని, 30 వేల 62 భూసార పరీక్ష పత్రాలను పంపిణీ చేసామన్నారు. ఖరీఫ్ 2026 సాగుకు 55 వేల 450 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. సూపర్ ఎల్నినో కారణంగా ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు, సాగునీటి లభ్యతపై గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కలిగించి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. వీటికి సంబంధించి విత్తనాలను సబ్సిడీ పై అందిస్తున్నామని, అందుబాటులో ఉన్న సాగునీటిని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ఇరిగేషన్, సాగునీటి వినియోగదారుల సంఘాల, ప్రజాప్రతినిధులతో చర్చించి నిర్ణయం తీసుకుంటున్నామన్నారు. రైతులకు ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ కిట్లు అందిస్తున్నామని, వాతావరణ ఆధారిత, పిఎం ఫసల్ భీమా యోజన లపై రైతులకు అవగాహన కలిగించి అర్హులైన ప్రతీ రైతు పంటల భీమాలో నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి 86 వేల ఎకరాలలో 1. 26 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ప్రోత్సహిస్తున్నామని, ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు 'రైతు సంపద' పోర్టల్ ద్వారా ఆన్లైన్ మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపరుస్తున్న, వినూత్న కృషిచేస్తున్న జిల్లా యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు. జలధార జలహారతి పథకం క్రింద జిల్లాలో 1939 పూర్తి చేశామన్నారు. 3,189 ఫామ్ పాండ్లను అభివృద్ధి చేయడంతో పాటు, భూగర్భ జలాల అభివృద్ధికి పైలట్ ప్రాతిపదికన రీచార్జ్ షాఫ్టను ఏర్పాటు చేసామని,. ఇందుకోసం రూ.107 కోట్లతో భూగర్భ జలాల పునరుద్ధరణను బలోపేతం చేయడంతో పాటు, దీర్ఘకాలిక నీటిభద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. . ఇరిగేషన్ శాఖ ద్వారా 19. 74 కోట్ల రూపాయలతో 378 ఓ అండ్ ఎం పనులు చేపట్టామన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ద్వారా ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 పథకములో 82 వేల 443 గృహాలు 1504 కోట్ల 21 లక్షల రూపాయల ప్రాజెక్టు విలువతో మంజూరు చేసామని, 46 వేల 962 గృహములు పూర్తికాగా, 35 వేల 481 గృహములు వివిధ నిర్మాణ దశలలో ఉన్నాయన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం ద్వారా 12,774 గృహాలకు 41.33 మెగావాట్ల సోలార్ ప్యానెళ్లను రూ.78.68 కోట్ల సబ్సిడీతో ఏర్పాటు చేసి, రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచామని, జిల్లాలోని 27,053 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ అందించామన్నారు. . ఎన్నో దశాబ్దాలుగా విద్యుత్ సౌకర్యం నోచుకోని మారుమూల పీవీటీజీ గిరిజన గ్రామాలైన మోదెల, బండారుగూడెం, చీపురుగూడెం గ్రామాల్లో పీఎం–జన్‌మన్ పథకం ద్వారా 77 కోట్ల 50 లక్షల రూపాయలతో సోలార్ మినీ గ్రిడ్లు ఏర్పాటు చేసి 108 గిరిజన కుటుంబాలకు సౌర విద్యుత్ వెలుగులు అందించి, ఆ కుటుంబాల కళ్ళలో ఆనందం చూసామన్నారు. తల్లికి వందనం పథకం క్రింద ఇప్పటివరకు 2 లక్షల 40 వేల 921 మంది విద్యార్థులకు 361 కోట్ల 38 లక్షల రూపాయలను విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేసామన్నారు. "వీబీజీ రామ్ జీ పథకం" క్రింద ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక కోటి ఎనిమిది లక్షల ఉపాధి పనిదినములు కల్పించి, 324 కోట్ల రూపాయిలను వేతనాలుగా అందించేందుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు.

గంజాయి నిర్మూలనకు ఏలూరు జిల్లాలో పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపడున్నాడన్నారు. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న, కలిగి ఉన్న వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటూ జైలుకు పంపించడం జరుగుతోంది. వాట్సాప్ గవర్నెన్స్ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులువు చేస్తున్నామని, మన మిత్ర యాప్ ద్వారా జిల్లాలో 1156 సేవలపై ఇంతవరకు 1, 29, 600 మంది ప్రజలకు అవగాహన కల్పించి, 2 లక్షల 16 వేల 916 పౌర సేవలను అందించామన్నారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, ట్రైనీ కలెక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి, డిఎఫ్ఓ సందీప్ రెడ్డి, డిఆర్ఓ ఎం. శ్రీదేవి, ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, జెడ్పి సీఈఓ జగదాంబ, ఏపి వడ్డీలు కార్పొరేషన్ చైర్ పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ లో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

### పతాకావిష్కరణ చేసిన రోటరీ క్లబ్ అధ్యక్షులు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి
### ఎందరో త్యాగధనుల ఫలితమే స్వాతంత్రం సిద్ధించింది
### పాస్ట్ ప్రెసిడెంట్ ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎంసీ వేణుగోపాల్
### మహాత్ముల అడుగుజాడల్లో మనమందరం నడవాలి
### ఇన్నర్ విల్ అధ్యక్షురాలు బైసాని ఉమామహేశ్వరి






**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 15 నంది పత్రిక** 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శనివారం నాడు ఆళ్లగడ్డ పట్టణంలోని రోటరీ క్లబ్ భవనంలో ఘనంగా జరిగాయి..ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ అధ్యక్షులు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి జాతీయ జెండాను ఎగుర వేసి గౌరవ వందనం చేశారు ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందన్నారు మనమందరం వారి అడుగుజాడల్లో నడవాలి అన్నారు పాస్ట్ ప్రెసిడెంట్ ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎంసీ వేణుగోపాల్ మాట్లాడుతూ తెల్ల దొరల పాలలో బందీగా ఉన్న భరతమాతను విముక్తి చేయడంలో జాతిపిత మహాత్మ గాంధీ చేసిన పోరాటం ప్రత్యేకమైనది అన్నారు స్వాతంత్ర అనంతరం మన దేశాన్ని మనమే పరిపాలంచుకునే విధంగా దేశానికి ఆదర్శవంతమైన పాలన అందింది అన్నారు ఎంతోమంది ప్రాణాలు అర్పించిన వారి త్యాగాలు వృధా కానివ్వరాదని దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని అన్నారు, ఈ స్వాతంత్రం రావడానికి ఎంతోమంది మహానుభావుల కృషి వారి త్యాగ ఫలితమే ఆయన అన్నారు ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు వైశాలి ఉమామహేశ్వరి మాట్లాడుతూస్వాతంత్ర సమరయోధుల అడుగుజాడల్లో నేటి యువతరం అందరము ఆదర్శ భావాలతో మనమందరం ముందుకెళ్లాలన్నారు రోటరీ క్లబ్ నూతన సభ్యులైన వారికి చార్టెడ్ అధ్యక్షులు ఆదేశాలు మేరకు శాలువలతో చిరు సన్మానం జరిగింది సన్మాన గ్రహీతలు ఎమ్మెస్ నారాయణరెడ్డి నిచ్చిన మెట్ల రామయ్య బండారు దస్తగిరి సోమల చంద్రశేఖర్ రెడ్డి లక్ష్మీకాంత్ రెడ్డి రేపాకుల శ్రీనివాసులు సిద్ధం రెడ్డి వెంకట్రాంరెడ్డి సన్మానం జరిగిందిస్వాతంత్ర వేడుకలు పాల్గొన్న సభ్యులు సెక్రటరీ చంద్రసేన టీఎస్ సత్యనారాయణ ఫాస్ట్ ప్రెసిడెంట్ దేవిశెట్టి హరిబాబు కెవి సుబ్బారెడ్డి మాటీవీ ప్రసాద్ బైసాని రవి ప్రకాష్ పోరెడ్డి రామచంద్రారెడ్డి మల్లికార్జున మూర్తి బద్రిశెట్టి సత్యనారాయణ డాక్టర్ రత్నరాజు ఇన్నర్ విల్ ప్రెసిడెంట్ బైసాని ఉమా మహేశ్వరి వై కవిత జి ఉషారాణి సెక్రటరీ పోలేపల్లి గీత ప్రవళిక ఎన్ అనసూయ లావణ్య టి విజయ ఇ పాల్గొన్నారు

# హుందాతనం కోల్పోతున్న రాహుల్ !

రాజకీయాల్లో హుందాతనం అవసరం. సమయానుకూలంగా మంచిగా మాట్లాడేలా వ్యవహరించాలి. సమస్యలపై అవగాహన ఉండాలి. అందులోనూ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తికి ఇవన్నీ అవసరం. ప్రతిపక్ష నేతగా సమర్థత ఉంటేనే రాణిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు ఎలాగైనా చెల్లుతుంది. కానీ ప్రతిపక్షనేతగా రాణించాలంటే ప్రజల్లో తన వ్యక్తిత్వం కూడా పెంచుకోవాల్సి ఉంటుంది. మాటలు, చేతలు అన్నీ హుందాగా ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ ఈ మధ్య మరీ దిగజారి పోయారు. మాటల్లో హుందాతనం లేదు. చేతల్లో అంతకన్నా లేకుండా పోయింది. సర్కస్‌లో జోకర్‌లా, డ్రామాల్లో విదూషకుడిలా ఆయన ప్రవర్తిస్తున్న తీరు జుగుప్స కలిగిస్తోంది. లోక్‌సభలో మాట్లాడాల్సిన సమయంలో మాట్లాడరు. మాట్లాడితే పస ఉండడం లేదు. సమస్యలపై అవగాహన ఉండడం లేదు. విషయంపై పట్టు ఉండడం లేదు. ఇవన్నీ కలగలిపి రాహుల్ గాంధీ విపక్ష నేతగా పూర్తిగా విఫలం అవుతూ వస్తున్నారు. ఇటీవల వరుసగా పార్లమెంట్ సమావేశాలు దెబ్బతినడానికి ప్రధాన కారణం కూడా రాహుల్ అన్న విషయం మరచిపోరాదు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఆయన ఎంతగా దిగజారిపోయారో అనడానికి నిదర్శనంగా నిలిచాయి. ఆలింగనాలే ప్రధాన మంత్రి మోదీ విదేశీ దౌత్యం అంటూ... లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు..ఆయన ఆహార్యం సామాన్యులకు కూడా వెగటు పుట్టించేలా ఉన్నాయి. అహంకారం హద్దులు దాటి రాహుల్ నోరుజారుతున్నారనడానికి ఇంతకన్నా నిదర్శం అక్కర్లేదు. ఇది ఓ రకంగా భారత ప్రతిష్ఠను దిగజార్చేలా ఉంది. ఇలాంటి ప్రతిపక్ష నేతను గతంలో ఎప్పుడూ చూడలేదని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ నిజం. ఎందుకంటే భారత దౌత్యంపై రాహుల్ చేసినవి దిగజారుడు వ్యాఖ్యలు చూశాక ఇలాంటి ప్రతిపక్ష నేత ఉన్నందుకు దేశ ప్రజలు సిగ్గుపడాలి. ఆయన ప్రవర్తన ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. రాహుల్ వ్యాఖ్యలు విదేశాల్లో భారత్ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయి. ఎందుకంటే రాహుల్ అహంకారంతో చేసిన వ్యాఖ్యలు వ్యవహరించిన తీరు పిచ్చిగా మారుతోందనడానికి చెప్పడానికి సిగ్గుపడాల్సిన పనిలేదు. భావి భారత ప్రధాని అని కాంగ్రెస్ శ్రేణులంతా పొగడుతున్న వేళ..ఆయన భాషను, ఆహార్యాన్ని చూస్తుంటే..ఇతనూ ఒక నేతేనా అన్న సందేహం కలుగక మానదు. ఇలాంటి వారిచేతిలో భారత్ పదిలంగా ఉండగలదా అన్న భయం కలుగుతోంది. భారతదేశాన్ని నడపడానికి సుదీర్ఘ అనుభవం కావాలి. పనికిమాలిన నాటకాలు కాదు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని జోకర్లని పిలవడం, మోడీని, అమిత్ షాలను కట్టగట్టి తిట్టడం పరిధికి మించిన విషయం. రాహుల్ వాడుతోన్న భాష మూర్ఖత్వాన్ని, నిరాశను తెలిజేస్తున్నాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా చెప్పుకోవాలి. అలాగే విదేశాల్లో వివిధ నేతలతో మోడీ ఆలింగనాలపైనా కువ్యాఖ్యలు చేశారు. నిజానికి ఓ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తి విదేశీ నాయకులపై రాజకీయ వ్యాఖ్యలు చేసేటప్పుడు గౌరవప్రదమైన వైఖరి ప్రదర్శించాల్సి ఉంటుంది. తానొక విపక్షనేతను అన్నది మరచి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడు రాజకీయాలకు పారాకాష్టగా చూడాలి. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర తరవాత ఆయన నాయకత్వం పట్ల ప్రజల్లో కొంత విశ్వసనీయతను పెంపొందించిందనడంలో సందేహం లేదు. ఆ యాత్రతో ఆయన ప్రజల మనిషిగా మారడానికి తపించారు. అయితే సార్వత్రిక ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌ను మళ్లీ ఒక కుటుంబ వ్యవస్థగా మార్చేయడంతో భారత్ జోడో యాత్ర నాటి ఆదర్శం లేకుండా పోయింది. ఇప్పుడు జన్‌జి అంటూ మాట్లాడుతున్న రాహుల్ వారికి పార్టీలో అవకాశం ఇవ్వలేక పోయారు. ప్రియాంకగాంధీని వయనాడ్ నుంచి లోక్‌సభకు ఎన్నిక చేయించుకున్నారు. తల్లి సోనియాను రాజ్యసభకు పంపారు. తాను రాయబరేలి నుంచి ఎన్నికయ్యారు. ఇది కుటుంబ పార్టీ అనకుండా ఎలా ఉండగలం. వృద్ధనేతలంతా కాంగ్రెస్‌లో పాతుకు పోయారు. యువ నేతలను దరిచేరనీయకుండా చూసుకుంటున్నారు. వీరు జన్‌జీ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. తాను దక్షిణాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, తన సోదరుడు ఉత్తరాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని, తద్వారా తాము ఈ సువిశాల దేశాన్ని సమైక్యం చేస్తున్నామని ప్రియాంక చెప్పుకోవడం సిగ్గుచేటు. 2024 సార్వత్రిక ఎన్నికలలో 99 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించడంతో రాహుల్ విధేయులు ఆయనను కాబోయే ప్రధానమంత్రి అని కీర్తించడం ప్రారంభించారు. కొందరు మేధావులు, పాత్రికేయులు కూడా ఆ కీర్తనకు వంతపాడుతూ వచ్చారు. రెండు సంవత్సరాల తరువాత ఇప్పుడు వెనుతిరిగి చూస్తే అంత సీన్ రాహుల్‌కు లేదని అనిపిస్తోంది. తాజాగా రాహుల్ చేష్టలు, వ్యాఖ్యలు ఆయనలో నాయకత్వ పటిమ లేదని నిరూపించాయి. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ క్రమంగా వెనుకపడిపోతోంది. కాంగ్రెస్ పతనాన్ని రాహుల్‌గాంధీ నిలువరించలేక పోతున్నారు. ప్రధానమంత్రి పదవి విషయంలో నరేంద్ర మోదీతో పోలిస్తే .. రాహుల్‌లో క్రమశిక్షణ, హుందాతనం, విద్యార్హతలు, నాయకత్వ నైపుణ్యాలు ఎక్కడా కనిపించవు. సమయానుకూలంగా ఏదో ఓ సమస్యపై మాట్లాడడం, విదేశాలకు చెక్కేయడం అలవాటు చేసుకున్నారు. అక్కడా భారత పరువు పోయేలా మాట్లాడడం కూడా అలవాటు చేసుకున్నారు. 'ఓటు చోరీ'పై ఇలాగే చేశారు. ప్రతిపక్ష నేతగా ప్రధాని కన్నా ఎక్కువ కష్టపడాలి. ఎక్కువగా కృషి చేయాలి. యూపీఏ అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో రాహుల్ మంత్రిపదవిని చేపట్టేందుకు అంగీకరించలేదు. దీంతో ఆయనకు అధికారంలో ఉండడం ఎలా అన్నది కూడా తెలియదు. ప్రస్తుత కల్లోల అంతర్జాతీయ పరిస్థితులలో ఈ సువిశాల దేశానికి ప్రభావశీల ప్రధానమంత్రి కాగలరని భారతీయ ఓటర్లు మాత్రం ఎలా నమ్ముతారు. గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోలేని రాహుల్, ఇప్పటికీ పదేపదే అవే తప్పులు చేయడంతో పాటు, రాజకీయ హుందాను కోల్పోతున్నారు. 2019లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్ నిర్వహించిన 'చౌకీదార్ చోర్' ప్రచారం ఘోరంగా విఫలమవడమే కాకుండా కాంగ్రెస్‌నే ఎదురు దెబ్బతీసింది.

# దేశ భవిష్యత్ ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం

భారతదేశ 80వ స్వాతంత్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగం దేశ భవిష్యత్తు ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం చేసింది. 2047 నాటికి 'వికసిత్ భారత్', స్వయంసమృద్ధి సాధించడమే లక్ష్యంగా, దేశాన్ని నడిపించే ఏడు ప్రాథమిక శక్తులను 'సప్తధార' పేరుతో ఆయన ఆవిష్కరించారు. ఈ ఏడు రంగాలు భారతదేశ రాబోయే ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు చోదక శక్తులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. మొదటి ధార మాన్యుఫ్యాక్చరింగ్. దేశ తదుపరి వృద్ధి దశకు మాన్యుఫ్యాక్చరింగ్ బలమైన పునాదిగా మోడీ అభివర్ణించారు. కేవలం చిన్న విడిభాగాల తయారీకే పరిమితం కాకుండా సంపూర్ణ ఉత్పత్తుల తయారీపై భారత్ దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్‌ను ఒక కీలక భాగస్వామిగా నిలబెట్టేందుకు ధర, నాణ్యత, విస్తృత స్థాయి ఉత్పత్తి అనే మూడు అంశాలపై తయారీదారులు దృష్టి పెట్టాలని సూచించారు. మన ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, ఖచ్చితత్వంతో కూడిన నాణ్యత ఐడెంటిటీగా మారాలని చెప్పారు. సప్తధారలో రెండవది వ్యవసాయం, ఆహార భద్రత. దేశ అభివృద్ధి ప్రయాణంలో వ్యవసాయ రంగ ప్రాధాన్యతను నొక్కి చెప్పిన ప్రధాని, ఆర్థిక వృద్ధిలో ఆహార ఉత్పత్తి, వ్యవసాయం ఎప్పటికీ కేంద్రబిందువులుగా ఉంటాయని స్పష్టం చేశారు. సుదీర్ఘకాల ఆహార భద్రతను నిర్ధారించడానికి వ్యవసాయరంగాన్ని బలోపేతంచేసి, ఉత్పాద కతను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికత, ఆవిష్కరణలు మూడవ ధారగా అభివర్ణించారు. ప్రపంచం డేటాసెంటర్లు, రోబోటిక్స్, సరికొత్త సాంకేతికతల యుగంలోకి అడుగు పెడుతోందని, ఈ రంగాల్లో భారత్ గ్లోబల్ హబ్‌గా మారాలని పిలుపునిచ్చారు. యుపిఐ విజయం ద్వారా భారత్ తన సాంకేతిక సామర్థ్యాన్ని ఇప్పటికే ప్రపంచానికి నిరూపించిందని, ఇప్పుడు మరింత పెద్ద లక్ష్యాలను నిర్దేశించు కోవాలని చెప్పారు. అలాగే నెక్స్ట్–జెన్ టెలికమ్యూనికేషన్‌ను వేగవంతం చేస్తూ, స్వదేశీ 6ఉ సాంకేతికతను దేశంలోని మూలమూలలకూ తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. నాల్గవ ధారగా మౌలిక వసతులు, 'గతి శక్తి' ద్వారా అనుసంధానాన్ని పెంచడంపై మాట్లాడారు. వ్యాపారాన్ని విస్తరించడానికి, ల్యాజిస్టిక్స్ మెరుగు పరచడానికి, వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి రోడ్లు, హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేల అభివృద్ధి అత్యంత కీలకమని, వాటికి నిరంతరం ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ వేగవంతమైన కనెక్టివిటీ సరికొత్త ఆర్థిక అవకాశాలను తెరుస్తుందన్నారు.ఐదవ ధారగా 'రక్షా శక్తి' నిలిచింది. రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ తయారీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్ వంటి అత్యాధునిక సైనిక సాంకేతికతలపై ఎక్కువ పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశద్రోహ భద్రతను గట్టిగా ఉంచడానికి ఆత్మనిర్భర్ రక్షణ రంగం ఎంతో అత్యవసరమని తెలిపారు. ఆరవ ధారగా హరిత ఇంధనాన్ని (గ్రీన్ ఎనర్జీ) ప్రధాని గుర్తించారు. పర్యావరణ పరిరక్షణను కాపాడుతూనే భవిష్యత్తు ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com